ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

తాడేపల్లిగూడెం fb.com/vaartha

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

10-2-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 9 పేజీలు: 10+4 వెల: 6.50

ఇంకా తేలని ఢిల్లీ ముఖ్యమంత్రి

నమీబియా జాతిపిత నుజోమా కన్నుమూత 5లో



# మళ్లీ దద్దరిల్లిన దండకారణ్యం

## భారీ ఎన్‌కౌంటర్

# 31మంది మావోయిస్టులు హతం

### ఇద్దరు జవాన్లు మృతి, మరికొందరికి గాయాలు

### మృతుల్లో పలువురు అగ్రనేతలు


### చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర జాయింట్ ఆపరేషన్

### 40 రోజుల్లో 80 మంది నక్సల్స్ మృత్యువాత



**చర్ల, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** వరస ఎన్‌కౌంటర్లతో ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో రక్తమోడుతుంది.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించిన విధంగా మాటలు నిజం అయ్యేలా కనిపిస్తుంది. తాజా సంఘటనలు చూస్తుంటే ..గడిచిన 40 రోజుల వ్యవధిలో వివిధ ఎన్‌కౌంటర్లలో సుమారు 80 మందికి పైగా మావోయిస్టులు మృత్యువాత పడ్డారు..తాజాగా చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఇంద్రావతి నేషనల్ ఏరియా పార్క్ అటవి ప్రాంతంలో ఆదివారం మావోయిస్టులకు భద్రతా బలగాల మధ్య భారీ ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎదురుకాల్పుల్లో 31 మంది మావోయిస్టులు మృతిచెందగా ఇద్దరు జవాన్లు మృతిచెందారు.మరో ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి.నేషనల్ పార్క్ అటవి ప్రాంతంలో ఇంద్రావరి ఏరియా కమిటీతో పాటు మరికొందరు మావోయిస్టు అగ్రనేతలు సమావేశం అయ్యారన్న ఇంటిలిజెన్సీ (నిఘా వర్గాల ) సమాచారం మేరకు బీజాపూర్ దంతెవాడ జిల్లాలకు చెందిన డిఆర్జీ ఎస్టీఎఫ్ సిఆర్పీఎఫ్ బలగాలతో పాటు మహారాష్ట్రకు చెందిన సి60 బలగాలు ఉమ్మడి ఆపరేషన్ చేపట్టాయి. మావోయిస్టులే లక్ష్యంగా సెర్చ్ ఆపరేషన్ చేపట్టిమ భద్రతా బలగాలకు మావోయిస్టులు తారసపడటంతో >>2

# పెత్తనం కాదు.. సేవే ముఖ్యం



## ఏవ్యక్తికి నేను వ్యతిరేకం కాదు..

### ప్రజలకు మేలు చేయని విధానాలతో విభేదిస్తా

### తలసరి ఆదాయంలో రాష్ట్రం ఫస్ట్ కావాలన్నదే లక్ష్యం

### మీడియాతో సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఫిబ్రవరి9,ప్రభాతవార్తప్రతినిధి:** రాజకీయాల్లోకి వచ్చింది ప్రజలకు సేవ చేయడానికి అని నాయకులు గుర్తుంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.ఆయన తన వ్యక్తిగత కార్యాలయంలో ఈ రోజు మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ ప్రజల సంక్షేమాన్ని విస్మరించి, అధికారం, రాజకీయంతో పెత్తనం చేయాలనుకుంటే కాలగతిలో కనుమరగువుతారన్నారు.తాను ఏ వ్యక్తికి వ్యతిరేకం కాదన్నారు. ఎవ్వరితోనైనా సైద్ధాం తికంగా విబేధిస్తానన్నారు.తనదైన మార్గంలో ప్రజా సంక్షేమానికి కృషి మంచిని సాధించామన్నారు. వ్యకిగత కక్షలతో వ్యవహరించిన అధినేతలకు ప్రజలే గట్టి బుద్ధి చెబుతారు. విధ్వంసం చాలా సులభం. నిర్మాణాత్మకంగా పనిచేయడం చాలాకష్టం. మొత్తం ప్రజల అవకాశాలను సర్వ నాశనం చేశారు. సంపద సృష్టించలేని వ్యక్తులు, ప్రభుత్వ ఆదాయం పెంచలేని వ్యక్తులకు బటన్ నొక్కే అర్హతలేదు. ప్రజలకు సంక్షేమం అందించి, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలి. అదే సుస్థిర పాలన. బాధ్యత కలిగిన రాజకీయ పార్టీలుగా మనందరం ఎన్నికల మేనిఫెస్టో చెప్పాం కాబట్టి ఏం చేసినా పర్లేదు, ఇష్టానుసారంగా మాట్లాడతానంటే కుదరదు.తాను వ్యక్తులను విమర్శించడంలేదు. వారు అవలంభించిన సిద్ధాంతాల వల్ల ప్రజలకు మేలు జరగలేదని చెబుతున్నారు. జగన్ రెడ్డిని ప్రజలు ఎమ్మెల్యేగానే గెలిపించారు. ప్రతిపక్ష నేతగా కాదు. విలువలు లేని వారు విలువలపై మాట్లాడటం సబబు కాదు. నా అరెస్ట్ ను వ్యతిరేకిస్తూ 60 దేశాల్లో నిరసనలు తెలిపారు. తెలంగాణలోనూ నిరసనలు జరిగాయి. వాటిని అణగదొక్కాలని చూశారు. కానీ ఏమైందో అందరం చూస్తున్నాం. ఒకప్పుడు కమ్యూనిస్టులు బలంగా ఉన్నారు. నేడు ఆదరణ కోల్పోయారు. 1995లో నేను ప్రజలను చైతన్య పరిచాను. నేడు నరేంద్ర మోడీ అదే చేస్తున్నారు. నేడు >>2



# మణిపూర్ సిఎం రాజీనామా

### గవర్నర్‌కు రాజీనామా సమర్పించిన బీరేన్‌సింగ్

### తెగల సంక్షోభంలో కునారిల్లిన రాష్ట్రం

**ఇంపాల్, ఫిబ్రవరి 9:** మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్ బీరేన్‌సింగ్ ఆదివారం తన పదవికి రాజీనామా చేసారు. తన రాజీనామా లేఖను ఇంఫాల్‌లోని గవర్నర్ అజయ్‌కుమార్‌భల్లాకు అందచేసారు. తొలతిసారి 2017లో రాష్ట్రముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన బీరేన్‌సింగ్ రెండోసారి 2022లో సీఎంగా నియమి తులయ్యారు. సీఎంగా రాజీనామా చేయడానికి ముందు బీరేన్‌సింగ్ ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయ్యారు. రాష్ట్ర సీఎంగా బాధ్యతలుచేపట్టిన తర్వాత గత రెండేళ్లుగా మణిపూర్‌లోని మెయిటీ కుకీజాతుల మధ్య హింసకొనసాగుతున్నది. రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య >>2

# అలసత్వం విడనాడండి

### ప్రజాభిప్రాయానికి అనుగుణంగా శాఖల తీరు మార్చుకోవాలి

### అధికారుల తీరుపై సిఎం చంద్రబాబు ఆగ్రహం

**విజయవాడ,ఫిబ్రవరి9,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు పరిష్కరించడంలో రెవెన్యూశాఖలో అలసత్వం వీడనాడకుంటే తీవ్రస్థాయిలో స్పందించాల్సి వస్తుందని ఏపీ సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులను పరిష్కరించడంలో రెవెన్యూ యంత్రాంగం నాన్చుడు వైఖరిని ఎందుకు ప్రదర్శిస్తున్నారని సీఎం చంద్రబాబు మండిపడ్డారు.ఈ విషయంలో పదేపదే చెబుతున్నా జిల్లాల్లో పరిష్కార చర్యలు తీసుకోవడంలో ఎందుకు రెవెన్యూ అంశాలను పరిష్కరించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారంటున్నారు.రెవెన్యూ అంశాలకు సంబంధించి పౌరసదస్సులో, టీడీపీ ప్రజా దర్బారులో వస్తున్న ఇంకా,ఇంకా ఫిర్యాదులు రావడంపై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా స్పందించి, అధికారులను వర్చువల్‌గా ప్రశ్నించారంటున్నారు.ఇక వివిధ మార్గాల్లో గతేడాది జూన్ 15 నుంచి ఇటీవల వరకు రెవెన్యూ శాఖకు సంబంధించి ప్రభుత్వానికి సుమారు 3.53 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో ఇప్పటివరకు 1.71 లక్షల అర్జీలను మాత్రమే పరిష్కరించినట్లు గణాంకాల ద్వారా తెలుస్తోంది. పరిష్కారమైనట్లు చెబుతున్న వాటిలోనూ కొన్ని దరఖాస్తులపై తీసుకున్న చర్యలు కాగితాలపైనే ఉన్నాయని సమచారం. వినతులు పరిష్కార చర్యలపై రెవెన్యూ శాఖ ప్రతి వారం సమీక్షిస్తూనే ఉంది. బాధితుల వినతులు తహసీల్దార్ల నుంచి వీఆర్వోల వద్దకు వెళ్తున్నాయి. వీఆర్వోల్లో కొందరు వీటిపై శ్రద్ధపెట్టకుండానే పరిష్కరించినట్లు చూపుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వీఆర్వోలు, ఇతర రెవెన్యూ సిబ్బంది కొరతతోపాటు, ఇతర విధుల భారం ఉన్నతాధికారులను ఇబ్బందిపెడుతోంది. వీటిలో ఇప్పటివరకు 78,767 మాత్రమే పరిష్కారమయ్యాయి. మరో 1.6 లక్షలు పరిశీలనలో ఉన్నాయి. భూ ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులు 83శాతం, ప్రభుత్వ భూఆక్రమణలపై 80 శాతం, భూ కేటాయింపులకు సంబంధించి 73 శాతం వరకు ఉన్నాయి. కొన్ని ఫిర్యాదులు రీసర్వేకు చెందినవి. ఫిర్యాదుల పరిష్కారంలో పార్వతీపురం, పాలకొండ, శ్రీకాకుళం, పలాస రెవెన్యూ డివిజన్లు బాగా వెను కబడ్డాయి. ఫిర్యాదుల పరిష్కారంలో విజయవాడ, తిరువూరు, చీరాల డివిజన్లు ముందు వరసలో ఉన్నాయి. వార్డు, రెవెన్యూ కార్యదర్శుల పని తీరుపై 7,677 ఫిర్యాదులు వచ్చాయి. అత్యధిక ఫిర్యాదులు ఎన్టీఆర్ జిల్లాలో నమోదయ్యాయి. కొందరు అన్నదాతలు తమ భూమికి 1బి అడంగల్ ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని, చర్యలు తీసుకోవాలని అధికారులందరికీ విజ్ఞప్తులు ఇచ్చినా పరిష్కారం దొరకడంలేదని చెబు >>2

# మిర్చి కూలీల ట్రాక్టర్ బోల్తా

### నలుగురు మహిళల దుర్మరణం

### పలువురికి తీవ్రగాయాలు

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ముప్పాళ్ళ మండలం చాగంటివారి పాలెం గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం మిర్చి కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాకొట్టిన సంఘటనలో నలుగురు మహిళా కూలీలు దర్మరణం చెందారు. పోలీసుల కథనం ప్రకారం ముప్పాళ్ళ మండలం చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన మహిళా కూలీలు సుమారు 30 మంది ట్రాక్టర్‌లో మిరపకాయలు కోసేందుకు వెళ్ళారు. పని ముగించుకొని తిరిగి సాయంకాలం సమయంలో అదే ట్రాక్టర్‌లో ఇంటికి వస్తుండగా కూలీలతో ఉన్న ట్రాక్టర్ అదుపుతప్పి సమీపంలోని మాదల పంట కాలువలో బోల్తా పడింది. ఈ సంఘటనలో చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన మధిరా గంగమ్మ (60), తేనేపల్లి పద్మావతి (53), మధిరా సామ్రాజ్యం (60), చక్కిర మాధవి (33)మృతిచెందారు. ప్రమాదవిషయం తెలుసుకున్న పోలీసులు, గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అదే విధంగా మృత >>2

# కొత్త జిల్లాలపై కసరత్తు

### మరో రెండు జిల్లాల ఏర్పాటుకు సిద్ధం

### రంపచోడవరం, మర్కాపురం జిల్లాల కోసం డిమాండ్లు

### గత ప్రభుత్వ తప్పిదాలను సరిచేయాలని కూటమి ప్రభుత్వం సంకల్పం

**ఒంగోలు, ప్రభాతవార్త:** రాష్ట్ర విభజన తరువాత ఏపీలో 13 జిల్లాలు ఉండేవి. అవి కూడా 1978లో చివరి సారి విజయనగరం జిల్లా ఏర్పాటు తరువాత మళ్లీ కొత్తగా ఏపీ ఏర్పడలేదు. దాంతో విభజన తరువాత కొత్త జిల్లాలు కావాలనే డిమాండ్ వచ్చింది. దానిని టీడీపీ తొలి విడత అధికారంలో చేయలేకపోయింది. టీడీపీకి ఈ విషయంలో కొనిన ఆలోచనలు ఉన్నాయి. దాంతో నెమ్మదిగా చేద్దామనుకునేలోపే 2019లో అధికారం చేజారింది. ఇక వైసీపీ అదికారంలోకి వచ్చాక పార్లమెంటు ప్రాతిపదికన జిల్లాలను కొత్తగా ఏర్పాటు చేసింది. అయితే దీనిపై కూడా రకరకాల విమర్శలు వచ్చాయి. శాస్త్రీయ విభజన అయితే జరగలేదని కూడా అన్నారు. వైసీపీ ఓటమిలో ఈ కొత్త జిల్లాల ఏర్పాటు వెనుక ఉన్న కొన్ని ప్రాంతాల ప్రజానీకం అసంతృప్తి కూడా బలంగా పని చేసిందని చెప్పవచ్చు. ఇక దానిని పట్టుకున్న టీడీపీ ఎన్నికల వేళ కొత్త జిల్లాల ఏర్పాటుకు హామీ ఇచ్చింది. అంతే కాదు వైసీపీ చేసిన కొత్త జిల్లాల వల్ల ఏర్పడిన అన్యాయం వల్ల కూడా శ్రద్ధ వహించి పని చేస్తామని పేర్కొంది. అలా చూస్తే చాలా డిమాండ్లే కూటమి ప్రభుత్వం ముందు ఉన్నాయి. అయితే ఇప్పుడు అర్జెంట్‌గా రెండు కొత్త జిల్లాలను ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తుందని అంటున్నారు. అందులో ఒకటి రంపచోడవరం కేంద్రంగా జిల్లా, రంపచోడవరం గిరిజన ప్రాంతం ఈ ప్రాంతాన్ని తెచ్చి ఏకంగా 500 కిలోమీటర్ల దూరంలో ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లాలో వైసీపీ ప్రభుత్వం కలిపింది. అంతకముందు తూర్పుగోదావరి జిల్లాలోభాగంగా రంపచోడవరం ఉండేది. ఆనాడుజిల్లా కేంద్రానికి ఇంత దూరమైతే >>2

## 'కల్తీ నెయి' కేసులో కీలకపరిణామం

సిబిఐ అదుపులో నలుగురు నెయ్యి సరఫరాదారులు 2లో





ఆదివారం బెంగళూరులోని హెచ్ఎఎల్‌ను సందర్శించిన రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

# మావోయిస్టులు హతం

>> ఇరువురి మధ్య హోరాహోరీగా ఎదురుకాల్పు జరిగాయి. ఈ ఎదురుకాల్పుల్లో 31 మంది మావోయిస్టులు మృతిచెందారు. మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు జవాన్లు మృతిచెందగా మరో ఇద్దరు జవాన్లకు గాయలైయ్యాయి.గాయపడిన జవాన్లను హుటాహుటిన హెలికాప్టర్ సహాయంతో బీజాపూర్ జిల్లా హాస్పటల్ తరలించి వైద్య చికిత్సలు అందిస్తున్నారు.ఈ ఘటనపై బస్తర్ ఐజి సుందర్ రాజ్.పి బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్‌లు మీడియాతో మాట్లాడారు.ఎన్ కౌంటర్‌లో 31 మంది మావోలు చనిపోయారని మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.మావోయిస్టులపై భద్రతా బలగాలు పై చేయి సాధించాయని ఎన్‌కౌంటర్ మృతిచెందిన వారిని గుర్తు పట్టే ప్రక్రియ కొనసాగుతుందని మరిన్ని వివరాలు తర్వాత తెలియజేస్తామని అన్నారు.సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతుందని అన్నారు.కాగా గడిచిన ఏడాది కాలంలో ఇదే అతిపెద్ద ఎన్ కౌంటర్ కావడం గమనార్హం. గడిచిన 14 నెలల వ్యవధిలో ఇప్పటి వరకు 274 మంది మావోయిస్టులు మృతిచెందగా 1169 మందిని అరెస్టు చేయగా 970 మంది లొంగిపోయినట్లు ఘణాంకాలు తెలుపుతున్నాయి. మావోలపై దాడులు కొనసాగుతాయి... చత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి హోంశాఖ మంత్రి విజయ్ శచ్మత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోలపై నిత్యం దాడులు జరుగుతాయని మావోయిస్టు రహిత చత్తీస్‌గఢ్‌నే ఎజండా ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి హోంశాఖ మంత్రి విజయ్ శర్మ అన్నారు.ఇంద్రావతి నేషనల్ పార్క్ ఏరియా లో అధివారం ఉదయం జరిగిన ఎన్ కౌంటర్ పై ఆయన మాట్లాడారు.మావోయిస్టులపై మా బలగాలు పట్టు సాధించాయని 31 మంది చనిపోయిన ఘటన భద్రతా బలగాల విజయంగా పేర్కొన్నారు. అయితే మావోల జరిపిన కాల్పుల్లో ఇద్దరు జవాన్లు మృతిచెందడం బాధాకరం అన్నారు మృతిచెందిన జవాన్లకు నివాళి అర్పిస్తు వారి పొరాట పటిమను కొనియాడారు.మావోయిస్టుల అణివేతకు నిరంతరం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతుందని అన్నారు.ఎన్ కౌంటర్ ఘటన ప్రదేశం పెద్ద ఎత్తున ఆయుధాలు లభ్యం అయ్యాయని తి47 303 రైఫిల్ ఇన్సాస్ బిజిఎల్ రాకెట్ లాంఛర్లు వంటి అత్యాధునికమైన ఆయుదాలు లభ్యం అయ్యాయని అన్నారు.

## డోజ్ వ్యవస్థకు అమెరికా కోర్టులు షాక్‌లు!

### ట్రెజరీ పత్రాలు ఇచ్చేవీలులేదని ఇంజక్షన్ ఉత్తర్వులు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 9:** అధికార బాధ్యతలుచేపట్టినప్పటినుంచి అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌కు వివాదాలే ఎదురవుతున్నాయి. ఆయన తీసుకుంటున్న నిర్ణయాలను ఫెడరల్‌కోర్టులు నిలిపివేస్తున్నాయి. యుఎస్ ఎయిడ్ సంస్థ ఉద్యోగుల ఉద్వాసనను వెంటనే నిలిపివేయాలని జిల్లాకోర్టు ఒకటి ఆదేశాలు జారీచేస్తే ఇపుడు మరో కోర్టు ఎలాన్ మస్క్ ఆధ్వర్యంలోని డోజ్ విభాగం అమెరికా ట్రెజరీ విభాగం రికార్డులు కోరడాన్ని వ్యతిరేకిస్తూ స్తంభింపచేసింది. డిపార్టుమెంట్ ఆఫ్ గవర్నరమెంట్ ఎఫిషియన్సీ (డోజ్)కు ఎలాన్‌మస్క్ ఛీఫ్‌గా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. వ్యయనియంత్రణ వృధా ఖర్చును తగ్గించడం వంటి వాటిపై పనిచేసే డోజ్ తాజాగా అమెరికా ట్రెజరీ శాఖ రికార్డులు కావాలనికోరింది. అయితే అందుకు ట్రెజరీ అధికారులు వ్యతిరేకించారు సామాజిక భద్రత డేటా, మిలియన్లకొద్దీ అమెరికన్ల బ్యాంకు ఖాతాల నంబర్లు ఉంటాయని రహస్య పత్రాలను ఒక ప్రభుత్వపరిధిలోకి రాని సంస్థకు ఇవ్వడం వీలుకాదని వ్యతిరేకించాయి. దీనిపై అమెరికా కోర్టులో కూడా పిటిషన్ దాఖలుచేయడంతో అమెరికా జిల్లాకోర్టు జడ్జి పాల్ ఎ ఎంజెల్‌మేయర్ ప్రాథమిక ఇంజక్షన్ ఉత్తర్వులు జారీచేసారు. 19 మంది డెమొక్రటిక్ అటార్ని జనరల్స్ అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌పై వ్యాజ్యం దాఖలుచేయడంతో కోర్టు ఈపిటిషన్‌ను విచారించి డోజ్ ఉత్తర్వులపై నిలిపివేత ఉత్తర్వులు జారీచేసారు. ట్రెజరీ శాఖ చెల్లింపుల వ్యవస్థ పన్ను రీఫండ్‌లు, సామాజిక భద్రత ప్రయోజనాలు, వెటరన్స్ బెనిఫిట్స్ మరిన్ని ఇతర కీలక విభాగాలు ఉంటాయని ప్రతి ఏటా లక్షలకోట్ల డాలర్లు చెల్లింపులు జరుపుతోందని, ఈ విభాగంలో అమెరికన్ల వ్యక్తిగత ఆర్థికడేటా మొత్తం ఉంటుందని వాదించారు. జడ్జి ఎంజెల్‌మేయర్‌ను గత అధ్యక్షుడు బరాక్ ఒబామా హయాంలో నియమితులయ్యారు. ఆయన తన ఉత్తర్వుల్లో ఎవరైనా ట్రెజరీ శాఖ డాక్యుమెంట్లను యాక్సెస్‌చేసునేందుకు ప్రయత్నించినా, చోరీజరిగినట్లు అనుమానం ఉన్నా వెంటనే ట్రెజరీ డిపార్టుమెంట్ సిస్టమ్స్‌నుంచి డౌన్‌లోడ్‌చేసిన కాపీలన్నింటినీ ధ్వంసంచేయాలని ఆదేశించారు. తదుపరి ఈ పిటిషన్‌ను 14వ తేదీకి వాయిదావేసారు. డోజ్ వ్యవస్థ ఏర్పాటుపైనా డోజ్ నిర్ణయాలను ట్రంప్ అమలుచేయడంపైనా ఆరిజోనా, కాలిఫోర్నియా, కొలరాడో, కనెక్టికట్, డెలావేర్, హవాయి, ఇల్లినాయిస్,మెయినే, మేరిల్యాండ్, మసాచుసెతట్స్, మిన్నెసోటా, నెవాడా,న్యూజెర్సి, నార్త్‌కరోలినా, ఒరెగాన్; ఱోడ్ ఐలాండ్, వెర్మంట్, విస్కాన్సిన్ రాష్ట్రాల్లో కేసులు కూడా దాఖలయ్యాయి.

### దక్షిణ మెక్సికోలో ప్రమాదం

## 41 మంది ప్రయాణీకులు మృతి

**మెక్సికోసిటీ, ఫిబ్రవరి 9:** దక్షిణ మెక్సికోప్రాంతంలో జరిగిన ఘోర బస్సుప్రమాదంలో కనీసం 41 మంది మరణించినట్లు మెక్సికో టబాస్కో రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. ముందురోజు తెల్లవారుఝామున జరిగిన ఈప్రమాదం ఎస్కార్సెగా అనే చిన్న గ్రామసరిహద్దుల్లో జరిగిందని, ప్రమాదంలో బస్సు పూర్తిగా కాలిపోయిందని తెలిపింది.

బస్సు పూర్తిగా దగ్ధం అయిన చిత్రాలు వైరల్ అయ్యాయి. కాన్‌కున్ నుంచి దబాస్కోకు ప్రయాణిస్తున్న బస్సు ట్రైలర్‌ను ఢీకొనడంతో 41 మంది మరణించారని, ప్రమాదం సమయంలో బస్సులో 48 మంది ఉన్నారని టూర్ ఆపరేటర్ సంస్థ అకోస్టా వెల్లడించింది.

ప్రమాదానికి గలకారణాలను గుర్తించేందుకు అధికారులతో కలిసి పనిచేస్తున్నామని బస్సు నియంత్రిత వేగ పరిమితుల్లోనే వెళుతోందని అన్నారు. సహాయక చర్యలు జరుగుతున్నాయని టబాస్కో ప్రభుత్వంప్రకటించింది.

## మిర్చి కూలీల ట్రాక్టర్ బోల్తా

>> దేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పొట్టకూటి కోసం మిరపకాయలు కోసేందుకు వెళ్ళి మృత్యువాతపడిన తమవారి మృతదేహాలను చూసి కుటుంబసభ్యులు, బంధువులు రోధిస్తున్న తీరు పలువురిని కంటతడిపెట్టించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామంలో ఒకేసారి, ఒకే రోజు ట్రాక్టర్ ప్రమాదంలో నలుగురు మృతి చెందడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా ఈ మేరకు ముప్పాళ్ళ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పెత్తనం కాదు.. సేవ ముఖ్యం

>> ప్రజలకు సంతృప్తి కలిగే పాలన అందిస్తున్నాను. ఏ ఆఫీసర్, ఏ కార్యకర్త తప్పు చేసినా నాదే బాధ్యత. సాంకేతికత సాయంతో ఫైల్స్ ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని నేను మంత్రులకు చెబితే వక్రీకరించి రాస్తున్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ను కూడా నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు. ప్రజలను మభ్య పెట్టి ఇష్టానుసారంగా పక్కదారి పట్టిస్తున్నార్రు అని సీఎం చంద్రబాబు అన్నారు. ఢిల్లీ ప్రజలు బీజేపీకి చారిత్రాత్మక విజయాన్ని అందించారు. ప్రధాని మోదీ సమర్థ నాయకత్వానికి, సుస్థిర పాలనకు పట్టం కట్టారు. ఇది దేశ ప్రజలందరి గెలుపు. గత ఐదేళ్లలో ఏపీలో, ఢిల్లీలోని ప్రభుత్వాలు ప్రజల ఆకాంక్షలను పట్టించుకోలేదు. ఓటేసిన పాపానికి ప్రజల భవిష్యత్‌పై కాటేశారు. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో అందిస్తూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచాల్సి అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఢిల్లీ ఎన్నికల్లో అధికార మార్పిడికి మోడీనే కారణమని చంద్రబాబు పునరుద్ఘాటించారు.దేశంలో ఆదర్శవంతంగా సుస్థిర పాలన అందిస్తున్న ప్రధాని మోదీని మనస్పూర్తిగా అభినందిస్తున్నాని అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో మనదేశం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రపంచంలో ఎక్కడికిపోయిన మనది భారతదేశం అంటాము. ఢిల్లీ రాజధాని అని చెబుతాము. ఎవరైనా సరే మంచి భవిష్యత్ , అవకాశాల కోసం రాష్ట్ర రాజధాని , దేశ రాజధానికి వెళ్లాలనుకుంటారు. కానీ వెదర్ పొల్యూషన్ , పొలిటికల్ పొల్యషన్ కారణంగా ప్రజలు ఢిల్లీకి వెళ్లడం మానేసి ఇతర ప్రాంతాలకు వెళతున్నారు. ఒకప్పుడు ప్రతిరోజూ బీహార్ నుంచి ఢిల్లీకి కార్మికులు వెళ్లేందుకు ట్రైన్ ఉండేది. కొన్నేళ్లుగా వారు ఢిల్లీకి రావడంలేదు. ఒక్కోసారి పరిస్థితులు తారుమారు అవుతాయి అనడానికి ఢిల్లీనే ఉదాహరణ. ప్రపంచంలో ఎక్కడైన పీపుల్స్ ఫస్ట్ నినాదమే పనిచేస్తుందనడానికి ఈ ఢిల్లీ ఎన్నికలే ఉదాహరణ. అభివృద్ధి జరగితే సంపద సృష్టించవచ్చు. సంపద వస్తే ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. ఆ ఆదాయం ఖర్చు పెడితే సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయవచ్చు. తలసరి ఆదాయం పెంచి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచవచ్చు. గుడ్ గవర్నెన్స్, గుడ్ పాలిటిక్స్ ఎంతో ముఖ్యం. మన దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభించి 34 సంవత్సరాలు అయింది. అంతకుముందు ఢిల్లీ రాజధానిగా బ్రిటీష్ పాలన అమలయ్యేది.మద్రాసు, కలకత్తా ఇలా ప్రెసిడెన్సీలు ఉండేవి. హైదరాబాద్ లాంటి కొన్ని ప్రాంతాలు ఉండేవి. 1991లో ఆర్థిక సంస్కరణలు వచ్చాయి. సంస్కరణలకు ముందు మన గ్రోత్ రేటుపై ప్రపంచం ఎగతాళి చేసేది. మన తెలుగుబిడ్డ పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలు తెచ్చారు. అందరికీ సమాన అవకాశాలు వచ్చాయి. 1995లో మహారాష్ట్ర స్థూల రాష్ట్ర ఉత్పత్తి 55 బిలియన్ యూస్ డాలర్లు.. అది 2024 నాటికి 490 బిలియన్ యూస్ డాలర్లు అయ్యింది. అంటే 9 రెట్లు వృద్ధి చెందింది. గుజరాత్ ...24 బిలియన్ యూస్ డాలర్లు కాగా ఇప్పుడు 370 బిలియన్ యూస్ డాలర్లుఅంటే 15 రెట్లు పెరిగింది. 1995-2024 మధ్య మన తలసరి ఆదాయం 9 రెట్లు పెరిగింది. తెలుగు రాష్ట్రాల్లో 3000 డాలర్ల తలసరి ఆదాయం ఉంది. 1995లో ఆర్థిక సంస్కరణలు రాగానే టెక్నాలజీని అందిపుచ్చుకుని ముందుకెళ్లాము. జనాభా ,నియంత్రణపైనా దృష్టి పెట్టాము. పబ్లిక్ పాలసీలు తెచ్చాము. పోటీ ప్రపంచాన్ని తట్టుకుని నిలబడ్డాము. ఐటీని ప్రమోట్ చేశాము. అదే సమయంలో సమర్థ నాయకత్వం, సుస్థిర పాలనతో అభివృద్ధి చేశాము. సుస్థిర పాలన, సమర్థ నాయకత్వంతోనే గుజరాత్ లో వృద్ధి రేటు పెరిగింది. 2047 నాటికి రాష్ట్రంలో తలసరి ఆదాయం 42,000 డాలర్లుకు చేరాలి. మంచి నాయకత్వంతో ముందుకెళ్తే 2047 నాటికి మన దేశమే నంబర్‌వన్ గా నిలుస్తుంది. 2047 నాటికి దేశంలో ఎక్కువ తలసరి ఆదాయం ఏపీలోనే ఉండాలన్నది మా లక్ష్యం. అలాగే రాష్ట్రంలో 15 శాతం వృద్ధిరేటు రావాలి ఢిల్లీ ప్రజలు కొంత సమయం తీసుకున్నారు కానీ మన ఏపీ ప్రజలు బటన్ నొక్కే కార్యక్రమానికి విసుగొందారు. గత ఐదేళ్లలో పాలకులు చిన్న, పెద్దా లెక్కలేకుండా ఇష్టానుసారంగా మాట్లాడారు. లిక్కర్‌లో జోక్యం చేసుకున్న కుటుంబాలు బాగుపడవు. అది పాపిష్టి డబ్బు. పేదవారి ఆరోగ్యాన్ని నాశనం చేసి ఎంజాయ్ చేసే అధికారం పాలకులకు లేదు. లిక్కర్ మాఫియాను నడిపారు. వ్యవస్థలను నాశనం చేశారు. దేవతలు ద్యానం చేసిన రిషికొండ ప్రాంతంలో ప్యాలెస్ కట్టుకున్నారు. ఢిల్లీలోనూ శేషమహల్ కట్టారు. అక్కడా, ఇక్కడా ప్యాలెస్ లోకి వారు వెళ్లలేదు. రూ.10 లక్షల కోట్ల అప్పులు చేశారు. ఓటేసిన పాపానికి కాటేశారు. ప్రజలను తక్కువ అంచనా వేసిన వారు బొక్కబోర్లా పడ్డారని వ్యాఖ్యానించారు.

# కొత్త జిల్లాలపై కసరత్తు

>> లేదు. ఈ విభజనతో పాడేరుకు రంపచోడవరం ప్రజలు వెళ్లాలంటే చాలా కష్టమయ్యేది. 500 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాడేరు జిల్లా కేంద్రం ఉంది. దాంతో తమ ప్రాంతాన్ని జిల్లాగా చేయమని కోరుతున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి రంపచోడవరం కొత్త జిల్లాగా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. అల్లూరు జిల్లాలో కలపడం వల్ల స్థానికులకు ఎంతో ఇబ్బందిగా ఉందని ఆమె అన్నారు. మంత్రిగా ఆమె ఈ విజ్ఞప్తి చేశారు కాబట్టి ప్రభుత్వం సానుకూలంగానే పరిశీలిస్తుందని అంటున్నారు. అలాగే మార్కాపురాన్ని కొత్త జిల్లా ఏర్పాటు చేయాలని ఆ నియోజకవర్గం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కోరుతున్నారు. కొత్త జిల్లా ఖచ్చితంగా ఏర్పాటవుతుందని రాష్ట్ర మంత్రి నారాయణ హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో కూటమి చంద్రబాబు దగ్గర నుంచి లోకేష్ కూడా మార్కాపురాన్ని జిల్లాగా ఏర్పాటు చేస్తామని ఎన్నికల సభల్లో చెప్పారు. ఇదిలా ఉంటే మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా కావాలన్న డిమాండ్ సుదీర్ఘమైందిగా ఉంది. దీని మీదగా కూటమి ప్రభుత్వం ఖచ్చితంగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటుందని అన్నాయి. అయితే రెండు జిల్లాలేనా ఇంకా ఏమైనా వస్తాయా అన్నది చర్చగా ఉంది. ఏపీలో చూస్తే అనేక ప్రాంతాల నుంచి డిమాండ్లు ఉన్నాయి. కొన్ని చోట్ల జిల్లాల కేంద్రాల మార్పు కోరుతున్నారు.

అలాగే రెవెన్యూ డివిజన్లు కొత్తగా కోరుతున్నారు. పాత వాటిలో మార్పులు కావాలని అడుగుతున్నారు.ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు తీర్చేందురిసిరి యస్‌గానే ఆలోచిస్తుందని అంటున్నారు. ప్రస్తుతంలో ఏపీలో 26 జిల్లాలు ఉన్నాయి. అందులో గిరిజన ప్రాంతంలో మూడో జిల్లా రావడం ఖాయంగా ఉంది. అలాగే 2,3 కొత్త జిల్లాలు కలుపుకుని 30కి చేరుతుందా అన్నది చర్చనీయాంశంగా ఉంది.

# 'కల్తీనెయ్యి' కేసులో కీలక పరిణామం

## సిబిఐ అదుపులో నలుగురు నెయ్యి సరఫరాదారులు

**తిరుమల,ఫిబ్రవరి 9ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలేశుని లడ్డూప్రసాదాల తయారీలో కల్తీనెయ్యి సరఫరా చేసిన కేసులో ఎట్టకేలకు సిబిఐ సిట్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ సరఫరాలో కీలకంగా వ్యవహరించిన తమిళనాడు ఏఆర్ డైరీ యాజమాన్యం ఎండి రాజశేఖరన్‌తోబాటు సరఫరాదారులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన విపిన్‌గుప్త, షోమిల్‌జైన్, అపూర్వచావ్దాలను సిబిఐ ఆదివారం సాయంత్రం అదుపులోకి తీసుకుంది. ఈ నలుగురిని సోమవారం ఉదయం తిరుపతిలో కోర్టులో హాజరుపరచనుందని సమాచారం. ఆదివారం రాత్రి సిబిఐ సిట్ చీఫ్ వీరేష్‌ప్రభు, మరో ఐదుగురు కీలక అధికారులు ఈ నిందితుల అరెస్టులో పాల్గొన్నారు. గత ఏడాది జూన్‌లో టిటిడికి కల్తీనెయ్యిసరఫరాచేశారని ప్రభుత్వం గుర్తించింది. దీంతో ఈ కల్తీపై దర్యాప్తుకు ప్రభుత్వం తొలుత రాష్ట్రపోలీసు అధికారులతో సిట్‌ను ఏర్పాటు చేసినా ఆరోపణలు రావడంతో చివరకు సుప్రీంకోర్టు ధర్మా సనం ఆదేశాలతో సిబిఐ అధికారులతో, రాష్ట్రపోలీసుఅధికారులుతో, ఆహారభద్రత అధికారితో సిట్‌ను ఏర్పాటుచేసి కీలకంగా 25రోజులు దర్యాప్తు చేపట్టింది. తిరుపతిలోనే సిబిఐ సిట్ అధికారులు తిష్టవేసి అనేక కోణాల్లో ఆధారాలు సేకరించారు. టీమ్ అధికారులు తిరుమల,తిరుపతికి చేరుకుని దాదాపు మూడువారాలు పాటు అన్ని కోణాల్లో దర్యాప్తు చేశారు. పలు రకాల రికార్డులు, ఆధారాలు సేకరించారు. నేడు కోర్టులోహాజరుపరిచిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడించనున్నారు.




# అలసత్వం విడనాడండి

>> తున్నారు. భూమిని ఆక్రమించారని పలుమార్లు అధికారులకు ఫిర్యాదుచేసినా న్యాయం జరగలేదని మరికొందరు ఆరోపిస్తున్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు, అడంగల్, 1బిలో తప్పులు ఉండటంతో మరి కొందరు రైతులకు ప్రభుత్వ నుంచి అందాల్సిన ఆర్థిక లబ్ధితోపాటు పంట రుణాలను పొందలే కపోతున్నారు. రీ సర్వే జరిగే గ్రామాలకు కొన్ని మండలాల నుంచి సిబ్బందిని డిప్యూటేషన్‌పై పంపారు. రాష్ట్ర ప్రభుత్వానికి అందిన 3.53 లక్షల ఫిర్యాదులు లేదా వినతుల్లో 1.85 లక్షలు రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చాయి. 28 క్యాట గిరీలకు చెందిన సమస్యలను వెంటనే పరిష్క రించాలని సీఎం చంద్రబాబు రెవెన్యూ అధికా రులను ఆదేశించారు. ఇక పీపుల్‌ఫస్ట్‌అనే విధానంలో ప్రజల జన అభిప్రాయాలు, అంచనాల మేరకు ప్రతి ఉద్యోగి, ప్రతి అధికారి, ప్రతి విభాగం పనిచేయాలని సిఎం చంద్రబాబు అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల లబ్ధిదారుల నుంచి నేరుగా సేకరించిన సమాచారం ఆధారంగా ఆయా శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వ సేవలపై నేరుగా లబ్ధిదారులు ఏమంటున్నారు అనే అంశంపై ఐవిఆర్‌ఎస్‌తో పాటు వివిధ రూపాల్లో సర్వేలు నిర్వహించారు. ఈ సర్వే రిపోర్టుల ఆధారంగా సిఎం శాఖల వారీగా అధికారులతో చర్చించారు.నివేదికల పరిధిలో తీసుకున్న చర్యలపైన సీఎం చంద్రబాబు నివేదికల్లో సమగ్ర సమాచారం ఉండాలని సీఎం వ్యాఖ్యానించారు.ఎవరు ఏం చెప్పినా లబ్ధిదారుల మాటే ఫైనల్ అని, ప్రజలు క్షేత్ర స్థాయి నుంచి ఇచ్చిన ఫీడ్‌బ్యాక్‌నే ప్రామాణికంగా తీసుకుంటామని అధికారులకు సిఎం స్పష్టం చేశారు. కొన్ని శాఖల్లో కింది స్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి వరకు విధానాల అమల్లో ప్రజల నుంచి సంతృప్తి వ్యక్తం అవ్వడంపై సీఎం సంతోషం వ్యక్తం చేశారు. ఆ శాఖల్లో బెస్ట్ ప్రాక్టీసెస్ వల్ల ఈ ఫలితాలు వచ్చాయని అధికారులను ముఖ్యమంత్రి అభినందించారు. ఇదే సమయంలో కొన్ని శాఖల్లో 7 నెలల కాలంలో అనుకున్న స్థాయిలో మార్పు రాకపోవడంపై సిఎం లోతుగా సమీక్షించారు. కారణాలు తెలుసుకుని దానికి అనుగుణంగా మార్పులు తేవాలని అధికారులకు సూచించారు. మొత్తం 10 అంశాల్లో నిర్వహించిన సర్వేల ఆధారంగా సమీక్ష నిర్వహించిన సిఎం...ప్రభుత్వ సేవల్లో వేగం, నాణ్యత పెరగాలని, పథకాల పంపిణీలో 1 శాతం కూడా అవినీతి ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రజల సంతృప్తి అంశంలో క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితుల ఆధారంగా ప్రభుత్వ యంత్రాంగం పని చేయాలని సూచించారు.

రాష్ట్రంలోని 7 ఆలయాల్లో దర్శనాల తీరుపై సర్వే నిర్వహించగా 70 శాతం మంది భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. వసతులపై 37 శాతంమంది భక్తుల్లో అసంతృప్తి కనిపించింది. ప్రసాదంపై మాత్రం 81 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. గతకొద్ది కాలంగా తీసుకున్న చర్యలతో ఈ విషయంలో సంతృప్తి పెరిగిందని అధికారులు నివేదికల్లో వివరించారు.ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో ఆసుపత్రుల్లో అడ్మిషన్‌పై 90 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. సేవల విషయంలో 87 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యమిత్రల పనితీరుపై 87 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరుపైన అధికారులు సీఎం చంద్రబాబుకు పలు విషయాలు వివరించారు.వైద్యులు, సిబ్బంది అందుబాటుపై 65 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవినీతి జరుగుతుందని 37 శాతం మంది అభిప్రాయం వ్యక్తం చేశారు. దీపం2 పథకంలో భాగంగా సిలిండర్ అందుకున్న 48 గంటల్లో డబ్బులు తమ అకౌంట్లలో జమ అవుతున్నాయని 48 శాతం మంది చెప్పారు. ఈ విషయంలో సాంకేతిక ఇబ్బందులను పరిష్కరించి నిర్థేశిత సమయంలో డబ్బులు అకౌంట్లో పడేలా చూడాలని సిఎం ఆదేశించారు.ఆర్టీసీ బస్సులలో ప్రయాణం సురక్షితం అని 88 శాతంమంది భావిస్తున్నారు. అయితే గమ్యస్థానాలను నిర్థేశించిన సమయానికి చేరుకునే విషయంలో 27 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. బస్‌స్టాండ్‌లలో మోలిక వసతులపై 63 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు.ఇకపోతే ఇసుక, ఎరువుల విషయంలో సంతృప్తి స్థాయి మరింత పెరగాలని సిఎం అధికారలుకు సూచించారు. ఇసుక లభ్యతపై 78 శాతం మంది, రిజిస్ట్రేషన్ ప్రక్రియపై 79 శాతం, రవాణా ఛార్జీలపై 75 శాతం మంది లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఉచిత ఇసుక విధానం మరింత మెరుగుపడాలని.నూరు శాతం సంతృప్తి కనిపించాలని సిఎం అధికారులను ఆదేశించారు.



ఆదివారం ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు సిఎం పదవికి రాజీనామా పత్రం అందజేస్తున్న అతిశి

# ముఖ్యమంత్రి పదవికి అతిశి రాజీనామా

## ఢిల్లీ అసెంబ్లీని రద్దుచేసిన లెఫ్టినెంట్ గవర్నర్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:** ఢిల్లీముఖ్యమంత్రిపదవికి అతిశిమర్లేనాసింగ్ రాజీనామాచేసారు. ఆమె తన రాజీనామాపత్రాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనాకు అందచేసారు. వెనువెంటనే గవర్నర్ సక్సేనా కూడా ఢిల్లీప్రభుత్వాన్ని రద్దుచేస్తున్నట్లు ప్రకటించారు. శనివారం వెల్లడయిన ఫలితాల్లో ఆమ్ ఆద్మీపార్టీకి ఘోరపరాభవం ఎదురయింది. మొత్తం 70 స్థానాలకుగాను బిజెపి 48 స్థానాల్లో గెలిచి అధికారం కైవసంచేసుకోగా అధికార ఆమ్ ఆద్మీపార్టీ కేవలం 22 స్థానాలకే పరిమితం అయింది. ఈ క్రమంలోనే అతిశిసింగ్ సీఎం పదవికి రాజీనామాచేసారు. గత ఏడాది సెప్టెంబరులో ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామాచేసి అతిశికి సీఎం పదవిని కట్టబెట్టారు. ఢిల్లీ లిక్కర్‌స్కామ్‌లో జైలుకువెళ్లిన కేజ్రీవాల్ గత సెప్టెంబరులో బెయిల్‌పై బయటికి వచ్చినపుడు సీఎం పదవికి రాజీనామాచేసారు. అతిశి రాజీనామా అనంతరం ఎల్జీ ఢిల్లీ అసెంబ్లీని రద్దుచేస్తూ ప్రకటన విడుదలచేసారు. ఢిల్లీ ఏడవ అసెంబ్లీని రద్దు చేస్తున్నట్లు లెఫ్టినెంట్ గవర్నర్ తన ప్రకటనలో వెల్లడించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజంయ సాధించిన బిజెపి ప్రభుత్వం ఏర్పాటుకు కసరత్తులు మొదలుపెట్టింది. న్యూఢిల్లీ అసెంబ్లీ స్థానం నుంచి కేజ్రీవాల్‌పై గెలిచిన పర్వేష్ వర్మకే సీఎంపదవి కట్టబెట్టనున్నట్లు తెలుస్తోంది. ప్రధాని మోడీ ప్రస్తుతం విదేశీ పర్యటనకు వెళుతున్నందున ఆయన అమెరికానుంచి రాగానే ఢిల్లీ సీఎం అభ్యర్థిని ఖరారు చేస్తారని తెలుస్తోంది.

## నేడు మహాకుంభమేళాలో రాష్ట్రపతి పుణ్యస్నానం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:** ఉత్తరప్రదేశ్ ప్రయాగరాజ్‌లో కొనసాగుతున్న కుంభమేళాకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరవుతున్నారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానమాచరించడంతోపాటు స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో కుంభమేళాలో భద్రతను మరింత కట్టుదిట్టంచేసారు. రాష్ట్రపతి సోమవారం ఉదయం 10 గంటలకు ప్రయాగ రాజ్ చేరుకుంటారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ప్రార్థనలుచేస్తారు. అనంతరం బడే హనుమాన్ ఆలయం,పవిత్రమైన అక్షయవత్ వృక్షాన్ని సందర్శిస్తారు. కుంభమేళా ప్రదేశంలో ఏర్పాటుచేసిన డిజిటల్‌కుంభ్ అనుభవ్‌సెంటర్‌ను పరిశీలిస్తారని రాష్ట్రపతిభవన్ వర్గాలు తెలిపాయి. ద్రౌపదిముర్ము పర్యటన సమయంలో ఆమె వెంట యూపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఉంటారని సిఎంఒ వెల్లడించింది. గతంలో భారత తొలిరాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ కూడా కుంభమేళాకు హాజరయి త్రివేణి సంగమంలో పవిత్రస్నానం చేసారు.

# మణిపూర్ సిఎం రాజీనామా

>> తలెత్తడంతో బీరేన్‌సింగ్‌ప్రభుత్వానికి వనయతిరేకంగా త్వరలో కాంగ్రెస్ పార్టీ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందు సిద్ధం అవుతున్న నేపథ్యంలో ఆయన రాజీనామాచేయడం గమనార్హం. ఆరుగురు ఎమ్మెల్యేలున్న నేషనల్ పీపుల్స్ పార్టీ నేతలతో కాంగ్రెస్ పార్టీ నేతలు సంప్రదిస్తున్నారు. మెయిటీ కుకీ జాతులమధ్య సమస్య పరిష్కారంలో బీరేన్‌సింగ్ విఫలం అయ్యారని మేఘాలయ సీఎం కోన్రాడ్ సంగ్మా ఆరోపించారు. మేఘాలయ సీఎంను మార్చాల్సిందేనని డిమాండ్‌చేస్తున్నరు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించే అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా కొందరు బిజెపి ఎమ్మెల్యేలు అసెంబ్లీకి గైర్హాజరుకావాలని నిర్ణయంచుకున్నారు. దీనితో ఇక పదవీగండం తప్పదని మణిపూర్‌లో బిజెపికి సమస్యలు వస్తాయని గుర్తించిన హైకమాండ్ బీరేన్‌సింగ్‌ను రాజీనామా చేయాలని ఆదేశించడంతో తప్పని పరిస్థితుల్లో బీరేన్‌సింగ్ రాజీనామాచేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా గడచిన రెండేళ్లుగా మణిపూర్ రావణకాష్టంగామారినసంగతి తెలి సిందే. ఆర్మీ ప్రత్యేకదళాలు అక్కడ మకాంవేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నా ఎక్కడో ఒకచోట మిలిటెంట్లు తెగలమధ్య ఘర్షణలు, ఉద్రిక్తతలు చెలరేగి పెద్ద ఎత్తున హింస చెలరేగుతోంది.ఈ క్రమంలోనే సుమారు 300 మందివరకూ ప్రాణాలు కోల్పోగా వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. ఇప్పటికీ మణిపూర్‌లో ప్రత్యేక శిబిరాలు కొనసాగు తున్నాయి. పొరుగుననే ఉన్న త్రిపుర, నాగాలాండ్, అస్సోం ప్రాంతాలకు రక్షణకోసం లక్షలాదిమంది వలసలు పోయారు. ఈ పరిస్థితుల్లో బీరేన్‌సింగ్‌ను మార్చి కొత్తనాయకత్వానికి బాధ్యతలు అప్పగిస్తే పరిస్థితులు అదుపులోకి వస్తాయని కేంద్రం భావిస్తోంది. దీనికితోడు హోంశాఖ కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన సీనియర్ ఐఎఎస్ అధికారి అజయ్‌కుమార్ భల్లాను గవర్నర్‌గా నియమించడంతో మొత్తం సమగ్ర నివేదిక హోంశాఖకు వెళ్లిందని సమాచారం. ఈ క్రమంలోనే ఇపుడు మణిపూర్‌లో నాయకత్వ మార్పిడికి అనివార్యపరిస్థితులు ఏర్పడ్డాయని మణిపూర్ నేతలు విశ్లేషిస్తున్నారు.

## వారం - వర్జ్యం

తేది : 10-02-2025, సోమవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, శుక్లపక్షం,
త్రయోదశి సా.6.58
పునర్వసు సా.6.00
వర్జ్యం : రా.2.11-3.49
దు.మ.12.53-1.39, 2) మ.3.11-3.57
శుభసమయం : ఉ.6.30-7.30,
సా.6.00-7.00
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** కుటుంబ సమస్యలు వేధిస్తాయి. సన్నిహితుల నుండి సాయం అందిస్తారు.

**వృషభం :** ఉద్యోగ యత్నాలు అనుకూలిస్తాయి. ఆకస్మిక ధనలాభం పొందుతారు.

**మిథునం:** కొత్త మిత్రుల పరిచయాలు పెరుగుతాయి. దైవదర్శనాలు చేసుకొంటారు.

**కర్కాటకం :** ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. వ్యాపారాలలో పురోగతి సాధిస్తారు.

**సింహం:** కొత్త విద్యావకాశాలు పొందుతారు. బంధువుల నుండి ఆహ్వానాలు అందుకొంటారు.

**కన్య :** ముఖ్యమైన్ నది. వనులు నకాలంలో పూర్తి చేస్తారు. దైవ దర్శనాలు పెరుగుతుంది.

**తుల :** కుటుంబ సమస్యలు తీరి ఊరట చెందుతారు. అనారోగ్యం, వాహనసౌఖ్యం.

**వృశ్చికం:** గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. వస్తు, వస్త్రా కొనుగోలు.

**ధనుస్సు:** పనులు ముందుకు సాగవు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం. ఔషధ సేవనం.

**మకరం:** కీలక నిర్ణయాలలో తొందర పాటుల వద్దు. ధనవ్యయం పెరుగుతుంది.

**కుంభం:** ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు పెరుగుతాయి. వస్తు లాభం.

**మీనం :** బంధువులతో ఏర్పడిన తగాదాలు పరిష్కరించుకొంటారు. ప్రయాణాలలో లాభాలు పొందుతారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



## కమ్మసిగడాం మహాలక్ష్మిని దర్శించుకున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

**శ్రీకాకుళం జిల్లా (రణస్థలం), ఫిబ్రవరి 9ప్రభాతవార్త** ఉత్తరాంధ్ర కల్పవల్లి భక్తుల ఇలవేల్పు అయిన శ్రీకాకుళం జిల్లాలో రణస్థలం మండలంలోని కమ్మసిగడాం గ్రామంలో శ్రీశ్రీశ్రీ మహాలక్ష్మితల్లి అమ్మవారిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి పార్లమెంటు సభ్యులు దగ్గుబాటి పురందేశ్వరి ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన పురందేశ్వరికి ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు స్వాగతం పలికి అమ్మవారి సన్నిధికి తీసుకువెళ్లారు. మహాలక్ష్మితల్లికి పురందేశ్వరితో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఎంపీ పురందేశ్వరిని ఎమ్మెల్యే ఎన్ఈఆర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బంటుపల్లి సర్పంచ్ నడుకుదిటి రజని ఎన్ఈఆర్, ఎన్ఈఆర్ స్కూల్ డైరెక్టర్ ఎన్ తేజ, కూటమి నాయకులు పిసిని జగన్నాథంనాయుడు, పిన్నింటి వెంకట భానోజీనాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో మంత్రుల పర్యటన విజయవంతం

**ఆత్మకూరు,ఫిబ్రవరి9,ప్రభాతవార్త: రాష్ట్రంలో కూటమి** ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాలో మంత్రుల బృందం పర్యటన ఆత్మకూరు నియోజకవర్గం నుంచే నాంది పలికింది. స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి సారధ్యంలో 5గురు మంత్రులు ఆదివారం పట్టణంలో పర్యటన జరిపి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. ఈకార్యక్రమాన్ని తెలుగుదేశం శ్రేణులు ఏర్పాట్లను ఘనంగా చేసి మంత్రుల పర్యటనను విజయవంతం చేశారు. రాష్ట్రంలోనే టిడ్కో గృహ సముదాయంలో తొలిసారిగా ఆత్మకూరు పట్టణంలోని టిడ్కో ఇళ్ళ సముదాయంలో 20లక్షల రూపాయలతో నూతన రామాలయ నిర్మాణానికి మంత్రి రామనారాయణరెడ్డి సారధ్యంలోని మంత్రుల బృందం శంఖుస్థాపన కార్యక్రమానికి అంకురార్పణ జరిగింది. ఆర్అండ్‌బి అతిథిగృహం, బిసిబాలికల రెసిడెన్షియల్ పాఠశాలను మంత్రుల చేతులమీదుగా ప్రారంభించారు. ఆత్మకూరులోని పంచాయతీరాజ్ అతిథిగృహానికి జిల్లా పరిషత్‌నుంచి 1.70కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నూతన భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు.

మొత్తంగా జిల్లాలో తొలిసారిగా 5గురుమంత్రుల బృందంచే ఆత్మకూరు పట్టణంలో అట్టహాసంగా పూర్తిస్థాయిలో మంత్రుల పర్యటన విజయవంతం కావడంతో ఆత్మకూరు నియోజకవర్గ ఎన్‌డిఎ కూటమి శ్రేణుల్లో జోష్ నింపింది. ఆత్మకూరు నియోజకవర్గానికి రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి సారధ్యంలో పూర్వ వైభవం వస్తుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఆనం రామనారాయణ రెడ్డి ఆత్మకూరు శాసనసభ్యులుగా, ఉమ్మడి రాష్ట్ర మంత్రి గా ఉన్న సమయంలో ఆత్మకూరు పట్టణంలోని 100పడకల జిల్లా ఆసుపత్రి, రెవెన్యూ డెవిజన్ కార్యాలయం, ఆత్మకూరు మున్సిపాల్టీ ఏర్పాటు తదితర అంశాలు ఎంతో పేరు తెచ్చాయి. మరో దపా ఆత్మకూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ఒక నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు పోతున్నారు. ఆత్మకూరు నియోజకవర్గం రాష్ట్ర స్థాయిలోనే మరోసారి ప్రాధాన్యతా స్థానం దక్కే అవకాశం ఉందని అభివృద్ధి కార్యక్రమాల పరంగా ప్రాధాన్యతను సంతరించుకోనుందని ఈప్రాంత వాసులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

## తండ్రిని హతమార్చిన తనయుడు



**దొనకొండ,ఫిబ్రవరి 9,ప్రభాతవార్త** ప్రకాశం జిల్లా దొనకొండ మండలం ఇళ్లచెరువు గ్రామంలో ఎస్సీ పాలెంకి చెందిన పి ఏసు రైల్వే విశ్రాంత ఉద్యోగస్తుడిగా ఇంటి దగ్గర జీవనం గడుపుతూ ఉండేవాడు. కుమారుడు ఈ మరియదాసు మద్యం సేవించేందుకు డబ్బులు ఇవ్వలేదని తండ్రిని హతమార్చాడు .తనయుడు తండ్రి పైడిపోగు యేసును తనయుడు పైడిపోగు మరి దాసు రంపంతో శరీరం మొత్తాన్ని గాయాలు చేసి చంపటం జరిగింది . ఈ సంఘటన ఇళ్లచెరువు ఎస్సీ పాలెంలో తెల్లవారుజామున జరిగింది. మద్యం మత్తులో తండ్రిని హతమార్చిన తనయుడు తండ్రి పైడిపోగు యేసయ్యను తనయుడు పైడిపోగు మరి దాసు రంపంతో ముఖాన్ని చెక్కేసి గొంతు కోయడం జరిగింది. గ్రామస్థుల వివరాలు మేరకు గత రెండు రోజుల నుంచి మద్యం సేవించి మత్తుగా ఉన్నాడంటూ తదుపరి మద్యం సేవించేందుకు డబ్బులు తండ్రిని అడిగితే ఇవ్వలేదని కోపంతో చెట్లను కత్తిరించు రంపం పలు రకాలుగా గాయపరచడమైనది .తక్షణమే ఆయన మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఈ కొండయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన ఇళ్లచెరువు ఎస్సీ పాలెంలో రాత్రి ఒంటిగంట సమయంలో జరిగిందని పోలీసుల ప్రాథమిక సర్వేలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో త్రిపురాంతపురం సిఐ జి.అస్సాన్, దొనకొండ ఇన్చార్జ్ ఎం శివ, డీఎస్పీ లక్ష్మీ నారాయణ, పోలీస్ శాఖ సిబ్బంది ముద్దాయిని కస్టడీలోకి తీసుకొని ఆ యొక్క ఆయుధాన్ని పోలీసులు హ్యాండ్ అవర్ చేసుకోవటం అయినది.



## కడలి తరంగాల్లా కదలి వచ్చిన భక్తులు

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిట కిట లాడింది. ఓ వైపు ఆదివారం భక్త జనం తండోపతండాలుగా కదలి వచ్చారు. దాంతో ఎటు చూసినా భక్త జనులే కనబడ్డారు. ఆదివారం ఆలయాధికారులు అందించిన సమాచారం మేరకు పాతిక వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు తెలిపారు. ఇక ప్రతి ఒక్కరు టిక్కెట్లు తప్పని సరిగా కొనాలనే నిబంధనలతో కొంత రాబడి పెరుగుతుంది. ఈ నేపధ్యంలో ఆదివారం సుమారు 7వేల మంది దర్శనం ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు.

**పెరుగుతున్న భక్తుల సంఖ్య:** పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తి. ఈ దివ్యక్షేత్రానికి రోజు రోజుకు వస్తున్న భక్తుల సంఖ్యగణనీయంగా పెరుగుతుంది. వేదికల మీద రాబోవు రోజుల్లో తిరుమల కన్నా శ్రీకాళహస్తి ప్రాశస్త్యం పెరుగుతుందని ఉపన్యాసాలిచ్చే నాయకులు ఆ దిశగావచ్చే భక్తులకు సదుపాయాల కల్పనలో దృష్టి పెట్టడం లేదు. పటిష్టమైన సెక్యూరిటి వ్యవస్థ లేదు. అలా కాకుండా తిరుమల తరహాలో భక్తులు వస్తారని గొప్పలు చెప్పుకోవటం కాదు. దానికి తగిన వ్యవస్థను పాలకులు రూపొం దించాలి. అతిధులకు ఇక్కడ ఆచార వ్యవ హారాల గురించి తెలపాలి. శ్రీకాళహస్తీశ్వ రాలయానికి భక్తులు తండోప తండాలుగా వస్తున్నారు. అయితే ఇక్కడకు వచ్చే భక్తులు స్వామి అమ్మవార్ల సుదర్శనం కోసం తహ తహ లాడుతారు. కానీ ఇక్కడకు వచ్చే విఐపిలకు అధికారులు,పాలకులు, సిబ్బంది ఇచ్చే ప్రాధాన్యత సామాన్య భక్తులకు ఇవ్వటం లేదనే విమర్శలు చోటు చేసుకున్నాయి. దాంతో ఎంతో భక్తి భావంతో వచ్చే వారు నిరాశతో తిరుగుపయనమౌతున్నారు.. దేవాదాయశాఖ స్పష్టంగా విఐపిలకు ప్రత్యేకంగా దర్శనం టైమింగ్స్ కేటాయించాలని ఆదేశించారు. గతంలో ధర్మకర్తల మండలి తీర్మానాలు, ఉన్నతాధికారుల ఆదేశాలు ఇక్కడ దిగదుడుపుగా మారింది. దాంతో పలుకుబడి, దళారులకు ఉన్నంత ప్రాధాన్యం సామాన్య భక్తులకు, ఆలయానికి విరాళాలు అందించే భక్తులకు లభించటం లేదు.

**గణనీయంగా రాహుకేతుదోష నివారణ పూజలు:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న రాహుకేతుదోష నివారణ పూజలకు గణనీయంగా ఉంది. ఆదివారం మధ్యాహ్నాం వరకు అందిన సమాచారం మేరకు రూ.500ల టిక్కెట్లు కొనుగోలు చేసి పూజలు జరిపించుకున్న వారి సంఖ్య 2678 మంది. రూ 750ల టిక్కెట్లు కొనుగోలు చేసి పూజలు జరిపించుకున్న భక్తులు 1165, రూ.1500ల టిక్కెట్లుతో 354మంది., రూ.2500ల టిక్కెట్లు 216, రూ.5వేల టిక్కెట్లు కొనుగోలు చేసి వారు 100 మంది పూజలు జరిపించుకున్నట్లు ఆలయాధికారులు జారి చేసిన సమాచారం మేరకు తెలిసింది.

ఇక అభిషేకాలు కూడా గణనీయంగా జరిగాయి. అభిషేకాలు 140 మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం 50. రికార్డు స్థాయిలో నిర్వహించారు. ఆలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలు సుమారు 5వేలు జరిగాయి. ఓ వైపు పూజలు జరుపుకునే భక్తులు మరో వైపు సామాన్య భక్తులు, ఇంకొక వైపు విఐపిల తాకిడితో కిట కిట లాడింది.

# తిరుమల సమాచారం

## దేవుని ఆశీస్సులతో అంతా శుభాలు కలగాలి

### - తిరుమలలో ప్రముఖులు



**తిరుమల,ఫిబ్రవరి 9ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు... కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అందరికీ అన్నీ శుభాలు కలగాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు. ఆదివారం వేకువజామున సుప్రభాతసేవలో డాకుమహారాజ్ సినీనటి శ్రద్ధాశ్రీనాథ్, రాష్ట్రమంత్రి సవిత ఆలయంలోనికి చేరుకుని స్వామివారి ఆశీస్సులందుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌బిష్ణోయ్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయసూర్య, ప్రభుత్వ విప్ సుబ్బరాజు కుటుంబంతో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు,అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ స్వాగతం పలికారు. ఆలయంలోనికి చేరుకుని వీరంతా ధ్వజస్తంభానికి మొక్కారు. ఆనందనిలయంలోని శ్రీవారిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఎస్వీసర్వశ్రేయాస్ ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం



**తిరుమల,ఫిబ్రవరి 9ప్రభాత వార్తప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడి నిర్వహిస్తున్న పథకాలు, ట్రస్ట్‌లలో భాగంగా దాతలు కొన్ని పథకాలకు విరివిగా విరాళాలందజేస్తున్నారు. ఆదివారం విశాఖపట్నంకు చెందిన హెచ్‌పిసిఎల్ ఉద్యోగి పిఎస్ రవికుమార్ 10,00,116 రూపాయలు డిడిని ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్ట్‌కు అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు.

ఈ విరాళాలతో మరింతమంది పేదలకు సేవచేసే భాగ్యం కలుగుతుంది. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి ఉన్నారు.

## రైల్వే టిసి పోస్టు కావాలంటే అయిదు లక్షలు ఇచ్చుకోవాల్సిందే!

### - పదోన్నతులలో పైరవీలు - ఆందోళనలో అభ్యర్థులు

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 9,ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్‌లో ఖాళీగా ఉన్న సిసి టిసి పదోన్నతులకు సంబంధించిన వ్రాతపరీక్ష శుక్రవారం జరిగింది. ఈ పరీక్షకు భారీగానే పైరవీలు,బేరసారాలు సాగుతుండటంతో కష్టపడి చదివి ప్రిపేర్ అయి పరక్ష వ్రాసిన అభ్యర్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. డివిజన్‌లోని కమర్షియల్ విభాగంలో ఖాళీగా ఉన్న కమర్షియల్ క్లర్క్ కమ్ టికెట్ కలెక్టర్ (సిసిటిసి) పోస్టులను 331/3 డిపార్ట్‌మెంటల్ కోటాలో భర్తీ చేసేందుకు సంబంధిత ఉన్నతాధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ ప్రకటన మేరకు జనరల్ కేటగిరీకి 33,ఎస్‌సి-6,ఎస్‌టి-3 చొప్పున మొత్తం 42ఖాళీలు ఉండగా ట్రాఫిక్ విభాగాలకు చెందిన 346మంది అభ్యర్థులు వ్రాత పరీక్షకు అర్హత సాధించారు. వీరికి ఈ నెల 7న శుక్రవారం స్థానిక ఎండిడిటిఐ, రైల్వే ఉన్నత పాఠశాలల్లో వ్రాత పరీక్ష నిర్వహించారు. పరీక్ష జరిగిందే తరువాయి కమర్షియల్ క్లర్ క్(సిసి) పోస్టుకు రూ.3లక్షలు,టిక్కెట్ కలెక్టర్(టిసి)పోస్టుకు రూ.5లక్షలకు పైరవీదారులు ధర కట్టారు. పోటీ దాదాపుగా 8.23నిష్పత్తి పైచిలుకు ఉండటంతో పైరవీదారులకు పండగే పండగలాగా పరిస్థితి తయారయ్యింది. ఇందుకు సంబంధించి డీల్ కుదుర్చేందుకు పర్సనల్ బ్రాంచిలో పనిచేసే ముగ్గురు వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు కమర్షియల్,ఆపరేటింగ్ విభాగాలలో పనిచేస్తున్న మరో నలుగురు సిబ్బంది,రైల్వేయేతరులైన మరో ఇద్దరు వ్యక్తుల పేర్లు ఎక్కువగా వైరల్ అవుతున్నాయి. ఈ విషయమై డిఆర్ఎం,అదనపు డిఆర్ఎం,సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించి అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని పలువురు అభ్యర్థులు కోరుతున్నారు.

# సమన్వయంతో కార్యక్రమాలు

### - సంస్కరణల దిశగా ఇఒ, అదనపు ఇఒ అడుగులు



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** హిందువుల పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమల ఆలయ పవిత్రతను కాపాడేందుకు... భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పనకు నిరంతరం అధ్యయనం చేస్తూ ఆదిశగా ప్రణాళికలు రూపొందించడంలో టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి కృషి చేస్తున్నారు. ఇద్దరూ వారివారి హోదాల్లో తిరుమలతిరుపతిదేవస్థానం పరిపాలనపై పూర్తిస్థాయిలో అవగాహన,సమన్వయంతో వ్యవహారిస్తుండటంతో భక్తులకు గంటల తరబడి నిరీక్షణ లేకుండా త్వరితగతిన దేవుని దర్శనం చేయించడంలో కొంతవరకు సఫలీకృతులయ్యారనే భక్తుల అభిప్రాయం. గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వంలో తిరుమల పవిత్రతను దెబ్బతీశారనేది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టిలో ఉన్న ప్రధాన సమస్య. దీన్ని పూర్తిస్థాయిలో మార్పుచేసి తిరుమలకొండపై ఒక్క గోవిందనామం తప్ప మరెలాంటి పదం వినిపించడానికి వీల్లేకుండా చర్యలు తీసుకోవడంలో ఈ ఇద్దరు అధికారులు తొలి అడుగు విజయవంతమైంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత సీనియర్ ఐఎఎస్ అధికారి జె.శ్యామలరావును గత ఏడాది జూన్ 16న టిటిడి ఇఒగా నియమించింది. ఈయన బాధ్యతలు చేపట్టిన అతి తక్కువరోజుల్లోనే లడ్డూలకు కల్తీనెయ్యి వినియోగించారనే ఘటనపై కీలకంగా అడుగులేశారు. టిటిడి ఉద్యోగులు అంకితభావంతో సేవలందిస్తున్నా చిన్నపాటి తప్పిదాలతో వ్యవస్థ ఇబ్బందులుపడుతున్నట్లు గుర్తించారు. దీంతో ఉద్యోగులు, అధికారుల్లోనూ మార్పుతీసుకు వచ్చేదిశగా చర్యలు చేపట్టారు. ఇక టిటిడిలో ఎంతో కీలకమైన తిరుమల జెఇఒ/అదనపు ఇఒ పోస్టును విధి నిర్వహణలో అంకితభావం, అవగాహన కలిగిఉన్న దేవునిపట్ల విశ్వాసం ఉన్న తొలిసారిగా ఐఆర్ఎస్ హోదా అధికారి చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అవకాశం కలిగింది. ఆయన కేంద్రసర్వీసుల నుండి తిరుమలతిరుపతిదేవస్థానంలో గత ఏడాది జులై 27న బాధ్యతలు చేపట్టారు. తొలిసారిగా దేవునిసేవకు వచ్చిన ఆయన భక్తులకు సంతృప్తికర సేవలందించడమే ప్రధాన ధ్యేయమని వెల్లడించారు. ఇద్దరూ ఆ దిశగా పనిచేసుకుంటూ ఇఒగా శ్యామలరావు ఎనిమిదినెలల కాలం పాలనను, అదనపు ఇఒగా వెంకయ్యచౌదరి ఏడునెలలకాలం పాలనను చక్కగా భక్తుల సేవకే కేటాయించారు. టిటిడిలో ఈ ఇద్దరు ఇప్పుడు భక్తులకు త్వరితగతిన దర్శనం చేయించడంపై దృష్టి సారించారు.

**- ప్రతి భక్తుడిలో సంతోషం చూడాలనే..**

ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి క్షణకాల దర్శనమ్ కోసం భారీగా తరలివస్తున్న భక్తుల్లో సామాన్యభక్తుడికి ఇబ్బంది లేకుండా వీలైనంత త్వరగా దర్శనం చేయించాలనే తపన ఆ ఇద్దరి అధికారుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. దేవుని దర్శనానంతరం తిరుగుప్రయాణంలో ప్రతి భక్తుడిలో సంతోషం చూడాలనే ఆశయం దిశగా అడుగులు వేసున్నారు. వీలైనంత త్వరగా సాధారణ సర్వదర్శనమ్ భక్తులకేగాక టైమ్‌స్లాట్ సర్వదర్శనం భక్తులకు కొన్నిగంటల్లోపే దర్శనం చేయించేలా చూస్తుండటంతో భక్తుల్లో ఒకింత సంతోషం వ్యక్తమవుతోంది. పాలకమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడు చక్కటి అనుభవంతో అధికారులతో కలిసి సమన్వయంగా వ్యవహారించడం, ప్రణాళికలతో ముందుకు నడుస్తుండటం భక్తులకు మెరుగైన సేవలందించే దిశగా చూస్తున్నారు. లడ్డూల నాణ్యత పై భక్తులు ఆనందం చెందుతున్నారు. అన్నప్రసాదాలు రుచి,నాణ్యత పెరగడంతో 1.20లక్షల మంది భక్తులు స్వీకరిస్తున్నారు. ఎప్పుడో ఏళ్ళతరబడి అన్నదానం భవనంలో ఉన్న పాతబడిన యంత్రాలు, పరికరాలను మార్పుచేశారు.

**- తిరుమల విజన్ 2047కు అడుగులు:** కలియుగవైకుంఠం తిరుమల ఆధ్యాత్మికకేంద్రంగా పూర్తిస్థాయిలో తీర్చిదిద్దడంతోబాటు భక్తులకు అవసరమైన సౌకర్యాలు మెరుగుపరచడంలో తిరుమల విజన్ 2047ను అమలుచేసే దిశగా కార్యాచరణ సిద్ధం చేశారు. ప్రపంచంలోనే మోడల్‌టౌన్‌గా తీర్చిదిద్దేపనులపై ఈనెల 11వతేదీ మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి కీలకంగా సమావేశమవుతున్నారు. తిరుమలలో ఇప్పటికీ తీవ్రస్థాయిలో సమస్య ఎదురవుతున్న భక్తుల వాహనాల పార్కింగ్‌కు మల్టీలెవల్ కారుపార్కింగ్‌పై, టౌన్‌ప్లానింగ్ నిబంధనల ప్రకారం అతిధి,విశ్రాంతి గృహాలు పున:నిర్మాణం, పాతకాటేజీలు పడగొట్టి కొత్తవి నిర్మించడం, ఆర్టీసి బస్టాండులు పూర్తిగా నిర్మాణం వంటి విషయాలు చర్చించనున్నారు. ఇంకా ప్రధానంగా మార్చి మొదటివారంలో 2025-26 వార్షిక బడ్జెట్ రూపకల్పనపై టిటిడి దృష్టి సారించనుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గత ఏడాది ఫిబ్రవరి ఆఖరులోనే వార్షిక బడ్జెట్‌ను 5,141.74కోట్ల రూపాయల అంచనాతో టిటిడి ధర్మకర్తలమండలి ఆమోదించిన విషయం విదితమే. ఈ ఏడాది అంతేస్థాయిలో కొంచెం ఇంచుమించుగా 5,200కోట్ల రూపాయల వరకు అంచనా ఉండవచ్చనేది టిటిడి వర్గాల్లో చర్చనీయాంశం. ఈ విషయంపై కూడా చర్చించే అవకాశంఉంది. దుకాణాలకు సంబంధించి పలు రకాల దుకాణాల లైసెన్స్‌లను డిజిటలైజేషన్ చేయనున్నారు.

# జనసంద్రమైన అశ్వత్థక్షేత్రం



శ్రీచక్రభీమలింగేశ్వరస్వామికి పూజలు చేసిన దృశ్యం

**పెద్దపప్పూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** పెద్దపప్పూరు మండలంలోని చిన్నపప్పూరు సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన అశ్వత్థక్షేత్రం జనసంద్రమైంది. మాఘమాసం రెండవ ఆదివారం సందర్భంగా పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి శ్రీఅశ్వత్థనారాయణస్వామి, శ్రీచక్రభీమలింగేశ్వరస్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్నానఘట్టాలతో పాటు పెన్నానదిలో మాఘస్నానాలు ఆచరించి ఆలయం ఆవరణలో స్వామివారి నైవేద్యం వండి స్వామివారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బారికేడ్లు, చలువపందిళ్లు, ప్రత్యేక తాగునీటి వసతి ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ ఇఒ సుబ్రమణ్యం, సిబ్బంది గుర్రప్ప, అరుణ్, కాశీ, నిర్వాహకులు చంద్రమోహన్‌రెడ్డి, వెన్నపూస మల్లికార్జునరెడ్డి, వాసు, శ్రీనివాస్‌రెడ్డి, రామాంజుల్‌రెడ్డి, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీఅశ్వత్థనారాయణస్వామి, శ్రీచక్రభీమలింగేశ్వరస్వామిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తాడిపత్రి ఆర్టీసి అధికారులు తిరుణాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపారు. పలువురు స్వచ్ఛంధ సంస్థలవారు భక్తులకు తాగునీరు, అన్నదాన కార్యక్రమాలను విరివిగా చేపట్టారు. ఆలయం ఆవరణలో గాజుల అంగళ్లు, దేవతామూర్తుల ఫోటోల అంగళ్లు, మిఠాయి దుకాణాలు, చెరుకు అంగళ్ల, జెయింట్‌వీల్, తదితరవి భక్తులతో కిక్కిరిసిపోయాయి.

# వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

## విప్ కాలవ శ్రీనివాసును కలిసిన వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు

**అనంతపురం, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త బ్యూరో** ఆంధ్రప్రదేశ్ లోని వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితా లో చేర్చాలనే అంశంపై వాల్మీకి, బోయ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ జక్కుల శ్రీనివాసులు, వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్.సి. అక్కులప్పలు అనంతపురం లోని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు స్వగృహంలో ఆదివారం కలిశారు. ఎస్టీల్లో చేర్చాల్సిన ఆవశ్యకత పై సుదీర్ఘంగా చర్చించారు. 2017 డిసెంబర్ రెండవ తారీఖున అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని రాష్ట్ర క్యాబినెట్ ఎస్టీ ల్లో చేర్చాలనే అంశంపై చర్చించిన విషయాన్ని గుర్తు చేశారు. శాసనసభ ఆమోదంతో కేంద్రానికి, రిజిస్టర్ జనరల్ ఆఫ్ ఇండియా వారికి ప్రత్యేక నివేదిక పంపడం జరిగిందని తెలియచేశారు. అనంతరం కేంద్రం నుండి వాల్మీకి బోయ ఎస్టీ పునరుద్ధరణ అంశం పై కొన్ని ప్రశ్నలు వేసి నివేదిక పంపాలని రాష్ట్రాన్ని కోరడం జరిగిందని వివరించారు. ఆ ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలు త్వరితగతిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి రిజిస్టర్ ఆఫ్ జనరల్ ఇండియా వారికి పంపాలని, అలాగే ఆ ప్రశ్నలకు సంబంధించిన ఏ విధంగా సమాధానం ఇవ్వాలి అనే అంశం మీద జీవోలతో కూడినటువంటి సమాచారాన్ని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు అందజేయడం జరిగింది. దశాబ్దాలుగా పెండింగులో ఉన్న ఈ అంశంపై తనవంతు బాధ్యత తప్పక నిర్వర్తిస్తానని సంఘం సభ్యులకు కాలవ భరోసా ఇచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రస్తుతం చంద్రబాబు ఉన్నందున సమస్యకు పరిష్కారం లభిస్తుందనే ఆశాభావం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా ఏపీ విబిఎస్ అధ్యక్షులు మాధవయ్య ఏపీ వి బి ఎస్ రాష్ట్ర కార్యదర్శి కేశవులు భాగ్యరాజు శ్రీనివాసులు, కర్నూలు జిల్లా ఏపీ వి బి ఎస్ అధ్యక్షులు గౌరీశ్వర్ నాయుడు చిత్తూరు జిల్లా నాయకులు మహేష్ , ఈశ్వరుడు, లోకేష్, వాల్మీకి యువత పాల్గొన్నారు.



# పట్టుబడిన మధ్యప్రదేశ్ దారా ముఠా

## రూ.90 లక్షల బంగారు, వజ్రాలు, నగదు స్వాధీనం

### - ఎస్‌పి జగదీష్‌ను అభినందించిన బాధితులు



స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం చూపుతున్న ఎస్‌పి

**అనంతపురం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త బ్యూరో** అనంతపురం శ్రీనగర్‌కాలనీ శివారు ప్రాంతమైన రాజహంస స్వీట్ హోమ్స్‌లోని 3 విల్లాస్‌లో జరిగిన చోరీ కేసులను అనంతపురం పోలీసులు ఛేదించారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్‌పి జగదీష్ వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లో మోస్ట్ వాంటెడ్‌గా వున్న మధ్యప్రదేశ్ ధార్ గ్యాంగ్ ఈ చోరీలకు పాల్పడినట్లు వెల్లడించారు. ధార్ గ్యాంగ్‌కు చెందిన నారు పచావర్ (చడ్‌వాడ్ గ్రామం, ధార్ జిల్లా, మధ్యప్రదేశ్), సావన్ (శాంతియ దుద్వే, ధార్ జిల్లా, మధ్యప్రదేశ్), సునీల్ (పిపాల్దిల్యా గ్రామం, ధార్ జిల్లా, మధ్యప్రదేశ్) ముగ్గురిని అరెస్ట్ చేయగా మధ్యప్రదేశ్‌కే చెందిన మహబత్, మోట్లలు పరారీలో వున్నారన్నారు. ఈ గ్యాంగ్‌లో మోస్టువాంటెడ్‌గా వున్న ప్రస్తుతం అరెస్ట్ అయిన వారిలో గ్యాంగ్‌లీడర్‌పై ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో 32 కేసులు నమోదు అయినట్లు తెలిపారు. అరెస్ట్ అయిన నిందితుల నుండి 90 లక్షల రూపాయల విలువ చేసే 59 తులాల బంగారు వస్తువులు, వజ్రాలు పొదిగిన ఆభరణాలు, 19.35 లక్షల రూపాయల నగదు, 3 ద్విచక్రవాహనాలు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గత 22వతేదీన స్థానిక శ్రీనగర్‌కాలనీ శివారు ప్రాంతమైన రాజహంస స్వీట్ హోమ్స్‌లోని శివారెడ్డి, రంజిత్‌రెడ్డి, శివశంకర్‌నాయుడు ఇళ్లల్లో చోరీలు జరిగాయని ఇళ్లకు తాళం వేయడంతో ఎవరూ లేని సమయంలో చొరబడి దాదాపు 2.13 కోట్ల విలువ చేసే బంగారు వస్తువులు, వజ్రాభరణాలు, నగదు ఎత్తుకెళ్లారన్న ఫిర్యాదు మేరకు స్థానిక 4వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. ఈ చోరీలను జిల్లా ఎస్‌పి జగదీష్ సీరియస్‌గా తీసుకుని చోరీలు జరిగిన ఇళ్లల్లో క్లూస్‌టీం, డాగ్‌స్కాడ్‌లను పంపి ఆధారాలు సేకరించామన్నారు. జిల్లా ఎస్‌పి, అనంతపురం అర్బన్ డిఎస్‌పిలతో పాటు సిసిఎస్ పోలీసులు చోరీ జరిగిన ఇళ్లను సందర్శించి జరిగిన తీరుపై ఆరా తీశారన్నారు. అంతేకాకుండా ఈ చోరీ కేసులను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఛేదించేందుకు పోలీసు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. తాళం వేసిన అనంతపురం నగరంలోని శ్రీనగర్‌కాలనీ శివారు ప్రాంతమైన రాజహంస స్వీట్‌హోంలో తాళం వేసిన ఇళ్లపై రెక్కీ చేశారని ఆ విల్లాస్‌లో వున్న శివారెడ్డి, రంజిత్‌రెడ్డి, శివశంకర్‌నాయుడు ఇళ్లను టార్గెట్ చేసుకున్నారని నిందితులైన నారు పచావర్, సావన్, మహబత్, మోట్లలు గత నెల 22వతేదీ తెల్లవారుజామున ఆ మూడిళ్లకు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారని ఆ ఇళ్లల్లో వున్న విలువైన బంగారు, వజ్రాభరణాలు, నగదు దోచుకెళ్లారన్నారు. వాటిని అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా సమాచారం వచ్చిందని జిల్లా ఎస్‌పి తెలిపారు. వెంటనే అనంతపురం అర్బన్ డిఎస్‌పి వి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సిఐలు కనుమూరి సాయినాథ్, హేమంత్‌కుమార్, జయపాల్‌రెడ్డి, ఎస్ఐలు రాంప్రసాద్, రాజశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో సిబ్బంది బృందంగా ఏర్పడి ఆదివారం స్థానిక రాయల్‌నగర్ సమీపంలో అరెస్ట్ చేశారన్నారు. అందరూ పాతనేరస్తులేనని పదుల సంఖ్యలో కేసులు నమోదయ్యాయన్నారు.

వార్త

తక్షణ కర్తవ్యం నెరవేరిస్తే,
తదుపరి కర్తవ్యం ఏమిటో సులువుగా తెలుస్తుంది.

న-బైరన్

# ఊహించిన విజయమే..

అన్నివర్గాలు ఊహించినట్లుగానే దేశరాజధానిలో కమలం వికసించింది. సుమారు రెండు దశాబ్దాల తర్వాత భారీ ఆధిక్యంతో భారతీయ జనతాపార్టీ మళ్లీ ఢిల్లీలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. మొత్తం 70 స్థానాల్లో 48 స్థానాలను కైవసం చేసుకుని జయకేతనం ఎగురవేసింది. డబుల్ ఇంజన్ సర్కారు హామీలను ప్రజలు విశ్వసించారనే చెప్పాలి. నిత్యం కేంద్రంతో వాగ్వాదం లెఫ్టినెంట్ గవర్నర్‌తో వివాదాలతోపాటు మద్యం కుంభకోణం, జల్‌బోర్డు అవకతవకలు, యమునా వివాదం, శీష్‌మహల్ ఆరోపణలతో ఆమ్‌ఆద్మీ ప్రతిష్ట పూర్తిగా దెబ్బతిన్నదనే చెప్పాలి. ఎన్నికల్లో కేజ్రీవాల్ ఇచ్చిన హామీలపై నగర ప్రజలు అంతగా ఆకర్షితులు కాలేదనే చెప్పాలి. ఆప్‌కు చెందిన మహామహులు సైతం ఓటమి పాలయ్యారు. మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సిఎం మనిశ్ సిసోడియాతోపాటు మద్యం కుంభకోణంలో ప్రమేయం ఉందని చెప్పిన అందరూ కూడా పరాజయం పాలయ్యారు. అలాగే సుదీర్ఘకాలంపాటు జైలులో ఉన్న నేతలందరినీ ప్రజలు ఈ ఎన్నికల్లో విశ్వసించలేదనే చెప్పాలి. మరో విషయం ఏమిటంటే హ్యాట్రిక్ విజయం సాధించాలని ఆమ్ ఆద్మీపార్టీ బోర్లాపడితే హ్యాట్రిక్ ఓటమిని సాధించి కాంగ్రెస్ పార్టీ యధాతథస్థితిని కొనసాగించింది. ఒక్క స్థానాన్ని కూడా గెలవలేక పోయింది. ఢిల్లీలో అప్పటి సీఎం షీలాదీక్షిత్ తర్వాత మరోసారి కాంగ్రెస్ పార్టీ గెలిచిన సందర్భంలేదు. అలాగే భారతీయ జనతాపార్టీ కూడా సుష్మస్వరాజ్ ముఖ్య మంత్రిగా ఉన్న కాలం తప్ప మరోసారి ఢిల్లీ పీఠం సాధించలేకపోయింది. 27 ఏళ్లుగా పార్టీ గెలుపు అవకాశాల కోసం ఎదురుచూస్తేనే ఉంది. ఈసారి కట్టుదిట్టమైన వ్యూహాలతో ప్రజల్లోకి వచ్చిన కమలనాథులు కేజ్రీవాల్ పాలనా వైఫల్యాలను ఎత్తి చూపించి స్థానిక సమస్యల పరిష్కారం, ఉచితాల వ్యూహాలతోపాటు ఒక్కఛాన్స్ ఇవ్వండి అంటూ సాగించిన ప్రచారం ఢిల్లీ ఓటర్ల గుండెల్లో నిలిచిపోయింది. దీనికి తోడు సీఎం అభ్యర్థి ఎవరు అన్న స్పష్టత లేకుండానే ఎన్నికలకు వెళ్లింది. బిజెపికి స్థానికంగా బలమైన నాయకుడు లేకపోవడాన్ని ప్రధాన అస్త్రంగా తీసుకున్న ఆప్ సీఎం అభ్యర్థిని ప్రకటించడంలో బిజెపి విఫలం అయిందని ప్రచారం చేసింది. అలాగే బిజెపి వస్తే మురికి వాడలన్నింటినీ నిర్మూలిస్తుందన్న ప్రచారంతో కూడా ముందుకు వెళ్లింది. కానీ అవేమీ కూడా ఫలించలేదని ఎన్నికల ఫలితాలు రుజువు చేసాయి. ఎన్నికల్లో కేజ్రీవాల్‌ను లక్ష్యంగా పెట్టుకుని బిజెపి ప్రచారంలో దూసుకుపోయింది. అద్దాలమేడ వివాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలిగారు. కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేసారని, ఆప్‌నేతలందరూ అవినీతిలో కూరుకుపోయారన్న అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లగలగడంలో విజయం సాధించిందనే చెప్పాలి. అలాగే తరచూ కేంద్రంతో కొనసాగుతున్న వివాదాలకు తోడు లెఫ్టి నెంట్ గవర్నర్‌తో వివాదాలను తారస్థాయికి తీసుకెళ్లడం కూడా ప్రజలకు ఎంతమాత్రం రుచించలేదు. కేంద్రంతో సఖ్యతగా ఉంటూ దేశరాజధాని ప్రాదేశిక ప్రాంతాన్ని అభివృద్ధిచేయాల్సిందిపోయి తరచూ వివాదాలకు దిగడం కూడా ఓటర్లు ఎంతమాత్రం ఇష్టపడలేదని ఫలితాలు రుజువు చేసాయి. వీటికితోడు స్థానిక సమస్యలపైనే ఎక్కువ దృష్టిపెట్టి కమలం ముందుకు సాగింది. రోడ్ల నిర్వహణ,మంచినీటి కొరత, నగర కాలుష్యం మౌలిక సదుపాయాల కల్పనలో ఆప్ ప్రభుత్వం విఫలం అయిందన్న వాదనను బలంగా ప్రచారం చేసింది. సమస్యలన్నింటికీ మోడీ ప్రభుత్వమే కారణమని ఆప్ ప్రచారం చేసినా ప్రజల్లోకి మాత్రం ఆ వాదన వెళ్లలేదు. అవినీతి ఆరోపణలు, అగ్రనేతల అరెస్టులు వంటివి ఆప్‌పై బలంగా ప్రభావం చూపించాయి. ఢిల్లీ జనాభాలో 40శాతంవరకూ ఉన్న మధ్యతరగతి ప్రజానీ కాన్ని తీవ్ర అసంతృప్తికి గురిచేసాయి. ఇతర రాష్ట్రాల తరహాలోనే మహిళలకు నెలనెలా ఆర్థికసాయం బలంగా పని చేసింది. గర్భిణీలకు రూ.21వేల సాయం కూడా బిజెపికి ఓట్లను కురిపించిందనే చెప్పాలి. పూర్వాంచల్ ప్రభావం కూడా బిజెపి విజయానికి దోహదం చేసింది. దేశ రాజధానిలో సుమారు 20 నియోజకవర్గాల్లో వీరి ప్రభావం ఉంది. సుమారు 40లక్షలమంది ఈ ఓటర్లు ఉన్నారు. వీరికోసమే యుపి, బీహార్‌లనుంచి అగ్రనేతలందరినీ రంగంలోకి దించి ఆవర్గం ఓట్లు చీలకుండా జాగ్రత్తలు తీసుకుంది. దీనికితోడు ఆప్, కాంగ్రెస్ వేరువేరుగా పోటీచేయడం కూడా బిజెపికి కలిసొచ్చింది. అలాగే బీఎస్పీ, వామపక్షాలు, మజ్లిస్, ఆజాద్ సమాజ్ పార్టీ, ఎన్సీపీలు కూడా ఎన్నికల్లో వేరువేరుగా తలపడటం ఆమ్ ఆద్మీకి తీవ్రనష్టం కలిగించింది. ప్రత్యేకించి 60 లక్షలకు పైగా ఉన్న మహిళా ఓటర్లు ఈసారి బిజెపికి తమ మద్దతును తెలియజేసారన్నది ఈ ఎన్నికల ఫలితాలు రుజువు చేసాయి. దీనికితోడు మధ్యతరగతి వర్గానికి ఊరట నిచ్చేవిధంగా ఆదాయపు పన్ను పరిమితిని రూ.12లక్షలకు పెంచడం ఈ ఎన్నికల్లో ప్రభావం చూపించింది. దేశ రాజధానిలో మధ్యతరగతి జనాభాయే ఎక్కువ. ఈ ప్రభావం కూడా బిజెపికి కలిసొచ్చిందనే చెప్పాలి. అంతేకాకుండా వేతన జీవులకోసం ఎనిమిదవ వేతన సంఘం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం ఉద్యోగుల, పింఛన్‌దారుల జీతాలు, పింఛన్లు పెరుగుతుందన్న ఆశలు వేతన జీవుల్లో పెరిగాయి. అలాగే తాము అధికారంలోకి వస్తే పాతపథకాలేమీ రద్దు చేయబోమని వాటిని కొనసాగిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చింది. సీనియర్ సిటిజన్లకు ఇచ్చిన రాయితీలు, ఆరోగ్యరంగంలో వారికిచ్చిన హామీలు కూడా పనిచేసాయి. మొత్తంగా చూస్తే హ్యాట్రిక్ కొట్టాలని భావించిన ఆమ్ ఆద్మీకి ఈ ఎన్నికల్లో ఢిల్లీ ప్రజలు గుణపాఠమే చెప్పారని నిస్సందేహంగా చెప్పవచ్చు.

చదరంగంలో మాదిరిగానే
జీవితంలో కూడా ముందుచూపు
ఎంతో అవసరం.



ఐ. జాన్సన్

చేయగలిగే శక్తి ఉన్నవాడికంటే,
చేయాలనే కోరిక ఉన్నవాడు
ఎక్కువ చేయగలుగుతాడు.



జి.ముర్రే

# ఆకలి మరణాలకు ఏదీ పరిష్కారం!

**దేశంలో ఆకలి,పోషక ఆహార లోపంవల్ల ప్రతిరోజు 4,500 మంది పిల్లలు చనిపోతున్నారు. ఆకలితో ప్రతిసంవత్సరం 3లక్షలకుపైగా ప్రజలు మరణిస్తున్నారు. ప్రపంచ దేశాల్లోని పేద, సామాన్య ప్రజలు దేశసంపదలకు దక్కకపోవటం, భూములు, ఫ్యాక్టరీలపై హక్కులు లేకపోవటం, పాలక ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలు, సంపదకేంద్రీకరణ, వెనుకబడ్డ దేశాల్లో సామ్రాజ్యవాదుల దోపిడీ, ఆధిపత్య విధానాలు, యుద్ధఘర్షణలు, పర్యావరణ కాలుష్యం, ప్రకృతి వైపరీత్యాల వల్ల పేదరికం, ఆకలి మరణాలకు కారణం. పాలకుల విధానాలకు, యుద్ధ ఘర్షణలకు వ్యతిరేకంగా ఆయాదేశాల ప్రజలు ఉద్యమించాలి.**

**బొల్లిముంతసాంబ శివరావు**

ఆక్స్‌ఫామ్ విడుదల చేసిన కొత్త నివేదిక ప్రకారం ప్రపంచదేశాల్లో కరవు, ఆహార కొరత, యుద్ధఘరణల వల్ల సంభవించిన ఆకలిమరణాల గురించిన వివరాలు తెలియచేసింది. దాని నివేదిక ప్రకారం వెనకబడిన దేశాల్లో ముఖ్యంగా ఆఫ్రికా, ఆసియా దేశాల్లో ఆకలి మరణాలు ఎక్కువగా ఉన్నాయి. ఈదేశాల సహజ సంపదలను సామ్రాజ్యవాదులు, బహుళజాతి సంస్థలు దోచుకుపోవటమే అందుకు కారణంగా ఉంది. 2024-25లో ప్రపంచంలో ఆకలి వివరాలు ప్రకారం ప్రతిరోజు 73కోట్ల, 30లక్షల మంది ఆకలితో అలమటిస్తున్నారు. 280 కోట్లమంది ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారం పొందలేకపోతున్నారు. వీరు ప్రపంచ జనాభాలో 35శాతంగా ఉన్నారు. తక్కువ ఆదాయ దేశాల్లో 71.5శాతం మంది ప్రజలకు పుష్టికరమైన ఆహారంఅందటం లేదు.అధిక ఆదాయదేశాల్లో వీరి సంఖ్య 6.3శాతం మాత్రమే. 2024లో గ్లోబల్ హంగర్ ఇండెక్స్ ప్రకారం 36 దేశాల్లో ఆకలిరేటు తీవ్రస్థాయిలోఉంది. పిల్లల మరణాలలో సగం పోషకాహార లోపంకారణంగా ఉంది. ప్రతిసంవత్సరం 90 లక్షలమంది పిల్లలు ఆకలి సంబంధిత కారణాలతో మరణిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది 5 సంవత్సరాల లోపు పిల్లలే. అనేక దేశాల్లో ఆకలి మరణాలు పెరుగుతూ ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి నాలుగు సెకన్లకు ఒకరు ఆకలితో మరణిస్తున్నారు. 2021లో ఆహార సంక్షోభంలో 15.5 కోట్ల మంది చిక్కుకున్నారు. తినటానికి తిండిలేక, ఆకలికి తట్టుకోలేక ప్రతినిమిషం 11మంది చనిపోయారు. కరోనా వైరస్ కంటే అత్యంత ప్రమాదకరంగా ఆకలి బాధ ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్నది. 2020లో కరవు పరిస్థితులు ఎదుర్కొన్న వారి సంఖ్య కంటే నేడు ఆరురెట్లు పెరిగిందని ఆక్సాఫామ్ నివేదిక వెల్లడించింది. కరోనా సంక్షోభం, ఆర్థిక పతనం, ప్రకృతివైపరీత్యాలు కలిపి 5లక్షల 20 వేలమందికి పైగాప్రజల ఆకలి చావులకు కారణమైందని ఆక్స్‌ఫామ్ నివేదిక తెలిపింది. ప్రజలు ఆకలి చావుల బారినపడుతున్నా, ఇదే సమయంలో ప్రపంచ సైనిక వ్యయం 51బిలియన్ డ్డాలర్లకు పెరిగిందని పేర్కొంది. కోవిడ్ వల్ల పెరుగుతున్న ప్రపంచ అసమానతల కారణంగా 50 లక్షలమందికిపైగా ప్రజలు తీవ్ర పేదరికంలో కూరుకుపోయారు. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఆహార ధరలు పెరిగాయి. ఇదిప్రజలపై తీవ్రప్రభావం చూపింది. ఇదే సమయంలో 2019 నుండి ప్రపంచంలోని 12వందల అతి పెద్దకంపెనీల ఆస్తులు 56 శాతం పెరిగాయి. ఆఫ్రికాలో కరువు ఆకలిఆఫ్రికాలోని కొన్ని దేశాలు, ప్రాంతాలు తీవ్రమైన కరవు, ఆకలి సమస్యను ఎదుర్కొంటున్నాయి. కెన్యా, నైజీరియా, ఇథియోపియా, సోమాలియా తదితర ఆఫ్రికా దేశాల అంతటా 40 ఏళ్లలో చూడని అత్యంత ఘోరమైన ఆహారసంక్షోభంలో ఉన్నాయి. కుటుంబాలు ఆహారం కోసం వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రు వదలలేక వదలివలసపోతున్నారు. పిల్లలను పాఠశాలకు పంపకుండా కుటుంబ అవసరాల రీత్యా పనులకు పంపుతున్నారు, లేదా భిక్షాటన చేయిస్తున్నారు.పాలకుల ప్రజావ్యతిరేక విధానాల వలన సంపద కొద్ది మంది వద్ద పోగుపడటం,పేదరికం పెరగటం, సంవత్సరాల తరబడి వర్షాభావ పరిస్థితులు, పంటలు విఫలం కావటం, పశువులు చనిపోవటం ఆఫ్రికాలో కరవు ఆహార సమస్యకు, ఆకలి మరణాలకు కారణం అయ్యాయి. ఆఫ్రికాలో1.4 (100కోట్ల,40 లక్షలు)బిలియన్లకుపైగా ప్రజలు ఉన్నారు. వీరిలో22కోట్ల,60 లక్షలమంది ఆకలితో అలమటిస్తున్నారు. ప్రపంచంలోని 30 పేదదేశాల్లో 27దేశాలు ఆఫ్రికాలోనే ఉన్నాయి. ఆఫ్రికాలో అత్యంత పేదరికం, ఆకలితో ప్రభా



వితమైన దేశాలు సహారాకు దక్షిణాన ఉన్నాయి. ఇక్కడ ప్రతినలుగురిలో ఒకరు ఆకలితో అలమటిస్తున్నారు. ప్రపంచ ఆహార కార్యక్రమం గుర్తించిన 10దేశాల్లో అత్యధికసంఖ్యలో ప్రజలు ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నారు. ఇందులో 5 దేశాలు ఆఫ్రికాలోనే ఉన్నాయి. 2022 గ్లోబల్హంగర్ ఇండెక్స్ ప్రకారం తీవ్రమైన కరవు ఉన్న 54 దేశాల్లో 37 దేశాలు ఆఫ్రికాలోనే ఉన్నాయి. మధ్య దక్షిణాఫ్రికాలోని 12 దేశాల్లో 45.5 మిలియన్ల ప్రజలు, తూర్పుఆఫ్రికాలోని 9 దేశాల్లో 43.6 మిలియన్ల ప్రజలు, పశ్చిమ ఆఫ్రికా సాహెల్లోని 16 దేశాల్లో 30.4 మిలియన్ల ప్రజలు కరవు పరిస్థితుల్లో ఉన్నారు. సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, చాడ్, డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్కాంగో,మడగాస్కర్ దేశాలు ప్రపంచ ఆరోగ్య సర్వేప్రకారం ఆందోళనకరమైన ఆకలిస్థాయిలో ఉన్నాయి. నైజీరియాలో 24.5 మిలియన్ల మందికి తిన టానికి సరిపడా ఆహారంలేదు. కెన్యాలో 5లక్షల, 20 వేల మంది కరవు వాతపడ్డారు. డిసెంబర్ 2023 నాటికి సోమాలియా కరవు అంచున ఉంది. 80లక్షల, 30వేల మంది ఆహార అభద్రత అధ్వాన స్థాయికిచేరింది.పేదరికం, కరువు, ఆహార కొరత వల్ల పోషకాహారం లభించక పిల్లలకు అనేక సమస్యలు ఎదురౌతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిన కనీస అవసరమైన ఆహారం కూడా ఆఫ్రికాలోని 10మంది పిల్లల్లో 9 మందికి అందటంలేదు. రోజుఐదుగురిలో ఇద్దరు భోజనానికి దూరంగా ఉన్నారు. వయస్సుకు అనుగుణంగా ఎదుగుదల లేకపోవటంతో పాటు దీర్ఘకాలిక వ్యాధులవల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. ఆహారలేమి కారణంగా ప్రతి 3 సెకన్లకు ఒక పిల్లవాడు, రోజుకి10 వేల మంది చనిపోతున్నారు. ఆఫ్రికా దేశాలు కరవుకి, ఆకలికి నిలయంగా ఉన్నా, ఆసియాలోనే ఎక్కువమంది ఆకలితో, పోషకాహార లోపంతోఉన్నారు. ప్రపంచంలో పోషకాహార లోపం ఉన్న పిల్లల్లో 64శాతం మంది ఆసియాలోనే ఉన్నారు. ఆసియాలోని 519.6మిలియన్ల పెద్దలు, పిల్లలు చాలా తక్కువ ఖర్చుతో జీవిస్తున్నారు. వీరు ఆసియా మొత్తం జనాభాలో 12 శాతం. దక్షిణాసియాలో పోషక ఆహార లోపంలో గ్లోబల్ హంగర్ ఇండెక్స్ స్కోరు ప్రకారం 30.9 శాతం ఉంది. ఇది తీవ్రమైన ఆకలిని సూచిస్తుంది. అత్యధిక మంది పోషకాహార లోపం, ఆకలితో ఉన్నారు. ప్రపంచంలో 15కోట్ల, 80లక్షల మంది కుంగిపోయిన పిల్లలు ఉంటే, వీరిలో 8,30,60,000 (55శాతం) మంది ఆసియాలోనే ఉన్నారు. (యూనిసెఫ్,వరల్డ్ బ్యాంకుగ్రూపు 2018). దక్షిణ ఆసియా అంతట తీవ్రమైన రక్తహీనత కారణంగా ప్రసవ సమయంలో ప్రతిరోజు 25 వేలమంది మహిళలు చనిపోతున్నారు. ఆఫ్ఘనిస్తాన్, గాజాలో(పాలిస్తీనియా) దురాక్రమణ యుద్ధాలకు,ఘర్షణలకు ఆహార కొరతకు లక్షలాది మంది ప్రజలు చనిపోయారు. ఆకలిసూచిలో భారతదేశం పరిస్థితి దారుణంగా ఉంది. 2022లో 121 దేశాల్లో భారత్ 107 స్థానంలో ఉంది. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్, పాకిస్థాన్లు భారతదేశం కన్నా ముందు ఉన్నాయి. ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో కుంగిపోయిన పిల్లలున్న దేశం భారత్. దేశంలోని మొత్తంపిల్లల్లో 46.8 మిలియన్లు కుంగుబాటుతో బాధపడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా కుంగిపోయిన పిల్లల్లో వీరుమూడవ వంతుగా ఉన్నారు. దేశంలో కౌమార దశలో( 15-19 సంవత్సరాల వయస్సు) బాలికలలో రక్తహీనత 56శాతం ఉంది. భారత్లో చైల్డ్ విస్టింగ్రేటు 19.3 శాతంతో ప్రపంచంలోనే అత్యంత తీవ్ర సమస్యగా ఉంది. దేశంలో ఆకలి,పోషక ఆహార లోపంవల్ల ప్రతిరోజు 4,500 మంది పిల్లలు చనిపోతున్నారు. ఆకలితో ప్రతిసంవత్సరం 3లక్షలకుపైగా ప్రజలు మరణిస్తున్నారు. ప్రపంచ దేశాల్లోని పేద, సామాన్య ప్రజలు దేశసంపదలకు దక్కకపోవటం, భూములు, ఫ్యాక్టరీలపై హక్కులు లేకపోవటం, పాలక ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలు,సంపదకేంద్రీకరణ, వెనుకబడ్డ దేశాల్లో సామ్రాజ్యవాదుల దోపిడీ, ఆధిపత్య విధానాలు, యుద్ధఘర్షణలు, పర్యావరణ కాలుష్యం, ప్రకృతి వైపరీత్యాల వల్ల పేదరికం, ఆకలి మరణాలకు కారణం. పాలకుల విధానాలకు, యుద్ధఘర్షణలకు వ్యతిరేకంగా ఆయాదేశాల ప్రజలు ఉద్యమించాలి. ●

# వన్యప్రాణుల రక్షణ ఎవరి బాధ్యత?

**డాక్టర్ మోటె చిరంజీవి**

వన్యప్రాణుల సంరక్షణ అనేది వృక్ష జంతు జాతులను వాటి ఆవాసాలను రక్షించే పద్ధతి. వన్యప్రాణులు ప్రపంచ పర్యావరణ వ్యవస్థలకు అంతర్భాగం. ప్రకృతి ప్రక్రియలకు సమతుల్యత స్థిరత్వాన్ని అందిస్తాయి. వన్యప్రాణుల సంరక్షణ లక్ష్యం ఈ జాతుల మనుగడను నిర్ధారించడం, ఇతర జాతులతో స్థిరంగా జీవించడంపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా సాధ్యమవుతుంది. వన్యప్రాణులకు రక్షణ కరవైంది. ఫలితంగా రోజురోజుకూ అవి కనుమరుగవుతున్నాయి.ధనార్జనే ధ్యేయంగా ఏజెన్సీ గ్రామాల్లో వేటగాళ్లు ఉచ్చులు, విద్యుత్‌తీగలు అమర్చి అడవిజంతువులను వధిస్తున్నారు. అనంతరం గుట్టుచప్పుడు కాకుండా వాటి చర్మం, మాంసాన్ని పట్టణ ప్రాంతాలు, శివారుల్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఎవరైనా సమాచారం ఇస్తేనే పట్టుకుంటున్నారని, మరి కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. వన్యప్రాణుల సంరక్షణకు కఠిన చట్టాలున్నా అవి అమలుకు నోచుకోవడం లేదనే విమర్శలున్నాయి. వేటగాళ్లఉచ్చులో పడి వన్యప్రాణులు విలవిల్లాడుతున్నాయి. పంటల కోసం అవి వస్తుండడంతో వేటగాళ్ల ఉచ్చులు, విద్యుత్ తీగలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో కొండగొర్రె, అడవి పందులు, దుప్పులు, కుందేళ్ల, కొండముచ్చులు వంటి అడవి జంతువులు మృత్యువాత పడడంతో గుట్టు చప్పుడు కాకుండా మాంసాన్ని మైదానప్రాంతాల్లోని రహస్య ప్రదేశాలకు తీసుకొచ్చి కిలో రూ. 500 నుంచి రూ. వేయివరకు విక్రయిస్తున్నారు. వన్యప్రాణుల వేట యధేచ్ఛగా కొనసాగుతోంది. బయటి ప్రాంతాల నుంచి కొందరు వేటగాళ్లు తుపాకులు వేసుకుని అడవిలో సంచరిస్తూ, వన్యప్రాణుల పాలిట



యమకింకరులు అవుతున్నారు. వన్యప్రాణులను సంరక్షించడానికి అనేక చట్టాలున్నాయి. వన్యప్రాణులను రక్షించడానికి భారత పార్లమెంటు 1972లో వన్యప్రాణుల (రక్షణ)చట్టాన్ని ఆమోదించింది. ఈ చట్టం వన్యప్రాణుల రక్షణ, సంరక్షణ, నిర్వహణకు సంబంధించిన నిబంధనలను కలిగిఉంది.అందులో ముఖ్యంగా అడవి జంతువులు, పక్షులు మొక్కలకు రక్షణ కల్పించడం ఈ చట్టం ప్రధానలక్ష్యం. కొన్ని ప్రాంతాలను అభయారణ్యాలు లేదా జాతీయ ఉద్యానవనాలుగా ప్రకటించాలి. అడవి జంతువుల వేటను చట్టం నిషేధిస్తుంది. కొన్ని చట్టాలను చూసినట్లయితే భారతదేశ వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972, అటవీ, పక్షుల, జంతువుల భద్రతా చట్టం- 1912, భారతీయ ఏనుగుల భద్రతచట్టం-1879, బెంగాల్ ఖడ్గమృగ చట్టం 1932,మద్రాసు అటవీ ఏనుగుల చట్టం 1873, అసోం ఖడ్గమృగ భద్రత చట్టం 1954, ఇవేకాక ఆదేశిక సూత్రాల్లోని 48వ ప్రకరణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వన్య ప్రాణులను సంరక్షించాలని పేర్కొంది. అదే విధంగా 51బి ప్రకారం వన్యప్రాణుల సంరక్షణపౌరుల ప్రాథమిక విధిగా పేర్కొంది. 42వ సవరణ ద్వారా వన్య ప్రాణుల సంరక్షణ రాష్ట్రజాబితా నుంచి ఉమ్మడి జాబితా లోకి మార్చారు. జంతువుల,పశువుల ఆవాసాలను సంరక్షించడం, అంతరించిపోతున్న జాతులను సంరక్షించడం, అక్రమ వేటను నివారించడం, జంతువులే మన దేశ భవిష్యత్తు అని భావించడం. జంతువులు మన జీవితంలో ఒక భాగం. ప్రజలు వారి వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాటికి హాని కల్పిస్తున్నారు. దీని నివారించడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతున్నాయి. కానీ ప్రతి పౌరుడిగా మనం ముందడుగు వేసి మన కర్తవ్యాన్ని నెరవేర్చినప్పుడే వన్యప్రాణుల సంరక్షణ సాధ్యమవుతుంది. అందుకే వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యతగా భావించినప్పుడే వాటిని సంరక్షించగలం. ●

# ప్రజావాక్కు



## గిరిజనుల్లో పోషకాహార లోపం

గత ఏడేళ్లుగా, గిరిజనులు ప్రభుత్వ నిర్లక్ష్య విధానాల కారణంగాతీవ్రమైనపోషకాహారలోపసమస్యను ఎదుర్కొంటున్నారు.భారతదేశంలోని 47లక్షలమందిగిరిజన పిల్లలు తీవ్రమైనపోషకాహార లోపంతో బాధపడుతున్నారని ఐక్య రాజ్య సమితి తాజా నివేదిక తెలియజేస్తోంది. ఇది వారి మనుగడ, అభివృద్ధి, అభ్యాసం, ఉత్పాదకతను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. జనజీవన స్రవంతికి దూరంగా నివసించే గిరిజనులలోవివక్ష,భౌగోళిక వేర్పాటువాదం, ప్రజా సేవలకు పరిమిత ప్రాప్యత, సాంస్కృతిక వ్యత్యాసాలు వంటిఇతరకారణాల వలనవారుఅవసరమైన సేవల కోసం ప్రభుత్వంపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. కాబట్టి, పోషకాహారం ఆరోగ్య సంబంధిత సేవలకోసం వారి పట్ల ప్రభుత్వబాధ్యత రెట్టింపుగావుంది.

-సి.సాయిరుత్విక్, నల్గొండ

## అమలు కాని విద్యా హక్కు చట్టం

**సమాజంలో** కొంతమంది పిల్లలు బడి బయట ఉండిపోవడం, బాలకార్మికులుగా పనుల్లో కార్ఖానాల్లో, గనుల్లో పని చేయడం, వారిప్రవేశానికి పాఠశాల నియమ నిబంధనలు అడ్డంకి రావడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని ప్రాథమికహక్కుగా మారిన విద్యను పిల్లలందరూ పొందడానికిగాను ఉచిత నిర్బంధవిద్యకు 'బాలల విద్యా హక్కు చట్టం2009'దేశవ్యాప్తంగా2010ఏప్రిల్ 1నుండి అమలులోకి వచ్చింది.విద్యా హక్కు చట్టం అమలులోకి వచ్చి 16 సంవత్సరాలు అయినా ఇప్పటికీ 10 శాతం కూడా అమలుకావడంలేదన్న నేషనల్ సెంటర్ ఫర్ ప్రైమరీ స్టడీస్ వారి అధ్యయన నివేదిక ఆందోళన కలిగిస్తోంది.

-సి.హెచ్.ప్రతాప్. శ్రీకాకుళంజిల్లా

## వేతన జీవులకు ఊరట

**వేతన జీవులకు** ఉరటనిస్తూ పన్నెండు లక్షలవరకు టాక్స్ తీసివేస్తూ కేంద్రంమధ్యతరగతి జీవులకు ఊరటనిచ్చింది. ఇది శుభ పరిణామం. అంటే దేశంలో సగటు సంపద పెరిగిందన్నమాట.ఇక రెండోవిషయంఏమిటంటే జాతీయ పత్తి మిషన్‌ను ప్రారంభించడం నది తీరా రాష్ట్రాలకు ఉరటనిచ్చేదే. ముఖ్యంగా ఛాంబల్, గోదావరి కృష్ణ తీరా ప్రాంత రాష్ట్రాలు మరింత సంపద సృష్టించబోతున్నాయి. కొన్నిరాష్ట్రాలు పత్తిని పండించడంలో పేరెన్నిక కలిగినవి.

- భారత అవినాష్, జనగామ

## వాట్సప్ ద్వారా సమస్యల పరిష్కారం

**ఆంధ్రప్రదేశ్** విద్య,ఐ.టి. శాఖల మంత్రి నారా లోకేష్ ఈ మధ్య వాట్సప్ గవర్నెన్స్ మన మిత్ర అనే నూతన పద్ధతిని ప్రవేశపెట్టారు. దీనిద్వారా ప్రజలు తమకు ప్రభుత్వ కార్యాలయాలలో పరిష్కారం కాని అనేక సమస్యలను సత్వరం పరిష్కరించేందుకే ఈవాట్సప్ పద్ధతిని అమలు పరచడం జరిగిందని ప్రకటించారు.ఇచ్చిన నంబరుకు వాట్సప్ చేయాలని పేపరులో ప్రకటన విడుదల చేసారు.సమస్య పరిష్కారం అయినదీ లేనిది తిరిగి వాట్సాప్ కాల్‌లో తెలియ జేస్తారట. ఈ పద్ధతి విజయవంతమైతే ప్రజలకు శ్రమ, లంచాలు ఇచ్చి పనిచేయించుకునే పనితగ్గుతుంది.ఇతర రాష్ట్రాలవారు కూడా ఈవినూత్న ప్రయోగాన్ని ఉపయోగించుకోవచ్చును.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## అమెరికా...అనాగరికా!

**అమెరికా** అధ్యక్షుడి ఆలోచనలు, నిర్ణయాలు,చర్యలు అనాగరికంగా తయారవుతున్నాయి. అవి ఆదేశాన్ని గొప్పగా మారుస్తాయో లేదో గానీ ఇతర దేశాలకు తలనొప్పిని తెస్తున్నాయి. రాజకీయ,ఆర్థిక,భౌగోళిక స్థితుల్ని తలక్రిందులు చేసేవిగా ఉన్నాయి. ఆదేశంఎదుర్కొంటున్న సమస్యపై అధ్యక్షుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపడం అంత వరకూ అభినందనీయమే.ఒకప్పుడు వలసల్ని ప్రోత్సహించడం ద్వారా ప్రపంచ ఆర్థికశక్తిగా మారిన దేశం వలసల్ని నేడు అరికట్టాలని అనుకోవడం వారి అవసరం.అందునా అక్రమంగా వచ్చిన వాళ్లని ఆపడం, వెనక్కి పంపించడంలో ఎవరికీ ఆక్షేపణ, అభ్యంతరంఉండనక్కరలేదు.కానీవారినిగొలుసులతో బంధించి, అమానవీయంగా సైనిక విమానాల్లో తరలించడం ఒకింత అతి.

-డా.డి.వి.జి. శంకరరావు, హైదరాబాద్

## వ్యక్తిగత క్రమశిక్షణే సరైన చదువు

**కళాశాలల్లో** ర్యాగింగ్ పేరుతో జరుగుతున్న అమానుష ప్రవర్తననుఅరికట్టేందుకు యూజీసి డిక్లరేషన్ వసూలు చేయని వైద్య కళాశాలల సంజాయిషీ కోరి తిరిగి కౌన్సెలింగ్ ద్వారా సీటు ఖాయం జరిగేటప్పుడే పేరెంట్ సమక్షంలో విషయం చెప్పి వసూలు చేయడంలో బాధ్యత, భయం ఉంటాయి. కారణం డబ్బుతో పాటు క్రమశిక్షణ చర్యలు ఉంటాయి. దీనితో పాటు కళాశాలలో అడుగుపెట్టిన రోజునుండే వారికి, పేరెంట్‌కి కౌన్సెలింగ్ అవసరం. ఇక సీనియర్స్‌కి కూడా ర్యాగింగ్ విషయం లో స్పష్టంగా ఉన్నతాధికారుల ఉత్తర్వులు చెప్పాలి.


-బొల్లోజు మెఘానాథం, విశాఖపట్నం

# సంపద అశాశ్వతం.. జ్ఞానం శాశ్వతం



**మేకిరి దామోదర్**

ప్రతి బిడ్డ పుట్టినప్పుడు విశ్వ మానవుడే. మనమే జాతి, మతం, ప్రాంతం, కులం, తక్కువ, ఎక్కువ లాంటి సంకుచిత పరిధుల్లోకి కుదించి చిన్నవాడిని చేస్తాం. మంచి విద్య వారిని మళ్లీ విశ్వమానవుల్ని చేస్తుంది. భారతదేశ వ్యాప్తంగా సుమారు 26కోట్లకు పైగా పాఠశాల విద్యార్థులున్నారు. వారిలో60 శాతం సర్కారీబడుల్లోనే చదువుకుంటున్నారు. వారికి నాణ్యమైన విద్య అందకపోతే మన దేశ భవిష్యత్తు ఏంకావాలి?. ఈ ఆలోచన పాలకుల్లో ఉన్నట్లైతే సర్కారీ విద్యను గాడిన పెట్టవచ్చు. దానికి కావల్సిందల్లా ప్రభుత్వాలు ప్రతి ఆర్థికసంవత్సరంలో విద్యారంగం మీద సరైన శ్రద్ధవహించడం, నిధులు వెచ్చించడంతో నిపుణత, సృజనాత్మకత, ఉత్పాదకతల్లో సాటిలేని మేటి మానవ వనరులు సిద్ధమవుతాయి. వాటి ద్వారా దేశ ఆర్థిక పురోగమనం వేగవంతమవుతుంది. ప్రగతిశీల ఫలాలపంపిణీ సమంగా జరిగి జనజీవన ప్రమాణాల మెరుగుదల సాధ్యపడుతుంది. కానీ ఇందుకు భిన్నంగా మన దేశంలో చదువులు భావితరాల సహజనైపుణ్యాన్ని హరిస్తున్నాయి. సంవత్సరం తిరిగే సరికే విద్యార్థుల పై తరగతులకు వెళ్తున్నప్పటికీ, అత్యధిక అభ్యసన సామర్థ్యాలు మాత్రం ఎక్కడ వేసిన గొంగడిఅక్కడే అన్నట్లుగా అఘోరిస్తున్నాయి. పునాది డొల్లైతే ఎంతపెద్ద భవనమైనా పేక మేడలా కూలిపోతుంది. ప్రాథమిక విద్యలో పిల్లలు వెనుకబడితే వారి ఎదుగుదలకు అదే ప్రధాన అవరోధమవుతుంది. మరోవైపు తల్లిదండ్రులు, సమాజం పిల్లల చదువుల పేరిట వారిని ప్రైవేట్, కార్పొరేట్ పంజరాల్లోకి నెట్టేస్తున్నారు. పిల్లలు ప్రయోజకులుకావాలని, జీవితాలు వెలిగిపోవాలని తల్లిదండ్రులు కోరుకోవడం సహజమే. కానీ ఆ యావలో ప్రాధాన్యాలు మర్చిపోతున్నారు. మార్కులు, ర్యాంకులు, కెరీర్ అంటూ పిల్లలను ఒత్తిడికి గురి చేస్తున్నారు. తాము సాధించలేని లక్ష్యాలన్నింటిని వారిపై రుద్దేస్తున్నారు. పిల్లలందరి శక్తి సామర్థ్యాలు ఒకేలా ఉండవు. ముఖ్యమైన ఈ విషయాన్ని మరిచిపోయి ఇతరులతో పోలుస్తూ, వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారు. పిల్లలు ఆడుతూ పాడుతూ చదువుకోవాలి. స్వేచ్ఛగా స్వతంత్రంగా ఎదగాలి. చదువునైనా, కళనైనా, ఆటనైనా వారి ఇష్టాఇష్టాలను బట్టి నేర్పించాలి. తల్లిదండ్రులు ముఖ్యంగా గమనించాల్సిన అంశం ఏమిటంటే పిల్లల్ని పెంచే అవకాశం ఎవరికైనా ఒక్కసారే వస్తుంది. అక్కడ పొరపాటు జరిగితే సరిదిద్దుకునే ఛాన్స్ ఉండదు. అందుకని ఆ పరిస్థితి రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత నేటి సమాజం, తల్లిదండ్రులపై ఎంతో ఉంది. ఇక్కడ అజ్ఞానాన్ని పారద్రోలి ప్రగతిశీల ఆలోచనలకు పాదుగొల్పడం, నవతరానికి నవీన నైపుణ్యా



లను అలవర్చడం చదువు లక్ష్యం. అంతేకాదు జీవితం పట్ల ఆశావహ దృక్పథాన్ని, జీవన గమనాన్ని నిర్దేశించుకునే తెలివిని, దానిని చేరుకునే దృఢచిత్తాన్ని భావితరానికి అందించడం విద్య పరమార్థం. కానీ దేశీయంగా జరుగుతున్నది ఏమిటి? మూస పాఠాలు, బండ బోధనా పద్ధతులకు తోడు ర్యాంకుల ఉన్మాద రేసులో విద్యార్థులు మానసికంగా కుంగిపోతున్నారు. పిల్లల సహజ ప్రతిభను గాలికొదిలి, మార్కులు, గ్రేడుల రేసులో ఒత్తిడికి గురి చేయడం వల్ల నిస్సహాయ స్థితికిలోనై మరణాలకు పాల్పడుతున్నారు. ఇలా జాతీయ నేర గణాంక సంస్థల లెక్కల ప్రకారం 2013లో దేశవ్యాప్తంగా ఆరున్నర వేల మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. పదేళ్ల వ్యవధిలో అటువంటి అభాగ్యుల సంఖ్య అంతకంతకు రెట్టింపు కావడం మన విద్యా వ్యవస్థ వైఫల్యాన్ని కళ్లకు కడుతుంది. వాస్తవంగా మానవ వికాస పరిణామక్రమంలో మనిషి ఆలోచనా విధానం అనేకమార్పులు చెందుతూ వచ్చింది. ఆదిలో ఆకలి తీరితే చాలనుకున్నాడు. తర్వాత ఉండడానికి గూడు, ఒంటిమీద బట్టను కోరుకున్నాడు. ఆ కోరికల చిట్టా నెమ్మదిగా ఆస్తులు కూడపెట్టడం వరకు చేరింది. చివరికి జీవితమంటే ధనం సంపాదించడం కోసం అన్నట్లయింది. ఏ జ్ఞానంతో అయితే మానవ జీవితం వికాస పరిణామం చెందిందో ఆ జ్ఞానం మరుగున పడిపోయింది. జ్ఞానమే అసలు సంపదనే వాస్తవ ఉనికిని కోల్పోయింది. పౌరులందరూ నాణ్యమైన జీవితాలు గడపగలడమే దేశ ప్రగతికి నిజమైన కొలమానం. ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా, గౌరవప్రదంగా జీవించాలంటే తలసరి ఆదాయాల్లో అసమానతలు సమసిపోవాలన్నది నిర్వివాదాంశం. అలాంటి వాస్తవిక సమ్మిళిత, సుస్థిరాభివృద్ధికి భరత జాతి ఎప్పుడు నోచుకుంటుంది?. విద్యారంగం మీద ప్రభుత్వాలు సరైన బడ్జెట్ కేటాయించి, శ్రద్ధవహిస్తూ పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే నాణ్యమైన ఉచిత విద్యను అందించినప్పుడే అది సాధ్యపడుతుంది. మన దేశంలో 75ఏళ్ల ప్రజాపాలనలో విద్యపై చేసే ఖర్చు నానాటికి తెగ్గోసుకుపోతుంది. అంతేకాదు నాణ్యమైన ఉచిత విద్యను పొందడం రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కు. విద్యను అంగడి సరుకుగా చేశాక విలువలు, జ్ఞానసంపద అర్థమే మారిపోతోంది.సర్కారీ విద్యపై పాలకుల మాటలు నీటిపై రాతలుగా మారుతున్నాయి. ఈ తీరు మారాలి. ఈ దేశం బాగుపడాలంటే విద్యాలయాలు వ్యాపార కేంద్రాలుగా మారకుండా విజ్ఞాన కేంద్రాలుగా బాసిల్లాలి. అప్పుడే విలువ ఆధారిత బోధన సాధ్యమవుతుంది. ఇలా విలువ ఆధారిత విద్యతోనే మంచి సమాజం నిర్మాణం అవుతుంది. ఈ రోజుల్లో మంచి వ్యక్తుల అవసరం ఎంతో ఉంది. మంచి వ్యక్తులను నిర్మించే కర్మాగారాలైన విద్యాలయాల వల్లనే సాధ్యం. "ప్రపంచాన్ని మార్చగల గొప్ప ఆయుధం విద్య ఒక్కటే."విద్యను నిర్లక్ష్యం చేస్తే, దేశం నిర్లక్ష్యానికి గురవుతుంది. విద్య జ్ఞానాన్ని, నైపుణ్యాలను పెంపొందిస్తుంది. నాణ్యమైన జీవితాన్ని గడపడానికి ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. ●

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఇంకా తేలని ఢిల్లీ సిఎం!

## కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో పార్టీ అధ్యక్షుడు జెపి నడ్డా భేటీ

### రాజస్థాన్, మధ్యప్రదేశ్ వ్యూహమే మళ్లీ?



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన బిజెపి ఇపుడు ప్రభుత్వం ఏర్పాటు కసరత్తుల్లో మునిగిపోయింది. ముఖ్యమంత్రి అభ్యర్థి ఎంపికపై ముమ్మరకసరత్తులుప్రారంభించింది. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపినడ్డా భేటీ అయ్యారు. సాయంత్రం బిజెపి విజయోత్సవ వేడుకల అనంతరంప్రధానిమోడీ సహా పలువురు కీలక నేతలు ఇదే అంశంపై చర్చించగా తాజా భేటీ కీలకప్రాధాన్యం సంతరించుకుంది. కొత్త సీఎం ఎంపిక విషయంలో అనేక సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని కమలనాథులు పలువురు సీనియర్లపేర్లను పరిగణనలోనికి తీసుకుంటున్నారు. సీఎం ఎంపిక విషయంలో రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో అనుసరించిన రాజకీయ వ్యూహం ఢిల్లీకి మినహాయింపేమీ కాదన్న అంచనాలు కూడా పెరిగాయి. ఇప్పటికే ఈ పదవిరేసులో మాజీ సీఎం కేజ్రీవాల్‌ను మట్టికరిపించిన సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మాజీ సీఎం కుమారుడు పర్వేష్‌సింగ్ వర్మ సతీశ్ ఉపాధ్యాయ్, విజయేందర్‌గుప్తా, ఆశిష్ సూద్, పవన్‌శర్మ వంటి పలువురు నాయకుల పేర్లు ప్రచారంలో ఉన్నాయి. ప్రజలకు పెద్దగా పరిచయంలేని కొత్తనేతలకు సిఎం పదవిని కగట్టబెట్టిన చరిత్ర బిజెపికి ఉంది. అందువల్ల ఎవరి పేరును ఖరారు చేస్తారన్నది ఉత్కంఠగా ఉంది. పూర్వాంచల్ నేపథ్యం కలిగిన ఎమ్మెల్యే, సిక్కు లేదా మహిళలను కూడా పరిగణనలోనికి తీసుకుంటారు. గతంలో సంఘటనలను పరిశీలిస్తే 2023లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, గత ఏడాది ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించాక అభ్యర్థులను ఒక్కసారిగా మార్చేసారు. మధ్యప్రదేశ్‌లో మోహన్ యాదవ్; రాజస్థాన్‌లో భజన్‌లాల్‌శర్మ, ఒడిశాలో మోహన్ చరణ్ మాఝీలను సీఎం పదవులు వరించాయి. ఇదే క్రమంలో ఢిల్లీ కూడా మినహాయింపు కాదని అంటున్నారు. ఢిల్లీ బిజెపి చీఫ్ వీరేంద్ర సచ్‌దేవ మాట్లాడుతూ సీఎం అభ్యర్థి ఎంపికపై పార్టీ కేంద్ర నాయకత్వమే నిర్ణయిస్తుందని చెపుతున్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేందరూ తమకు కేటాయించిన బాధ్యతలని నిర్వర్తించగలిగిన వారేనన్నారు. కొత్తసీఎంగా ఎవరిని ఎన్నుకున్నా ప్రధాని నరేంద్రమోడీ అమెరికా పర్యటన ముగించుకుని వచ్చాకే ప్రమాణస్వీకారం ఉంటుందని బిజెపి హైకమాండ్ చెపుతోంది. ఈలోపు కొత్తనేతను ఎంపికచేయడం, కేబినెట్ బెర్త్‌లకు సీనియర్లు జూనియర్ల ఎంపిక వంటివి కూడా పూర్తి చేస్తారని సమాచారం.



# ప్రజల కోసం పనిచేయండి..

## ఎన్నికైన ఎమ్మెల్యేలతో కేజ్రీవాల్ సమీక్ష

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:** అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీనుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలతో ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సమావేశం అయ్యారు. ఢిల్లీలోని ఫిరోజ్‌షారోడ్‌లోని తన నివాసంలోజరిగిన భేటీలో ప్రజలకోసం పని చేయాలని వారికి సూచించారు. ఈ సమావేశంలో అతిశీతోపాటు 22 మంది ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. భేటీ అనంతరం అతిశి మీడియాతో మాట్లాడారు. బిజెపి ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ఆప్ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్రను పోషిస్తుందని అన్నారు. ప్రజలకోసం పనిచేస్తూ వారి సమస్యల్ని పరిష్కరిస్తామన్నారు. ఎన్నికల్లో బిజెపి ఇచ్చిన హామీలను అమలుచేసేలా పని చేస్తామన్నారు. మార్చి 8 నాటికి మహిళలకు నెలకు రూ.2500 చెల్లించేలా చూస్తామని, 300 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం, ప్రజలకు ఇతర మౌలిక సౌకర్యాలు అందేలా చూస్తామన్నారు. గడచిన పదేళ్లలో ఆప్ సర్కారు అందించిన ఉచిత సేవల్ని నిలిపివేయకుండా ప్రజలకుఅండగా నిలబడతామని అతిశి అన్నారు. అయితే ఆప్ శాసనసభా పక్ష నేత ఎవరనేది తదరుపరి సమావేశంలో ఎన్నుకోవడం జరుగుతుందని మాజీ సీఎం చెప్పారు.

# కేంద్రప్రభుత్వం ఓపెన్ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతోంది

## తమిళనాడు సిఎం స్టాలిన్ ఆరోపణ



**చెన్నై, ఫిబ్రవరి 9:** బిజెపి నేతృత్వంలోని కేంద్ర సర్కార్‌పై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఓపెన్ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతోందని మండిపడ్డారు. జాతీయ విద్యావిధానాన్ని తిరస్కరించినందుకు ప్రతీకారంగా రాష్ట్రానికి రావాల్సిన రూ.వేల కోట్ల నిధులను వేరేవాటికి మళ్లించారంటూ ఎక్స్ వేదికగా ఆరోపణలు చేశారు. తమిళనాడు విషయంలో కేంద్ర ప్రభుత్వ అన్యాయాలకు హద్దుల్లేకుండా పోతోంది. జాతీయవిద్యావిధానాన్ని, త్రిభాషా సూత్రాన్ని వ్యతిరేకించినందుకు బహిరంగ బెదిరింపులకు పాల్పడుతోంది. తమిళనాడు విద్యార్థులకు ఉద్దేశించిన రూ.2152 కోట్లను ఇతర రాష్ట్రాలకు మళ్లించింది. మాపై జులుం ప్రదర్శిస్తోంది. హక్కుల కోసం నిలబడినందుకు విద్యార్థులను శిక్షిస్తోంది. దేశ చరిత్రలో ఏ ప్రభుత్వం కూడా ఒక రాష్ట్రంపై రాజకీయ ప్రతీకారం కోసం విద్యను అడ్డుకునేంత క్రూరంగా వ్యవహరించిలేదు. తమిళనాడు, ఇక్కడి ప్రజల విషయంలో ద్వేషం, అన్యాయాలకు ప్రతిరూపంగా బిజెపి మరోసారి తనను తాను నిరూపించుకుంది అని స్టాలిన్ విమర్శలు గుప్పించారు. మహాకుంభమేళాలో సరైన ఏర్పాట్లు చేయకపోవడంతోనే తొక్కిసలాట జరిగిందని సిఎం స్టాలిన్ ఆరోపించారు. 30 మందే మృతి చెందినట్లు ప్రభుత్వం వెల్లడించినా ఈ సంఖ్య మరింత ఎక్కువ ఉంటుందని స్థానిక నేతలే చెబుతున్నారన్నారు. అక్రమ వలసదారులను వెనక్కి పంపుతున్న అమెరికా ఆ క్రమంలో వారికి సంకెళ్లు వేయడాన్ని క్రూరమైన చర్యగా పేర్కొంటూ వారి కష్టాలు కన్నీళ్లు తెప్పించాయన్నారు. దీనిపై అమెరికాతో చర్చించాల్సిన విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ సైతం ఆ దేశ చర్యలను సమర్థించే విధంగా వివరణ ఇచ్చారని విమర్శించారు.

# హత్యకేసు ఖైదీని విడుదల చేయాలని రాష్ట్రపతి పేరిట బోగస్ లేఖ

## సహారాన్‌పూర్ జైలు అధికారుల దర్యాప్తు



**సహారాన్‌పూర్(యుపి), ఫిబ్రవరి 9:** ఒక హత్య కేసులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీని విడుదల చేయాలంటూ రాష్ట్రపతి ద్రౌపదిముర్ము పేరిట ఒక లేఖ జిల్లా జైలు అధికారులకు రావడంపై ఇపుడు అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ సంఘటనపై జిల్లా జైలు అధికారులు పోలీసులకు ఫిర్యాదులుచేయడంతో జనక్‌పురి పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదుచేసారు. సీనియర్‌జైలు సూపరింటెండెంట్ సత్యప్రకాష్ ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. అయితే ఈ ఉత్తర్వులు బోగస్ అని రాష్ట్రపతి పేరును దుర్వినియోగంచేస్తూ ఈ లేఖలు విడుదలచేసారని తేలింది. బోగస్ ఉత్తర్వులను జారీచేసి ఖైదీ అజయ్‌ను విడుదలచేయాలని రాసారనితేలింది. ఈ లేఖలో రాసిన ఖైదీ అజయ్ హత్యకేసులో నిందితుడని జైలు అధికారులు వివరించారు. ప్రెసిడెంట్స్ కోర్టు పేరిట వచ్చిన ఈలేఖను ముందు అధికారులు అను మానించారు. పరిశీలన తర్వాత రాష్ట్రపతి భవన్‌లో ఇలాంటి కోర్టులనేవి ఉండనే ఉండవని చెప్పారని సత్యప్రకాష్ చెప్పారు. కొందరు బోగస్ వ్యక్తులు అధికారులను తప్పుదారి పట్టించేందుకు ఇలా నకిలీ ఉత్తర్వులు జారీచేసారన్నారు. ఈ లేఖను తీవ్రంగా పరిగణించిన జైలు అధికారులు పోలీసులకు తెలిపారు. ఇందుకు సంబంధించి జనక్‌పురి పోలీస్‌స్టేషన్‌లో కేసునమోదుచేసారు. గుర్తుతెలీని వ్యక్తులు రాసిన లేఖగా నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ అధికారులు తెలిపారు.


# బంగ్లాదేశ్‌లో ఆపరేషన్ డెవిల్స్ హంట్..



**ఢాకా, ఫిబ్రవరి 9:** బంగ్లాదేశ్‌లో యూనస్ సర్కారు తాజాగా ప్రత్యర్థులను వేధించేందుకు సరికొత్త చర్యలు మొదలుపెట్టింది. మాజీ ప్రధాని షేక్ హసీనా మద్దతుదారులపై ఆపరేషన్ డెవిల్స్ హంట్ పేరిట దాడులు మొదలు పెట్టింది. కొన్ని ఆందోళనలపై ఇటీవల స్థానిక గ్యాంగులు దాడులు చేశాయి. ఈ నేపథ్యంలో చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం పేర్కొంది. గత నిరంకుశ పాలకులకు చెందిన గ్యాంగ్‌లు కొన్ని విద్యార్థి బృందాలపై దాడులు చేసినట్లు ఆరోపించింది. ఇంటీరియర్ మినిస్ట్రీ అధిపతి జహంగీర్ ఆలమ్ చౌద్రీ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో విద్యార్థి ఉద్యమం తర్వాత చేపట్టిన ఈ దాడులను ఆపరేషన్ డెవిల్స్ హంట్‌గా వ్యవహరిస్తున్నారు. దుష్టశక్తులను అంతం చేసేవరకు ఇది కొనసాగుతుందన్నారు. బుధ వారం షేక్ హసీనా కుటుంబ భవనాలపై కొం దరు దాడులు చేసి ధ్వంసం చేశారు. ఈ క్రమం లో బంగబంధు షేక్ ముజిబుర్ రహ్మాన్ స్మారక భవనంపై దాడి చేశారు. ఈ దాడిలో భవనం పూర్తిగా దెబ్బతిని, మ్యూజియం కూడా ధ్వంసమైంది. ఈ నేపథ్యంలో ప్రజలు సంయమనంతో వ్యవహరించాలని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ అధినేత మహమ్మద్ యూనస్ కూడా విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఓ మంత్రిపై దాడికి ఈ గ్యాంగ్‌లే కారణమని సమాచారం.

ఆపరేషన్ డెవిల్స్ హంట్‌ను గాజీపూర్‌లో మొదలుపెట్టి దేశం మొత్తం అమలు చేస్తామని హోం మంత్రిత్వశాఖ పేర్కొంది. ప్రజల భద్రతలో భాగంగానే దీనిని అమలు చేస్తామని వెల్లడించింది. దీనికి సంబంధించిన అదనపు వివరాలను లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు ఆదివారం వెల్లడిస్తాయని తెలిపింది.

# నమీబియా జాతిపిత సామ్‌నుజోమా కన్నుమూత



**విండ్‌హాక్(నమీబియా), ఫిబ్రవరి 9:** స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత నమీబియాకు మొట్టమొదటి అధ్యక్షుడుగా పనిచేసిన సామ్‌నుజోమా 95యేట కన్నుమూసారు. రాజధాని విండ్‌హాక్‌లోనే ఆయన తుదిశ్వాస విడిచనట్లు ప్రభుత్వం ప్రకటించింది. దక్షిణాఫ్రికానుంచి స్వాతంత్ర్యం సాధించేందుకు నుజోమా సుదీర్ఘకాలం పాటు స్వాతంత్ర్యోద్యమం నడిపారు. 1990లో స్వాతంత్ర్యం కోసం అని నమీబియా విముక్తి పోరాటాన్ని ప్రారంభించారు. ఈ పోరాటాన్నే వాయవ్య ప్రజానీకం సంస్థ(సౌత్‌వెస్ట్‌పీపుల్స్ ఆర్గనైజేషన్ స్వాపో)స్థాపించి పోరాటాన్ని కొనసాగించారు. స్వాతంత్ర్యం తర్వాత నుజోమా 1990నుంచి 2005 వరకూ దేశ అధ్యక్షుడుగా కొనసాగారు. గడచిన మూడు వారాలుగా నుజోమా అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రిలో చేరారు. చికిత్సపొందుతూనే కోలుకోలేకపోవడంతో ఆయన తుదిశ్వాస విడిచారని ప్రస్తుత నమీబియా అధనయక్షుడు నాంగోలో ఎంబుంబా ఒక ప్రకటన విడుదలచేసారు. నమీబియాకు జాతిపిత అని ఆయన అందించిన సేవలు నేటితరం, భావితరానికి స్ఫూర్తిదాయకమని ప్రస్తుత అధ్యక్షుడు ప్రకటించారు. 2005లో పదవినుంచి దిగిపోయినాకూడా పార్టీని నడిపించారు. 2007వరకూ నడిపించిన అధికార స్వాపో పార్టీకి చీఫ్‌గా వ్యవహరించారు. నుజోమా భార్య కోవాంబో తియోపోల్డిన్ కాట్జిమునేకు కూడా 91 ఏళ్లు. ప్రస్తుత అధ్యక్షుడు ఎంబుంబా నుజోమా నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. దక్షిణాఫ్రికానుంచి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత దేశంలో శాంతిసుస్థిరతను నెలకొల్పేందుకు విశేషకృషి చేసారు. 1990వరకూ దక్షిణాఫ్రికాలో మైనార్టీ శ్వేతజాతీయుల పాలనలోనే నమీబియాకూడా మగ్గిపోయింది. మహిళలు, చిన్నారుల హక్కులు విశేషకృషి చేసారు. పెళ్లికిముందు జన్మించిన శిశువులకోసం తల్లితండ్రులకు మెయింటెనెన్స్ అలవెన్సులు ఇచ్చే విధానం తీసుకువచ్చారు. నమీబియా ఉపాధ్యక్షుడు నెటుంబో నందిఎన్‌డైట్‌వాహ్ వచ్చే మార్చిలో అధ్యక్షుడు కాబోతున్నారు. ఈ సందర్భంగా ఆయన కూడా మాట్లాడుతూ దేశవిముక్తిపోరాటంలో నుజోమా సేవలు ఎన్నితరాలయినాసరే విస్మరించలేమని పేర్కొన్నారు. కాగా నుజోమా మృతికి ఆఫ్రికన్‌యూనియన్ కమిషన్ ఛైర్మన్‌మౌస్సా ఫకీ మహ్మద్ నమీబియాకు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు సంపాదించిన జాతిపిత మనకు లేకపోవడం దురదృష్టకమన్నారు. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రాంఫోసా మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో మడమ తిప్పని వీరుడు నుజోమా అని కొనియాడారు. 1994లో అప్పటివరకూ దక్షిణాఫ్రికాలో ఉన్న శ్వేతజాతి పాలన ముగింపు కోసం అవిరళకృషి చేసిన వారిలో నుజోమా కూడా ఉన్నారని ఆయన అన్నారు. కెన్యా అధ్యక్షుడు విలియమ్ రూటో మాట్లాడుతూ ఒక విశాల ధృక్పథం కలిగిన నాయకుడు లేకుండా పోయారని, ఆయన జీవితం మొత్తం నమీబియా అభివృద్ధికే ధారపోసారని అన్నారు.

# రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్న బిజెపి

## కాంగ్రెస్ ఎంపి ప్రియాంకగాంధీ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:** దేశచరిత్రలో తొలిసారిగా కేంద్ర ప్రభుత్వంలోని బిజెపి రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తుందని కాంగ్రెస్ ఎంపి ప్రియాంక ఆరోపించారు. వయనాడ్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పార్టీ బూత్ స్థాయి నాయకులను ఉద్దేశిస్తూ మాట్లాడిన సమయంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే పనిలో మన కేంద్రం ఉంది. ఇది దేశ చరిత్రలోనే తొలిసారి. ప్రస్తుతం మనం చేస్తున్న పోరాటం మన సొంత రాజకీయాల కోసం కాదు. దేశ రక్షణ కోసమని మీరు గుర్తుంచుకోవాలి అని అమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మానవ, జంతు సంఘర్షణలను గురించి ప్రస్తావించారు. ఈ సమస్య పరిష్కారమయ్యేందుకు చర్యలు తీసుకుంటాను. ఈ అంశాన్ని ఇప్పటికే అనేక సార్లు లెవనెత్తా. మెరుగైన భద్రతా చర్యల కోసం నిధులు చాలా కీలకం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వాటిని రాబట్టడం చాలా కష్టంగా ఉంది అని ప్రియాంక తెలిపారు. ఇక నిధుల కేటాయింపుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తాను లేఖ రాస్తానని వెల్లడించారు.

# సర్పంచ్ హక్కులు ఓ వ్యక్తికి అప్పగింత

## స్టాంప్ పేపర్‌పై ఒప్పందం!

**భోపాల్, ఫిబ్రవరి 9:** ఒక మహిళా సర్పంచ్ ఆ హక్కులను ఒక వ్యక్తికి అప్పగించారు. ఇకపై సర్పంచ్ అధికారాన్ని ఆ గ్రామస్తుడు నిర్వహిస్తాడని పేర్కొంది. దీనికి సంబంధించిన ఒప్పందం గురించి స్టాంప్ పేపర్‌పై వారిద్దరూ సంతకాలు చేశారు. ఈ విషయం తెలిసిన అధికారులు ఆ మహిళా సర్పంచ్‌కు నోటీసు జారీ చేశారు. మధ్యప్రదేశ్‌లోని నీముచ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మానస జనపద్ పరిధిలోని దాతా గ్రామానికి చెందిన కాలాషిబాయి కచావా సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. కాగా, అదే గ్రామానికి చెందిన సురేష్ గరాసియాకు తన సర్పంచ్ హక్కులను కైలాషిబాయి అప్పగించారు. గత నెల 24న వీరిద్దరి మధ్య ఈ మేరకు ఒప్పందం కుదిరింది. సాక్షుల సమక్షంలో రూ. 500 స్టాంప్ పేపర్‌పై సంతకాలు చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, వాటర్‌షెడ్ మిషన్ మొదలైన పథకాల పనులను ఇకపై సర్పంచ్‌గా సురేష్ నిర్వహిస్తాడని అందులో పేర్కొన్నారు. అలాగే సర్పంచ్ విధుల్లో తాను జోక్యం చేసుకోబోనని, అవసరమైన సంతకాలు తాను చేస్తానని కైలాషిబాయి హామీ ఇచ్చారు. ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించిన వ్యక్తి నాలుగు రెట్టు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందని ఆ బాండ్‌లో పేర్కొన్నారు. అయితే ఎంత మొత్తం చెల్లించాలన్నది అందులో ప్రస్తావించలేదు. మరోవైపు మహిళా సర్పంచ్ కైలాషిబాయి తన అధికారాలు, హక్కులను సురేష్‌కు అప్పగించిన అంశంతోపాటు ఒప్పందం చేసుకున్న స్టాంప్‌పేపర్ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో జిల్లా పంచాయతీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) అమర్ వైష్ణవ్ దీనిపై స్పందించారు. పంచాయతీరాజ్



చట్టంలోని సెక్షన్ 40 కింద ఆ మహిళా సర్పంచ్ తొలగింపు కోసం నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శికి కూడా షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు చెప్పారు. వారి వివరణ తెలుసుకున్న తర్వాత చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.


# అణ్వాయుధ తయారీని మరింత బలోపేతంచేయాలి

## అధికారులకు కిమ్ ఆదేశాలు



**ప్యాంగ్యాంగ్(ఉత్తరకొరియా), ఫిబ్రవరి 9:** అణ్వాయుధాల తయారీని మరింత బలోపేతం చేయాలని ఉత్తరకొరియా నియంత అధ్యక్షుడు కిమ్‌జాంగ్ ఉన్ తన అధికారులను ఆదేశించారు. కిమ్ ఇలాంట ఇఉత్తర్వులను గతంలో కూడా అనేకసార్లు జారీచేసారు. అయితే జపాన్‌ప్రధాని ఇషిబా, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌లమధ్య తాజాగా ద్వైపాక్షిక బేటీ జరిగిన నేపథ్యంలోనే కిమ్ ఈ ఆదేశాలు జారీచేసినట్లు తెలుస్తోంది. జనవవారం కొరియన్‌పీపుల్స్ ఆర్మీ 77వ వ్యవస్థాపక దినోత్సవంలో కిమ్ పాల్గొని మాట్లాడారు. న్యూక్లియర్‌ఫోర్స్ సహా ప్రత్యర్థులను భయపెట్టే అన్ని రకాల ప్లాన్లను బలోపేతంచేయాలి. అత్యాధునిక అణ్వాయుధాల అభివ1ద్ధికి పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నామని కిమ్ తెలిపారు. ఈ సందర్భంగా రష్యాకు తన మద్దతును పునరుద్ఘాటించారు. మాస్కో ప్రజలు దళాలు వారి దేశ సార్వభౌమాధికారం భద్రత ప్రాదేశికతను కాపాడుకునేందుకు కృషిచేస్తున్నాయని ఆయన అన్నారు. ట్రంప్ అధికారంలో ఉన్న సమయంలో కిమ్‌పరంగా కొనిన సందర్భాల్లో కలిసి ఉన్నా మరికొన్ని సార్లు చూసీచూడనట్లు వ్యవహరించారు. 2019లో వియత్నాంలోజరిగిన బేటీలో అణ్వాయుధాలు వదిలేసే విషయంలో ఉత్తరకొరియా వెనక్కి తగ్గలేదు. దీనితో నాటిచర్చలు విఫలం అయ్యాయి. బైడెన్ అధికారంలోకి వచ్చాక ఇరు దేశాలమధ్య దూరం మరింతపెరిగింది. మరో వైపు దక్షిణకొరియా జపాన్‌లతో ప్యాంగ్యాంగ్ సంబందాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గత ఏడాది వరుసగా క్షిపణి పరీక్షలుచేసిన కిమ్ కవ్వింపు చర్యలకు కూడా దిగారు. దక్షిణకొరియా తమకు శత్రుదేశమని ప్రకటించిన కిమ్ ఆదేశం పైకి చెత్తబెలూన్లను వదిలారు. సరిహద్దు రోడ్లను బాంబులుపెట్టి పేల్చివేసి సంబంధాలను పూర్తిగాతెంచేసారు. తమపై దాడికి పాల్పడితే ఎదుర్కొనడానికి అణ్వాయుధాలు సిద్ధంగా ఉనాననయని హెచ్చరించిన కిమ్ ఇపుడు అణ్వాయుధ తయారీలో మరింత వేగం పెంచాలని అధికారులను ఆదేశించడాన్ని ప్రపంచదేశాలను కలవరపెడుతోంది.

# హమాస్ చెర నుంచి విడుదలై భార్యాపిల్లలను చూడాలని వస్తే..



**టెల్‌అవీవ్, ఫిబ్రవరి 9:** హమాస్ తన వద్ద ఉన్న మరో ముగ్గురు ఇజ్రాయెలీ బందీలను శనివారం విడుదల చేసిన విషయం తెలిసిందే. ఎల్ షరాబి (52), ఒహాద్ బెన్ అమి (56), ఓర్‌లెవీ (34)లను శనివారం రెడ్‌క్రాస్‌కు అప్పగించింది. ప్రతిగా ఇజ్రాయెల్ 183 మంది పాలస్తీనా ఖైదీలను విడిచిపెట్టింది. కాగా హమాస్ చెరలో 491 రోజులు బందీగా చిత్రహింసలు అనుభవించిన ఎల్ షరాబి ఇన్ని రోజులకు తన కుటుంబాన్ని కలుస్తున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు. తన భార్యాపిల్లలు తనకు ఘనంగా స్వాగతం పలుకుతారని వేయి కళ్లతో ఎదురు చూస్తున్నాడు. ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి చేసిన సమయంలో తాను బందీగా మారినా తన కుటుంబం ఎక్కడో ఒకచోట సురక్షితంగా ఉండి ఉంటుందని.. తన కోసం ఎదురుచూస్తున్న వారిని వెంటనే కలిసేలా సహాయం చేయాలని ఇజ్రాయెల్ అధికారులను కోరాడు. అయితే ఆ రోజు హమాస్ దాడిలో అతడి భార్య లియాన్, కుమార్తెలు నోయా (16), యాహెల్ (13) ప్రాణాలు కోల్పోయారని తనను ప్రాణంగా ప్రేమించే వారిని ఇక ఎప్పటికీ కలవలేడనే విషయం అతడికి తెలియదు. తనతోపాటు బందీ అయిన తన సోదరుడి మరణవార్త మాత్రం అధికారులు అతడికి తెలియజేశారు. ఎల్ షరాబిను అతడి తల్లి, సోదరులకు అప్పగించారు. తన భార్యాపిల్లలను ఇంకెప్పుడూ కలవలేడనే విషయాన్ని తన సోదరుడికి ఎలా చెప్పాలని షరాబి సోదరుడు షారోన్ ఆవేదన వ్యక్తం చేశాడు.

గాజా కాల్పుల విరమణ ఒప్పం దం ప్రారంభమైనప్పటి నుంచి ఇజ్రాయెల్‌- హమాస్ మధ్య జరిగిన ఐదో మార్పిడి ఇది. ఒప్పందం తొలిదశలో భాగంగా హమాస్ 33 మంది బందీలను, ఇజ్రాయెల్ దాదాపు 1,800 పైగా పాలస్తీనా ఖైదీలను విడిచిపెట్టనుంది.

# వలసదారులను అరెస్టుచేస్తే జైళ్లు సరిపోతాయా?

## అమెరికాలో ఫెడరల్ అధికారులను వేధిస్తున్న ప్రశ్నలు



**న్యూయార్క్, ఫిబ్రవరి 9:** అమెరికాలో అరెస్టు చేస్తున్న అక్రమ వలసదారుల్లో కొందరిని ఫెడరల్ ప్రభుత్వం జైళ్లకు పంపిస్తోంది. అక్కడ వారికి సరైన వసతులు ఉండవని, లైంగిక దాడులు జరుగుతాయని, మతాచారాలకు విరుద్ధమైన ఆహారం ఇస్తారన్న భయాలు పెరుగుతున్నాయి. డొనాల్డ్‌ట్రంప్ తొలిసారి అధ్యక్షుడుగా ఉన్నపుడు ఇలాంటివేజరిగాయని ఆందోళనలు పెరిగాయి. అమెరికాలో 1.17 కోట్లమంది అక్రమ వలసదారులున్నట్లు అంచనా. వారిలో కేవలం 41 వేలమందిని మాత్రమే నిర్బంధిచే శక్తి అమెరికా వలసల వ్యవహారాలు కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఉంది. ఫెడరల్ న్యాయ శాఖపరిధిలోకి వచ్చే బ్యూరో ఆఫ్‌ప్రిజన్స్‌కు 122 కారాగారాలు ఉండగా వాటిలో 1.55 లక్షలమంది ఖైదీలను నిర్బంధించారు. 30వేల మంది సిబ్బందికలిగిన ఈ బ్యూరో వార్షిక బడ్జెట్ 800 కోట్ల డాలర్లు, లక్షలమంది అనక్రమ వలసదారులను నిర్బంధించడానికి కావలిసిన జైళ్లు అమెరికాలో లేవనేది తెలిసిందే. ట్రంప్ గతనెల 20న ప్రమాణస్వీకారం చేసినప్పటినుంచి 8వేల మందిని అరెస్టుచేసినా వారిలో 461 మందిని చోటుచాలకపోవడం, వైద్యకారణలవాల్ల విడిచి పెట్టారు. మరోవైపు బాగా తక్కువ రుసుముకు వలసఖైదీలను తమ దేశంలోని సువిశాల సెకాట్‌జైలులో నిర్బంధిస్తానని ఎల్‌సాల్వడార్ అధ్యక్షుడు నయూబ్ బుకేలే సిద్ధం అయ్యారు. అది చట్టపరంగా సాధ్యమో కాదో పరిశీలిస్తామని ట్రంప్ అన్నారు.

# కల్కాజీ నుంచి గెలుపొందిన అతిశీ డ్యాన్స్..

## సిగ్గుచేటంటూ ఎద్దేవా చేసిన స్వాతి మలివాల్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ పరాజయం పాలైన విషయం తెలిసిందే. అయితే కల్కాజీ స్థానం నుంచి విజయం సాధించిన అనంతరం ఢిల్లీ సిఎం అతిశీ పార్టీ కార్యకర్తలతో కలిసి ఉత్సాహంగా నృత్యం చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ గామారింది. రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలివాల్ దీనిపై స్పందిస్తూ ఆప్ ఘోర పరాజయం పొంది, సీనియర్ నాయకులంతా ఓడిపోతే అతిశీ తనకేమీ పట్టనట్లు సంబరాలు చేసుకుంటున్నారన్నారు. పార్టీ అధికారాన్ని కోల్పోయి, అధినేత కేజ్రీవాల్ కుమిలిపోతుంటే భవిష్యత్తు గురించి ఆమెకు ఎలాంటి బాధాలేదని విమర్శించారు. ఇది సిగ్గు పడాల్సిన విషయమని దుయ్యబట్టారు. ఆప్ నేతల పాలనా వైఫల్యాలు, కుంభకోణాల ఆరోపణలు, యమునా నది కాలుష్యం మొదలైన వాటితో అధికార ఆమ్ ఆద్మీ ఢిల్లీ ఎన్నికల్లో పరాజయం పాలైంది. పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సహా పలువురు సీనియర్ నాయకులు ఓడిపోయారు. కాగా, ఢిల్లీ సిఎం అతిశీ మాత్రం విజయం సాధించారు.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# మోటార్ సైకిల్ ఢీకొని వైద్యుడు దంగేటి గోపాలకృష్ణ మృతి

పెనుమంట్ర, ఫిబ్రవరి-08, ప్రభాతవార్త: మండలంలో మార్టేరు గ్రామంలో పెనుగొండ రోడ్ లో లో మోటార్ సైకిల్ ఢీకొనడంతో వైద్యుడు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ప్రకారం నెగ్గిపూడి గ్రామానికి చెందిన దంగేటి గోపాలకృష్ణ (60-గోపి) రంగూన్ డెంటల్ వైద్యశాలను నిర్వహిస్తూ ప్రజలకు వైద్యం చేస్తున్నారు. అయితే ఆదివారం రాత్రి ఆసుపత్రిలో చెత్తను పారవేసి రోడ్డు దాటి ఆసుపత్రులకు వస్తుండగా ఏలూరు ఆదివారపు పేటకు చెందిన షేక్ ఇమ్రాన్, ఫయాజ్ ఖాన్ ఆచంటలో గల్ఫ్ మెటీరియల్ ఇచ్చి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మోటార్ సైకిల్ ఆడుతున్న ఫయాజ్ ఖాన్ వైద్యుడు గోపాలకృష్ణ ను ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో వైద్యుడు దంగేటి గోపాలకృష్ణ ఇంటిలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుడు గోపాలకృష్ణ డెంటల్ వైద్యుడుగా నెగ్గిపూడి చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకు సుపరిచితుడు. దంత వైద్యుడిగా ఎంతో సీనియారిటీ ఉన్న గోపాలకృష్ణ ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదానికి కారణమైన ఇద్దరి నిందితులను పెనుమంట్ర పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.






# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి.

**కొయ్యలగూడెం ప్రభాతవార్త ఫిబ్రవరి 9:** మండల కేంద్రం లో రాజవరం మరియు గంగవరం ఎర్రకాలువ వంతెన సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ముగ్గురు యువకులు కలిసి పల్సర్ బైక్ పై గంగవరం వైపు నుంచి రాజవరం వైపు వెళుచుండగా కాలువ సమీపంలో ఎదురుగా వస్తున్న కారును ఢీ కొట్టుకున్నాయి .ప్రమాద స్థలంలోనే కొణిదల గణేష్(28) అనే యువకుడు మృతిచెందగా మరో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలు పాలయ్యారు.మృతుడికి వివాహం అయ్యి ఇద్దరు సంతానం ఉన్నారని పూర్తి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్సై తెలియజేశారు.



# ముగిసిన జాతీయ సమైక్యత శిబిరం



**ప్రభాతవార్త నరసాపురం :** స్థానిక శ్రీ వై. యన్. కళాశాల జాతీయ సేవా విభాగం మరియు మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఏడు రోజులు పాటు జరిగిన జాతీయ సమైక్యత శిబిరం ఈ రోజు ఆదివారం ఘనంగా ముగిసినవి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోశాధికారి పోలిశెట్టి శ్రీ రఘురామారావు, విచ్చేసి ప్రసంగించారు. ఈయన మాట్లాడుతూ 'జాతీయ సమైక్యత శిబిరం' అత్యత ప్రతిష్టాత్మకంగా ఈనెల 3 వ తారీకున ప్రారంభించుకొని ఈ రోజు తో ముగుస్తుందని, ఇటువంటి యన్.ఎస్.ఎస్. కార్యక్రమాలలో జాతీయ సమైక్యత శిబిరం వల్ల కళాశాల ప్రతిష్ట మరింత పెరుగుతుందని 'అన్నారు. 12 రాష్ట్రాల నుండి ఇక్కడికి విచ్చేసిన 200 మంది యన్.ఎస్.ఎస్. వాలంటీర్స్ మరియు 12 పిఒ స్టాఫ్ కు అభినందనలు తెలియజేసారు. ఎన్నో ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలు, కట్టుబాట్లు అన్నీ కలగలిపి ఉన్న దేశమే మన భారతదేశం అని, ఎన్నో దేశాల సమాహారమే మన భారతదేశం కాబట్టి దీనిని ప్రతిబించే విదంగా ఈ జాతీయ సమైక్యత శిబిరం నిర్వహించడం జరిగిందని అన్నారు. హైదరాబాద్ కు చెందిన యన్.ఎస్.ఎస్. రీజనల్ డైరెక్టర్ ఎం. రామకృష్ణ, మాట్లాడుతూ 'శ్రీ వై. యన్. కళాశాల శిబిర కార్యక్రమాల నిర్వహణలో కళాశాల సెక్రెటరీ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ రావు మరియు వారి యాజమాన్య బృందం, ప్రిన్సిపాల్ ఎంతో సహకరించారని' అన్నారు. కళాశాల డీన్ డాక్టర్ గంధం శ్రీరామకృష్ణ అధ్యక్షోపన్యాసం చేస్తూ 360 డిగ్రీస్ లో యన్.ఎస్.ఎస్. వాలంటీర్స్ పెర్ఫార్మన్స్ పెంపొందించు కొనే విదంగా ఈ వారం రోజులు యోగ చేయించడం ద్వారా వారిలో శారీరక మానసిక దృడత్వాన్ని పెంపొందించడం. శ్రమదానం వల్ల పరిసరాల పరిశుభ్రపరుస్తూ, టీం వర్క్ ని పెంపొందించుకోవడం, అకాడమిక్ ప్రోగ్రాంతో స్కిల్స్ పెంపొందించు కోవడం, కల్చరల్ ప్రోగ్రామ్స్ ద్వారా వారిలో ఉన్న ప్రతిభను వెలికితీయడం జరిగిందని, అంతర్వేది లోని వశిష్ట ఆశ్రమం సందర్శించడం ద్వారా స్పిరుట్యువల్ గా కూడా మానసిక స్థైర్యాన్ని పెంపొందించడం జరిగిందని, స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారు రూపొందించిన ఆత్మహత్య నివారణా కార్యక్రమాలు ఎంతో ఆలోచింపజేసేవిదంగా ఉన్నాయని' అన్నారు. ఈ కార్యక్రమంలో రాజుల్లాంక గ్రామ ప్రెసిడెంట్ ముదునూరి మాగ్రాజు అతిదిగా విచ్చేసి మాట్లాడుతూ 'తాను 3 తరగతి వరకు చదువుకోన్నానని, పెద్దలు ఆస్తులు ఇవ్వక పోయినా స్వయం కృషితో అభివృద్ధి చెందానని అందుకు తల్లి తండ్రులు ఆశీర్వాదం ఎంతో ఉందని, ఈ తరం వారు కూడా కృషి పట్టుదలతో, మంచి విలువలను పాటిస్తూ, తల్లి తండ్రులను గౌరవించాలని, అప్పుడే జీవితంలో మంచి జరుగుతుంది అని, ఇతరులకు సేవ చేసినప్పుడు మాత్రమే మనకు మంచి జరుగుతుందని, మానవ సేవయే మాధవ సేవని' అన్నారు. ఈ కార్యక్రమంలో యోగా మాస్టర్ బి. అనసూయ గారు, యూత్ ఆఫీసర్ సైదా నాయక్, కోశాధికారి ఎం. సంజయ్ , వై ఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు చింతా సోమేశ్వరి మరియు యాకోబ్, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన యన్.ఎస్.ఎస్. వాలంటీర్స్ మరియు ప్రోగ్రాం ఆఫీసర్స్ పాల్గొన్నారు.



# యం.ఎల్.సి. కూటమి అభ్యర్థి రాజశేఖర్..... గెలుపు కోసం నాయకర్ ప్రచారం





**ప్రభాతవార్త మొగల్తూరు :** మొగల్తూరు మండలం లో ఆది వారం నాడు మొగల్తూరు మెయిన్ సెంటర్ పెంకివారి కాంప్లెక్స్ దగ్గర నుంచి కూటమి ప్రభుత్వము బల పరచిన ఉమ్మడి పట్టబద్రుల యం. ఎల్.సి అభ్యర్థి పేరా బత్తుల రాజ శేఖర్ నీ గెలిపించాలని కోరుతూ ప్రభుత్వ విప్, నర్సాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ మరియు నరసాపురం టిడిపి ఇంచార్జ్ పోత్తూరి రామరాజు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు నాయకర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడానికి కూటమి ప్రభుత్వం పక్కా ప్రణాళికలు సిద్ధం చేసిందని ఆయన తెలిపారు. యం. ఎల్.సి.ఎన్నికల నరసాపురం నియోజక వర్గ పరిశీలకులు సూర్య నారాయణ రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బలపరచిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీ తో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి మరియు బిజెపి నాయకులు జన సైనికులు వీర మహిళలు పాల్గొన్నారు.

# పాలకొల్లులో ఎమ్మెల్సీ ఎన్నికల సందడి

**పాలకొల్లు ప్రభాతవార్త :** ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ప్రచారం లో భాగంగా పాలకొల్లు పరిశీలకులు రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పేచ్చేటి చంద్రమౌళి పాలకొల్లు పట్టణం 27వ వార్డులో ఓటర్స్ ని ఇంటింటికి వెళ్లి ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు టౌన్ యూత్ టీడీపీ నాయకులు బీరా కిరణ్, దొరబాబు టీడీపీ నాయకులు హరినారాయణ గవర కార్పొరేషన్ డైరెక్టర్ పోలమరశెట్టి నాగేశ్వరావు, మళ్ళ సాంబమూర్తి,అవినాష్,బుద్ధరాజు గోపాల కృష్ణ రాజు,తోట వెంకటేశ్వరావు, జి. శివ ప్రసాద్, భవాని ప్రసాద్, జోషి ప్రశాంత్, నరేష్ జీ. నాగేశ్వరావు కశింకోట మండలం టీడీపీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల నూకునాయుడు, అనకాపల్లి మండలం తెలుగు యువత అధ్యక్షులు మరపురెడ్డి సత్యనారాయణ, అనకాపల్లి నియోజకవర్గం మీడియా కోఆర్డినేటర్ భాను అఖిల్,కొల్లు ఉదయ్ పవన్ మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.



# రైతులంతా ఏపీ ఎఫ్ ఆర్ పోర్టల్ లో నమోదు చేసుకోండి

## తణుకు మండల వ్యవసాయాధికారి కే కుసుమ

**తణుకు ఫిబ్రవరి 9 (ప్రభాతవార్త):** మండలంలోని రైతులందరూ తమ వివరాలను త్వరితగతిన రైతు రిజిస్ట్రేషన్ ఏపీ ఎఫ్ ఆర్ పోర్టల్ లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కే కుసుమ కోరారు. ఈ మేరకు నమోదు కేంద్రం ఉన్నాయి ఆమె పరిశీలించి సిబ్బందికి రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ శాఖకు సంబందించిన ప్రభుత్వ పథకాలు అన్నిటికీ రాయితీలు, నగదు లావాదేవీలు నిర్వహించడం కోసం ఈ పోర్టల్ లో రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అన్నారు. ప్రధానమంత్రి కిసాన్ పథకం, (రైతు భరోసా ) అన్నదాత సుఖీభవ తదితర ఏ స్కీములో అర్హత కావాలి అన్న ఈ రిజిస్ట్రేషన్ తప్పనిసరని ఆమె తెలిపారు. దువ్వ, మరియు మండపాక రైతు సేవా కేంద్రములను సందర్శించి స్వయంగా రైతులు వివరాలను నమోదు చేశారు. దీనికిగాను పొలం 1బీ అడంగల్ , ఆధార్, ఆధార్ కి లింక్ అయిన మొబైల్ నంబర్ తీసుకుని రైతు సేవా కేంద్రములలోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

# కూటమి అభ్యర్థి రాజశేఖర్ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం - ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్

**జంగారెడ్డిగూడెం, ప్రభాత వార్త :** కూటమి బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరా భత్తుల రాజశేఖరం విజయంకు లక్ష్యంగా పనిచేయాలని చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ పిలుపునిచ్చారు. జంగారెడ్డిగూడెం మండల బూత్ ,క్లస్టర్ల ఇంచార్జ్ లు,ఎమ్మెల్సీ బాధ్యులు, కూటమి నాయకులతో ఆదివారం జంగారెడ్డిగూడెంలో సమీక్ష నిర్వహించారు. సోమవారం ఉదయం ఏలూరులో జరిగే నామినేషన్ ప్రక్రియకు అశేషంగా కార్యకర్తలు,నాయకులు తరలి వచ్చి, నామినేషన్ ప్రక్రియను దిగ్విజయంగా పూర్తి చేయాలన్నారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటర్లను చేర్చటం లో జిల్లాలో ముందంజలో ఉన్నామని, ఓటింగ్ చేయించడంలో కూడా జిల్లాలో ముందంజలో ఉండే విధంగా సమన్వయంతో కృషి చేయాలని కోరారు. జంగారెడ్డిగూడెంలో ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపునకు కూటమి నాయకులు సమన్వయంతో చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు. ఈ సమావేశంలో పట్టణ టిడిపి అధ్యక్షులు రావూరి కృష్ణ , బిజెపి పట్టణ అధ్యక్షులు కొప్పాక శ్రీనివాసరావు, కూటమి నాయకులు మండవ లక్ష్మణరావు, ఈ సిహెచ్ శ్రీనివాసరావు, నంబూరి రామచంద్రరాజు, ఎస్ కె అక్బర్, బొబ్బర రాజా పాల్, బుల్లి , పట్టణ టిడిపి కార్యదర్శి తూటికుంట రాము, మద్దిపాటి నాగేశ్వరావు,తదితరులు పాల్గొన్నారు.



# డ్రైన్లను చెత్తకుండీలుగా మార్చొద్దు... కమిషనర్ అంజయ్య

**ప్రభాతవార్త నరసాపురం :** పలు వార్డుల పరిధిలో ప్రధాన డ్రైనేజీ లను పరిశీలించినమున్సిపల్ కమీషనర్ ఎం అంజయ్య. ఆదివారం ఆయన పట్టణంలో ఉదయం పలు వార్డుల్లోనే డ్రైవర్ల పరిస్థితిని పరిశీలించారు. ఈసందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ మురుగు సమస్యలు లేకుండా ప్రతి రోజు డ్రైనేజీ శుభ్రం చేసే పనులను చేపట్టామని చెప్పారు. మురుగు నీరు లేకుండా చేయడం వల్ల దోమల సమస్య రాదని, ప్రజలు అంటూ రోగాల భారిన పడకుండా ఉంటారని తెలిపారు. డ్రైనేజీలలో చెత్తాచెదారం, కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు వేయకుండా ఉండాల్సిన బాధ్యత స్థానికులపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# తపస్ విద్యా సంస్థలు జాతీయ స్థాయిలో రాణించాలి

జంగారెడ్డిగూడెం ప్రభాత వార్త : జంగారెడ్డి గూడెం లోని తపస్ విద్య సంస్థలు జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో జాతీయ స్థాయిలో అతి త్వరలో పురోభివృద్ధి చెంది,పలువురు విద్యావంతులను తీర్చి దిద్దలని సిబిఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక తపస్ విద్యాసంస్థల ప్రథమ వార్షికోత్సవం తేజోత్సవ్ శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభకు విద్యాసంస్థల చైర్మన్ దాకారాపు కృష్ణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జెడి లక్ష్మీనారాయణ తన సుదీర్ఘ ప్రసంగంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి పనిచేస్తేనే గొప్ప వ్యక్తులు తయారవుతారు అన్నారు. ఎవరి బాధ్యతలు వారు నిర్వహించాలన్నారు. విద్యార్థులు ముగ్గురిని ఆదర్శవంతంగా స్వీకరించాలన్నారు. స్వామి వివేకానంద ,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ,అబ్దుల్ కలాం, ఆజాద్ లను ఆదర్శంగా తీసుకొని విద్యలో రాణించి అత్యున్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశ విద్యార్థులను వెనక్కి పంపడం సమజసం కాదని కొద్ది రోజుల్లో ఇండియా రావటానికి అమెరికా వాళ్ళు క్యూ కట్టే విధంగా ఉంటారని ప్రధాని మోడీ అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ కు తన పర్యటనలో చెబితే బాగుంటుందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తపస్ విద్యా సంస్థలు చైర్మన్ దాకారాపు కృష్ణ, సీ.ఎ గా సీనియర్ రొటేరియన్ సంఘా సేవకులుగా విద్య సంస్థల అధినేతగా చేస్తున్న కృషిని లక్ష్మి నారాయణ అభినందించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖులు పారేపల్లి రామారావు,ఏం. ఎస్ రామారావు,తోట లక్ష్మి నారాయణ,గౌతు సత్యేంద్ర కుమార్, కాల్నిడి రాంబాబు, ఊడా గోపి, బండారు సత్యనరాయణ,తదితరులు హాజరయ్యారు. పి ఈ టి శ్రీనివాస్ అధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన దేశ భక్తి గీతాలు సభికులను,తల్లితండ్రులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమ నిర్వహణకు తపస్ వైస్ చైర్మన్ పారేపల్లి నరేష్, బుద్దాల గోపాలకృష్ణ, ఎన్ హరిప్రసాద్, ఎ అర్ రాఘవేంద్ర, బుద్దాల సురేష్ తదితరులు సహకరించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



# సురేంద్రకు సత్కారం

**పాలకొల్లు ప్రభాతవార్త :** పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పాలకొల్లు టీడీపీ ఇంచార్జ్ మరియు రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తో పాలకొల్లు ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు మరియు ఆంధ్ర రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర రామానాయుడు తో భేటీ అయ్యారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపులో భాగంగా పాలకొల్లు పరిశీలకులుగా చేస్తున్న కార్యక్రమాలు వివరిస్తూ చేపట్టబోయే కార్యక్రమాలు గురించి చర్చించిన అనంతరం ఆంధ్ర రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన సందర్భంగా మళ్ళ సురేంద్ర ని మంత్రి అభినందించి సత్కరించారు.



# వైభవంగాబాల రావమ్మ గ్రామోత్సవం



**ఆగిరిపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** ఆగిరిపల్లి గ్రామంలో వెలసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ దుగ్గిరాల బాల రావమ్మ అమ్మవారు మాఘ పౌర్ణమి తిరునాళ్ల మహోత్సవం రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఆదివారం వడ్లమాను, తాడేపల్లి చొప్పరిమెట్ల, గ్రామాలలో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున హాజరై తమమొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి వాహనం లో కమిటీ సభ్యులుబెజవాడ ముత్యాలు, నైనవరపు శ్రీరామ్ మూర్తి, దుప్పుల సీతయ్య, మద్ది రామయ్య, మరిదు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఆగిరిపల్లి మండలంకనసానపల్లి, తోటపల్లి గ్రామాలలో అమ్మవారి ఉత్సవాలు ఈనెల 12 న మాఘ పౌర్ణమి వరకు నిర్వహించబడతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలియజేశారు.



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి పేరాబత్తుల రాజ శేఖర్ ను గెలిపించాలని కోరుతూ నరసాపురం పట్టణంలో తెదేపా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సంకు భాస్కరనాయుడు ఓటర్లను ఓట్లు అభ్యర్ధించారు. కార్యక్రమంలో కోటిపల్లి గోపాలరావు, గుడివాడ ప్రభాకరరావు, రావి అప్పాజీ తదితరులు ఉన్నారు. ప్రభాతవార్త. నర్సాపురం

# ఏలూరులో సందడి చేసిన తండేల్ చిత్ర యూనిట్

ఏలూరు టౌన్, ఫిబ్రవరి 09,ప్రభాత వార్త :గీత ఆర్ట్స్ బ్యానర్ పై చందు మొండేటి దర్శకత్వంలో బన్నీ వాస్ నిర్మాతగా అక్కినేని నాగచైతన్య హీరోగా నటించిన తండెల్ చిత్రం విజయవంతం లో భాగంగా ఏలూరులో అంబికా థియేటర్ కి చిత్ర యూనిట్ సందడి చేసారు. నాగ చైతన్య మరియు చిత్ర యూనిట్ కి పూల భోకేలు ఇచ్చి ఏలూరు మాజీ శాసనసభ్యులు అంబికా కృష్ణ ఘన స్వాగతం పలికారు.

# వేద పాఠశాల గోశాల కువిరాళం



ఆగిరిపల్లి ఫిబ్రవరి 9 ప్రభాతవార్త : బిజె పినాయకులు గోగినేని శ్రీనివాసరావు కుమార్ అప్పారావు ,వెంకట శశిరేఖ దంపతుల 40వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మి నరసింహ స్వామి క్షేత్రమును దర్శించి స్వామివారి ఆశీస్సులు పొంది అనంతరం వేద పాఠశాలను సందర్శించి గో సేవ నిమిత్తం విరాళం సమర్పించి,వేద విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో ఆగిరిపల్లి మండల బిజెపి అధ్యక్షుడు కొవ్వలి బాబురావు,పాఠశాల కార్యదర్శి సూరి శర్మ , సాయి , జి.మోహన్ గణేష్ చతుర్వేది ,కొవూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


# కారు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి

కాళ్ళ,ఫిబ్రవరి 9, (ప్రభాతవార్త) : మోటార్ సైకిల్ ను కారు ఢీకొట్టడంతో మోటార్ సైకిల్ మీద వెళుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇది. ఆకివీడు ఎస్సై హెచ్ హెచ్ నాగరాజు తెలిపిన వివరాలు ప్రకారం కలిదిండి మండలంచినతాడినాడకు చెందిన కొల్లాటి వెంకట యువరాజు అతని తల్లి కలిసి ఈనెల8వతేదీ రాత్రి 11:00 సమయంలో ఆకివీడులోని సీఎం హైస్కూల్ గ్రౌండ్ లో జరుగుతున్న కూటమి సభలకు హాజరై తిరిగి వెళుతుండగా దుంపగడప గ్రామము దగ్గర మినీ లారీ ఆఫీస్ వద్దకు వచ్చేసరికి కైకలూరు నుండి ఆకివీడు వైపుగా వస్తున్న కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా అజాగ్రత్తగా కారు నడిపి కొల్లాటి వెంకట యువరాజు బండిని గుద్దగా వెంకట యువరాజు అతని తల్లి రోడ్డు మీద పడిపోయినట్లు వెంకట యువరాజు కుడి కాలికి తీవ్ర రక్తగాయాలుకాగా, అతని తల్లికి కుడి వేళ్ళు విరిగినట్లు ఇద్దరినీ 108 అంబులెన్స్ లో భీమవరం ఆస్పత్రికి తీసుకెళ్లగా వెంకట యువరాజు వైద్యం పొందుతూ చనిపోయినట్లు మృతిని తండ్రి కొల్లాటి ఏడుకొండలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆకివీడు ఎస్ఐ హెచ్ . నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# నీటి తొట్టిలో పడి బాలుడు మృత్యువాత

నూజివీడు, (ముసునూరు) ఫిబ్రవరి09 ప్రభాతవార్త: ముసునూరు మండలం గోపవరం గ్రామంలో నీటి తొట్టిలో పడి బాలుడు మృతి. గోపవరం గ్రామానికి చెందిన పులిచెర్ల సురేష్ నాగశ్రీ దంపతుల కుమారుడు లోకేష్(4) ఆడుకుంటూ ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు వర్ల నీటి తొట్టె లో పడిపోయాడు. వెంటనే ఎవరు చూడకపోవడంతో తొట్టిలో మునిగి మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



## విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలి - ప్రిన్సిపాల్ ప్రవీణ



నూజివీడు,( ముసునూరు) ఫిబ్రవరి09 ప్రభాతవార్త: విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలని ముసునూరు గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ కొండా బత్తుల ప్రవీణ అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు వైద్యాధికారిణి షకీలా ఇవాంజలిన్ ఆధ్వర్యంలో నులి పురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. విద్యార్థులకు ఏమైనా అనారోగ్య సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేసి, చికిత్స చేయబడుతుంది అన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రవీణా మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఆరోగ్యమే మహాభాగ్యం అని, అందరూ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలన్నారు. ఆరోగ్యపరం గా ఏ చిన్న సమస్య వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా పాఠశాలలో ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు విషయాలు తెలియజేసి వైద్యులు వద్దకు వెళ్లి ఆరోగ్య సంరక్షణ చేసుకోవాలన్నారు. చిన్న సమస్య అని నిర్లక్ష్యం చేస్తే అది పెద్ద వ్యాధిగా ముదురు పోతుందన్నారు. మందులతో తగ్గిపోయేదానికి శస్త్ర చికిత్సలు వరకు తెచ్చుకోవద్దని అన్నారు. అనంతరం జాతీయ అంధత్వ నివారణ పథకం ద్వారా గతంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించి కళ్ళజోళ్ళు అవసరమైన వారికి వైద్యుల చేతుల మీదగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది మురళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మన్యం బంద్ ను జయప్రదం చేయండి



వేలేరుపాడు, ప్రభాత వార్త : వేలేరుపాడు మండలం పూచిరెలా గ్రామంలో ఆదివాసి, గిరిజన, ప్రజా సంఘాల సమావేశం ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి మడకం ఏసుబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గిరిజన సమైక్య జిల్లా కార్యదర్శి కారం ధారయ్య, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష్ లు మాట్లాడుతూ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు 1/70 చట్టాన్ని సవరించాలని చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఫిబ్రవరి 11-12 తేదీలలో జరిగే 48 గంటల నిరవధిక రాష్ట్ర మన్యం బంద్ ను చేపడుతున్నట్టు తెలిపారు. అయ్యన్నపాత్రుడు విశాఖలో జరిగిన పర్యాటక అభివృద్ధి సదస్సులో ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి 1/70 చట్టం మరియు అటవీ హక్కుల చట్టం అడ్డుగా ఉన్నాయని వ్యాఖ్యానించడం దారుణం అన్నారు. ఆ చట్టాలను సవరణ చేయడం ద్వారా పెట్టుబడులు ఆకర్షించి పర్యాటక రంగం అభివృద్ధి చేయొచ్చని, ఆ చట్టాలను సవరణ చేయాలనీ అనడం అయన అవివేకానికి నిదర్శనం అన్నారు. అయ్యన్నపాత్రుడు ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, గిరిజన ప్రజానీకానికి వెంటనే క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. 11-12 జరిగే బంద్ లో మండలంలోని ఉన్న ఆదివాసి, గిరిజన సంఘాలు, ఆదివాసి ప్రజానీకం పెద్ద సంఖ్యలో పాల్గొనాలని, మండలంలో ఉన్నటువంటి వ్యాపార, వర్తక, వాణిజ్య సంఘాలు సహకరించలని, స్కూల్స్, కాలేజీలు, హెూటల్స్ స్వచ్ఛందంగా మూసేసి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మడివి దుర్గారావు, నాయకులు కారం వెంకట్రావు, గిరిజన సమాఖ్య మండల అధ్యక్షులు కట్టం వెంకటేశ్వర్లు, కంగాల గంగరాజు, ఆదివాసి యువ చైతన్య సంఘం నాయకురాలు మడకం సునీత,రజిని తదితరులు ఉన్నారు.

### బలివే క్షేత్రంను పరిశీలించిన దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్,



ఏలూరు రూరల్, ఫిబ్రవరి-09, ప్రభాతవార్త : విజయరాయి వద్ద తమ్మిలేరు పై నిర్మించిన బలివే బ్రిడ్జి తో పాటు ఘాట్లను, దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ స్థానిక కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చింతమనేని మాట్లాడుతూ ఈనెల 26న ప్రారంభం కానున్న మహాశివరాత్రి సందర్భంగా బలివే క్షేత్రంలోని ఆ మహా శివుని దర్శించడానికి వచ్చే భక్తులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## మాజీ సర్పంచి కొండేటి చల్లారావు మృతి



పోడూరు , ఫిబ్రవరి 9, ప్రభాత వార్త : పోడూరు మండలం జగన్నాథపురం మాజీ సర్పంచి కొండేటి చల్లారావు (60) తుది శ్వాస విడిచారు. ఆయన కొద్ది రోజులుగా గుండె సమస్యతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో పాలకొల్లు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించడంతో వైద్యం పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయనకు భార్య విజయ, కుమారుడు విజయ్ కుమార్, కుమార్తె బాల కరుణ ఉన్నారు. ఆయన సిపిఎం పార్టీలో పనిచేసి అనంతరం టిడిపిలో కీలక సీనియర్ నాయకుడిగా సేవలందించారు. జగన్నాథపురం గ్రామ సర్పంచిగా మూడుసార్లు ఎన్నికై గ్రామస్తుల మన్ననలు పొందారు. గ్రామంలో రహదారులు, డ్రైనేజీలు వీధి దీపాలు, ఇళ్ల స్థలాలు, పలు ప్రభుత్వ కార్యాలయాలు నిర్మాణానికి నిధులు సంకోచటంలో కీలక పాత్ర వహించి గ్రామ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు . ఈ సందర్భంగా శనివారం ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ వైద్యం పొందుతున్న సమయంలో చల్లారావును రాజమహేంద్రవరం ఆసుపత్రిలో పరామర్శించి ధైర్యం చెప్పారు. చల్లారావు మృతి పట్ల ఆయన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. టిడిపి మండల అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, మాజీ ఎంపీపీ దాసరి రత్నరాజు, పోడూరు, పెనుమదం సర్పంచులు శెట్టి బత్తుల సువర్ణ రాజు తానేటి బాబురావు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు గ్రామస్తులు సంతాపం తెలియజేశారు.

## నరసింహ స్వామికి ఏకాదశి అర్చనలు.



అత్తిలి - ఫిబ్రవరి9:( ప్రభాత వార్త ):అత్తిలి మండలం గుమ్మంపాడు శ్రీహరి ప్రహ్లాదపురం లో గల సుబ్రహ్మణ్యేశ్వర గో మహాలక్ష్మి సమేత నారికేళ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయం లో స్వామి వారి కి భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా సందర్భంగా విశేషం అర్చనలు చేశారు. ఆలయ ప్రధాన నిర్వాహకుడు పులవర్తి రవీంద్ర ఫణి గోపాల్ , అర్చకుడు శ్రీహరి గోపాల్ అద్వర్యం లో స్వామి వారికి ప్రత్యేక అభిషేకం , తులసి దళాల అర్చన , తదితర పూజాకార్యక్రమాలు జరిపారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ పులవర్తి గిరిజ , పూర్ణిమ , మలకపాటి విశ్వభారతి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేసారు. వివిధ ప్రాంతాలనుండి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. మార్చి 10 న స్వామి వారి కల్యాణ మహెూత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ చైర్మన్ గిరిజ తెలిపారు .

## తెలుగు సాహిత్యం లో బంగారు నంది అవార్డు ను పొందిన ఉపాధ్యాయుని




అత్తిలి - ఫిబ్రవరి 9 ( ప్రభాత వార్త ): అత్తిలి కి చెందిన తెలుగు ఉపాధ్యాయిని పెద్దపల్లి వెంకట రమణి తెలుగు సాహిత్యంలో చేసిన సేవలకు బంగారు నంది పురస్కారాన్ని అందుకుంది. హైదరాబాద్ తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ వారు బంగారు నందితో పాటు ప్రశంసా పత్రం తో సత్కరించారు. సంస్థ జాతీయ చైర్మన్ ఎం.వి. రత్నం కన్వినర్ డి. ఉషారాణి , కోఆర్డినేటర్ తలారి మాల కొండయ్య తదితర ప్రముఖుల సమక్షంలో సత్కరించారు. ఈ సందర్భంగా రమణి ని జిల్లా తెలుగు సాహిత్య సంస్థ అధ్యక్షురాలిగా నియమించారు.

## గీత కులాల మద్యం షాపుల లాటరీ వాయిదా



పెనుమంట్ర, ఫిబ్రవరి-09, ప్రభాతవార్త: నేడు జరగవలసిన గీత కులాలకు రిజర్వు చేసిన మద్యం షాపుల ఎంపికకు సంబంధించి జరగవలసిన లాటరీ ప్రక్రియ ఎమ్మెల్సీ ఎలక్షన్ కోడ్ ఉండటం వల్ల వాయిదా పడిందని తణుకు ఎక్సైజ్ సి ఐ ఎస్ మణికంఠ రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమీషన్ నిర్ణయం మేరకు త్వరలో లాటరీ పక్రియా జరిగే తేదీ తెలియజేయబడుతుందని తెలిపారు. కావుమ దరఖాస్తుదారులు అందరూ గమనించగలరని అన్నారు.

## నూతన నర్సరీ ఏర్పాటుతో నిరుపేదలకు ఉపాధి అవకాశాలు



కొయ్యలగూడెం ప్రభాతవార్త ఫిబ్రవరి 9: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి వన సంరక్షణ సమితి ద్వారా మొక్కలు నాటడం కార్యక్రమం వల్ల గ్రామాలలో నిరుపేదలకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని రాజవరం గ్రామ ప్రజలు అంటున్నారు. కొంతమంది గ్రామానికి చెందినటువంటి వ్యక్తి నర్సరీ వన సేవకునిగా అవకాశం ఇవ్వనందున నర్సరీ వల్ల విద్యార్థిని విద్యార్థులకు ఏదైనా ప్రమాదము జరిగే అవకాశం ఉందని విద్యార్థిని తల్లిదండ్రులకు లేనిపోని అనుమానాలను కల్పిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని ప్రజలు అంటున్నారు. ఈ నర్సరీ ద్వారా రైతులకు ఎంతో ఉపయోగ ఉన్నదని చుట్టుప్రక్కల గ్రామాలకు 50 వేల మొక్కలు అందజేయవచ్చునని రహదారి వెంబడి మొక్కలు నాటడం వల్ల గ్రామాలలో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని, వాతావరణ సమతుల్యత ఏర్పాటుతో వర్షాలు కురిసే అవకాశం ఉందని అంటున్నారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బి. దినేష్ మాట్లాడుతూ నర్సరీ స్కూల్ ఆవరణంలో ఏర్పాటు చేయుటకు అన్ని అనుమతులను ఉన్నాయని గ్రామంలో గ్రామసభ నిర్వహించి తీర్మానం తీసుకున్నామని ఉన్నత అధికారులతో త్వరలో ప్రారంభిస్తామని తెలియజేశారు.

## మావుళ్ళమ్మకు 38 గ్రాముల బంగారం విరాళం



భీమవరం ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :భీమవరం శ్రీమావుళ్ళమ్మ అమ్మవారికి దాతలు ఆదివారం 38 గ్రాముల బంగారాన్ని విరాళంగా అందజేశారు. రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) చేతుల మీదుగా దాతలు విరాళంగా అందించిన బంగారాన్ని దేవస్థానం ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ కు అందించారు. అత్తిలికి చెందిన వానపల్లి గంగరాజు ప్రకాష్, సీతా మహాలక్ష్మి దంపతులు 30 గ్రాములు, కలవపూడికి చెందిన ఏం చిన వెంకటరాజు, సూర్యకాంతం 4 గ్రాములు, పి దుర్గ ప్రసాదరాజు, శ్రీదేవి 4 గ్రాములు బంగారాన్ని విరాళంగా అందించారు. ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ దాతలకు పూజలు ఆశీర్వచనాలు నిర్వహించినారు దాతలందిస్తున్న బంగారముతో అమ్మవారికి స్వర్ణ వస్త్రాన్ని తయారు చేస్తామని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. ఈవో నగేష్, మాజీ ట్రస్ట్ సభ్యులు కారుమూరి సత్యనారాయణ మూర్తి, కట్టా వెంకటేశ్వరావు, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సంప్రదాయ బద్ధంగా సాయినాథుని హెూమం



భీమవరం ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :భీమవరం మినిషిర్డీ వీధిలోని అభయసాయి ధ్యాన మందిరం 32వ వార్షిక మహెూత్సవంలో భాగంగా ఆదివారం సంప్రదాయబద్ధంగా సాయినాథుని హెూమం నిర్వహించారు. శ్రీషిర్డీ సాయిసత్సంగ సేవాశ్రమమ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయిబాబా వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అడబాల సాయి శివకుమార్, లక్ష్మి సాయి దంపతులచే అర్చకులు గణపతి పూజ, మండపారాధన, నవగ్రహ హెూమం, లోక కళ్యాణర్థం వేద మంత్రాలతో సాయినాథుని హెూమం నిర్వహించారు. ఈనెల 11వ తేదీన నిమ్మన రంగరాజేష్, హాణిత దంపతులచే అన్నాభిషేకం, 22 ద్రవ్యాలతో రుద్రాభిషేకం నిర్వహిస్తామని శారద సాయి తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు బాబా వారిని దర్శించుకున్నారు.

## సూర్య భగవాన్ కి అభిషేకాలు



భీమవరం ఫిబ్రవరి 9 ప్రభాతవార్త : పంచారామ క్షేత్రమైన భీమవరం శ్రీఉమా సోమేశ్వర స్వామి దేవస్థానంలోని సూర్య భగవాన్ ను సంప్రదాయ బద్దంగా అభిషేకాలు నిర్వహించారు. మాఘమాసం ఆదివారం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని సూర్య భగవానునికి పురోహితులు కొమ్ము శ్రీనివాస్ లోక కళ్యాణర్థం ప్రజలంతా సుఖః శాంతులతో ఉండాలని కోరుకుంటూ అభిషేకాలు నిర్వహించినట్లు శ్రీనివాస్ తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు

## పల్లకిసేవ

:గుమ్మంపాడు సుబ్రహ్మణ్యేశ్వర గో మహాలక్ష్మి సమేత నారికేళ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయం లో పల్లకి సేవను ఘనంగా నిర్వహించారు. మేళ తాళాలతో స్వామి వారిని అమ్మవారిని పల్లకిలో ఉంచి ఊరేగించారు. ఆలయ కమిటీ చైర్మన్ పులవర్తి గిరిజ , ప్రతినిధులు శ్రీహరి గోపాల్ , రవీంద్ర ఫణి గోపాల్ , పూర్ణిమ , విశ్వభారతి పలువురు ప్రముఖులు ఈ ఉత్సవం లో పాల్గొన్నారు.

### మద్యంషాపుల లాటరీ ప్రక్రియ ఎమ్మెల్సీ కోడ్ ఉన్నందున వాయిదా.

లింగపాలెం జనవరి 9 ప్రభాతవార్త.....పదోవ తేదీన సోమవారం ఏలూరులోని చలసాని గార్డెన్స్ లో జరగవలసిన మద్యం షాపుల లాటరీ ప్రక్రియ తాత్కాలికంగా ఎమ్మెల్సీ కోడ్ ఉన్నందున వాయిదా వేయడం జరిగిందని జిల్లా ఎక్సైజ్ సూపర్డెంట్ ఏ ఆవులయ్య తెలిపారు ఈ విషయం అందరూ



అభ్యర్థులు గమనించలని ఎక్సైజ్ సూపర్నెంట్ తెలిపారు లాటరీ ప్రక్రియకు సంబంధించి త దుపరి షెడ్యూల్ రెండు మూడు రోజుల్లో విడుదల చేస్తామని ఆయన తెలిపారు

## గ్రామ గ్రామాన బిజెపి సంబరాలు



చాట్రాయి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త : దేశ రాజధాని ఢిల్లీ కోటపై భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించడం పై చాట్రాయి మండలంలో గ్రామ గ్రామాన సంబరాలు రంగ రంగ వైభవంగా నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు గడ్డం సంజీవరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పోలవరం, మంకొల్లు, చనుబండం కృష్ణారావు పాలెం తదితర గ్రామాలలో విజయోత్సవాలు నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ జిందాబాద్, మోడీ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ గ్రామాలలో ర్యాలీ నిర్వహించి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో 20 రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ అధికారాన్ని చేపట్టిందని చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి దినదినాభివృద్ధి చెందుతోందని అన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో కూటమి పరిపాలనపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా కొట్లాది రూపాయల నిధులను రాష్ట్రానికి బిజెపి అందజేస్తుండటంతో అభివృద్ధి పథంలో పయనిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బుర్రే శ్రీకర్, కుంటముక్కల మల్లికార్జున రావు, పోతు రెడ్డిపల్లి చెన్నారావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సోదరులందరికీ విజ్ఞప్తి...

లింగపాలెం జనవరి 9 ప్రభాతవార్త.... రైతుకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య రాష్ట్రంలోని భూమి గల ప్రతి రైతుకు ఒక ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకొని రావటం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. అని లింగపాలెం మండల వ్యవసాయ అధికారి కోటగిరి మురలీకృష్ణ అన్నారు. ఇది వ్యవసాయం రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమం.రైతు గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియలో ముఖ్యాంశాలు: రైతు గుర్తింపు సంఖ్య అనేది రైతు రిజిస్ట్రీ పోర్టల్ లో నమోదు చేసిన తర్వాత భూమి గల ప్రతి రైతుకు కేటాయించబడే ప్రత్యేక గుర్తింపు సంఖ్య. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుంది. రైతుకు చేకూరే ప్రయోజనాలు ఈ విశిష్ట సంఖ్య అర్హులైన భూమిగల రైతులు గుర్తించడంలో తోడ్పడి, వారికి ప్రభుత్వం నుండి వచ్చు వివిధ సబ్సిడీలు, పంటల బీమా వంటి ప్రయోజనాలు పొందేలా చేస్తుంది. ప్రభుత్వం అందించే పథకాలు నిరవధికంగా పొందేందుకు ఈ సంఖ్య ఉపయోగపడుతుంది. భూ ఆధారిత పథకాలైన 1.పీఎం కిసాన్ చెల్లింపులు 2.అన్నదాత సుఖీభవ 3.పంటల భీమా 4.పంట రుణాలపై వడ్డీ రాయితీ 5.రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, 6.రాయితీ పై సూక్ష్మ పోషకాలు, 7.సూక్ష్మసేద్యం పై రాయితీ, 8.పంట రుణాలు 9.పెట్టుబడి సాయం...... తదితర పథకాలు నేరుగా పొందే వీరు కలుగుతుంది.సత్వర పరిహారం అందుటకు ఉపయోగపడుతుంది. నీటిపారుదల, తెగుళ్ళ నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి ఇతర సేవలు అందుకోవడానికి తోడ్పడుతుంది. గ్రామంలో గల రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి, రైతు గుర్తింపు సంఖ్య పొందవచ్చు. ప్రస్తుతం రాష్ట్రంలో భూమి గల ప్రతి రైతుకు, మున్ముందు కౌలు రైతులకు, భూములేని వ్యవసాయ కూలీలు, ఇతర వ్యవసాయ ఆధారిత వృత్తులలో ఉన్న వారికి ఇది వర్తిస్తుంది. నమోదు విధానంరైతులు వారి 1.ఆధార్ నెంబర్ 2.ఆధార్ అనుసంధారిక ఫోన్ నెంబర్ 3.భూమి రికార్డులు వివరములు (పట్టాదారు పాస్ బుక్) తీసుకొని గ్రామంలో రైతు సేవా సిబ్బందిని కలిసి ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది.

## మనం ఫౌండేషన్ ప్రతినిధిగా డా. సాక రాజు నియామకం



పెనుమంట్ర, ఫిబ్రవరి-09, ప్రభాతవార్త: మండలంలోని నెగ్గిపూడి గ్రామానికి చెందిన మదర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్, వ్యవస్థాపకులు జాతీయ, అంతర్జాతీయ అవార్డు గ్రహీత, డా. సాక రాజు ఇంటర్నేషనల్ మనం ఫౌండేషన్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధిగా నియామకం అయ్యారు. సంస్థ ఫౌండర్, చైర్మన్ డా. కె. చక్రవర్తి ఈ నియామక పత్రాన్ని రాజుకి అందించారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ నిస్వార్ధంతో కులమతాలకు అతీతంగా వివిధ రంగాలలో ఎన్నో సేవలను అందించిన డా. సాక రాజును మేము గుర్తించి మా సంస్థని కూడా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలలో రథసారథిగా అలుపెరగని యోధుడిలా నడిపిస్తారని దృఢ సంకల్పంతో రాజుని నియమించడం జరిగిందన్నారు. అలాగే మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్చరల్ ప్రోగ్రామ్స్ చేస్తూ దానిలోని భాగంగా స్వచ్ఛందంగా మానవాళికి సేవలందిస్తున్నటువంటి మానవతామూర్తులందరికీ అవార్డులు (మరియు) గౌరవ డాక్టరేట్ ను ప్రధానము చేస్తూ ఉంటామని, జిల్లాలో వివిధ ప్రాంతాలలో స్వచ్ఛందంగా సేవలందిస్తున్న కళాకారులు, క్రీడాకారులు, కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, అన్ని రంగాలలో పలు సేవలందిస్తున్న వారు ఎవరైనా డా. సాక రాజుని ఫోన్: 94924 93067 సంప్రదించి మీరు ఎవరైనా ఎంపిక కాబడినట్లయితే మా సంస్థ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి అవార్డ్స్ గౌరవ డాక్టరేట్ లు ప్రధానం చేస్తామని తెలియజేశారు, రాజు నియామకం పట్ల. మదర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్, అధ్యక్షులు, డా. కర్రి మురళి శ్రీనివాస్ రెడ్డి, డా.నక్కా నరేష్ కుమార్, రెవరెండ్ డా. పి జి రాజు, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోటలో బద్దలు కానున్నాయా

**- ఆ నాలుగు గ్రామాలపైనే మంత్రి దృష్టి**

**- నాడు పర్వతాపురం నేడు బురుగు గూడెం కంచు కోటలు బద్దలు**

ప్రభాతవార్త చాట్రాయి : కాట్రా మండలం అంటేనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అనే చెప్పాలి. అలాంటిది ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉండగా 14 గ్రామపంచాయతీలో తెలుగుదేశం పార్టీకి తిరుగులేని మెజారిటీ లభించింది. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కంచుకోట బద్దలై ఎన్నడూ లేని విధంగా 1100 ఓట్లు పైచిలుకతో తెలుగుదేశం పార్టీ విజయం సాధించింది. ప్రతి ఎన్నికల్లోను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మండలంలో 2000 నుండి 3000 వరకు మెజార్టీ వస్తుండగా నూజివీడు తెలుగుదేశం అభ్యర్థి కొలుసు పార్థసారథి చరిత్ర తిరగరాశారు. ఎవరు ఊహించని విధంగా మెజార్టీ రావడంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అవాక్కయ్యారు. అయితే మండలంలో బూరుగుగూడెం, పర్వతాపురం, నరసింహారావు పాలెం, పోతనపల్లి గ్రామాల్లో మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ లభించింది. అయితే నూజివీడు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా కొలుసు పార్థసారథి ఘనవిజయం సాధించి మంత్రి పదవిని కూడా చేపట్టిన నాటినుండి మండలంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ తెచ్చిపెట్టిన గ్రామాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే పరతాపురం గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లో ఒక బలమైన వర్గానికి నాయకుడైన మిద్దె సత్యనారాయణ తన అనుచరులతో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్న పుచ్చుకున్నారు. దీంతో పర్వతాపురం గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గట్టి దెబ్బ తగిలినట్టు అయింది. గతంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థిగా రంగంలో దిగి మిద్దె సత్యనారాయణ కేవలం 30 ఓట్లు తేడాతోనే ఓటమిపాలయ్యారు. అప్పటినుండి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థిగా కొనసాగుతున్నారు. ఈ పరిస్థితుల్లో మిద్దె సత్యనారాయణ తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకోవటంతో ఎన్నో ఏళ్ల నుండి తిరిగి లేని విజయం సాధిస్తున్న పర్వతాపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీకి బలం చేకూరినట్లు అయింది. ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో మండలాన్ని శాసించే నాయకుడు దేశి రెడ్డి రాఘవరెడ్డి గ్రామమైన బూరుగుగూడెం గ్రామంలో కూడా కంచుకోట బద్దలయ్యే పరిస్థితి ఏర్పడింది. ఆ గ్రామానికి చెందిన కాలసాని సూర్యనారాయణ మాస్టారు తన అనుచరులతో సోమవారం మంత్రి పార్థసారథి సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకునేందుకు రంగం సిద్ధం చేశారు. మంత్రి సామాజిక వర్గానికి చెందిన సూర్యనారాయణ తెలుగుదేశం పార్టీకి బలాన్ని చేకూరుస్తారనే విశ్వాసం ప్రతినోటా వినపడుతోంది. ఇప్పటివరకు బూరుగు గూడెంలో తెలుగుదేశం పార్టీకి సరైన బలమే లేదని చెప్పాలి. సూర్యనారాయణ పార్టీలోకి చేరడంతో తెలుగుదేశం పార్టీలో మరింత ఊపు వచ్చి బలం చేకూరి అవకాశాలు మెండుగా కనబడుతున్నాయి. సూర్యనారాయణ సౌమ్యుడు కావడంతో ఆయన వెంట నడిచేందుకు జనం క్యూ కడుతున్నట్టు తెలుస్తోంది. ఆర్థికంగా కూడా సూర్యనారాయణ స్థిరపడి ఉండటంతో బూరుగుగూడెం లో తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడే అవకాశాలు కనబడుతున్నాయి. మంత్రి పార్థసారథి సూర్యనారాయణకు బూరుగుగూడెం గ్రామానికి సంబంధించి పూర్తిస్థాయిలో పగ్గాలు అప్పజెప్పే అవకాశాలు ఉండటంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కంచుకోట బద్దలవుతుందని అభిప్రాయం పలువురు వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా పోతనపల్లి లో కూడా ఒక బలమైన వర్గం తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇక నరసింహారావు పాలెం విషయానికొస్తే ఇక్కడ తెలుగుదేశం పార్టీలోనే భేదాలు ఉండటంతో ఇంకా ఎవరు ముందుకు వచ్చినట్టు కనపడటం లేదు. ఆ గ్రామ సహకార సంఘం అధ్యక్ష ఎన్నికల్లో మంత్రి పార్థసారథి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తికి కొమ్ముకాస్తున్నారని ఆరోపణలు రావటం దీనిపై ఆగ్రహించిన ఆ గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు రాజీనామాలకు సిద్ధం కావటం ఆ గ్రామంలో తెలుగుదేశం పార్టీలో ఒక అలజడి రగులుతోంది. ఈ సమస్యను మంత్రి పరిష్కరిస్తే ఈ గ్రామంలో కూడా తెలుగుదేశం పార్టీలో చేరేందుకు కొందరు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కంచుకోట బద్దలవటం ఖాయం అనే విషయం స్పష్టమవుతోంది.

## బడేటి జన్మదిన వేడుకల సందర్భంగా ఫ్లాష్ టీం మొక్కలు నాటే కార్యక్రమం

ఏలూరు టౌన్, ఫిబ్రవరి 09,ప్రభాత వార్త :ఏలూరు స్థానిక ఇండోర్ స్టేడియం ఎదురుగా మహిళా క్లబ్ ఆవరణలో ఆదివారం ఉదయం ఫ్లాష్ టీం ఆధ్వర్యం లో అల్లూరి సీతారామరాజు స్టేడియం మార్నింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తో పాటు ఏలూరులోని వివిధ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, నిమ్మకాయలు, కాయగూరలు వర్తకుల సంఘాలతో, సోషల్ వర్క్ చేసే వారితో ఇనిషియల్,ఇంటిమేషన్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫ్లాష్ శ్రీనివాస్ మాట్లాడుతూ మీ అందరి సహకారాలతో ఆనాడు 12 మందితో ప్రారంభించినప్పటికీ నేడు వందలాది సేవకులతో అశేష జనానికి అనేక రకాలుగా సేవ కలుగుతున్నామని ఈ నేపథ్యంలోనే రేపు 12 వ తేదీన మన ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య(చంటి) 59వ జన్మదిన వేడుకల సందర్భంగా ఏలూరులో మొక్కలను నాటి కాలుష్య నివారణకు దోహదపడాలని సూచించారు. 59 మొక్కలు నాటి ఆ మొక్కల చుట్టూ ఇనుముతో రక్షణ వలయాన్ని అమర్చి వాటిని మహావృక్షాలుగా ఎదిగే విధంగా చూడాలని సూచించారు. దీనికి కొంత ధన వ్యయం అవుతుంది కనుక ఎవరైనా వారి వ్యక్తిగత పేరు మీద మొక్కను నాటాలని వుద్దేశము ఉన్నవారు ఫైనాన్సియల్ కాంట్రిబ్యూషన్ తో జత కలవవలసినదిగా విజ్ఞప్తి చేశారు. మీరందరూ కూడా స్వయంగా పాల్గొనట్లయితే ఈ కార్యక్రమం విజయవంతరానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి హాజరైన అనేక సంఘాల నాయకులు మాట్లాడుతూ ఈ చక్కటి సందర్భంలో మమ్మల్ని అందరినీ భాగస్వాములు చేసినందుకు మీకు ప్రత్యేక ధన్యవాదాలు,అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాళ్ళందరికీ ఫ్లాష్ శ్రీనివాస్ కృతజ్ఞతలు చెప్పారు.

# ‘పుష్ప అందరికి జీవితాంతం గుర్తుండిపోతుంది’

## థ్యాంక్స్ మీట్‌లో ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, జీనియస్ దర్శకుడు సుకుమార్ కలయికలో అత్యంత ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి నిర్మించిన ఇండియన్ బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ ‘పుష్ప2 ది రూల్. ఈ చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో అన్ కాంప్రమైజ్‌డ్‌గా నిర్మించారు. నిర్మాతలు నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్. డిసెంబరు 5న విడుదలైన ఈ చిత్రం ప్రపంచస్థాయిలో ఎంతటి గొప్ప విజయం సాధించింతో అందరికి తెలిసిందే. ఇండియన్ సినిమాలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ‘పుష్ప2 సరికొత్త రికార్డులు సృష్టించింది. రష్మిక మందన్నా నాయికగా నటించిన ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. కాగా ఈచిత్రం థ్యాంక్స్ మీట్ హైదరాబాద్‌లో జరిగింది. ఈ వేడుకలో చిత్రం యూనిట్ నటీనటులకు, సాంకేతిక నిపుణులకు హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్, నిర్మాతలు నవీన్ ఎర్నేని, రవి శంకర్ చేతుల మీదుగా షీల్డులు బహుకరించారు.



ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ, ‘పుష్ప 2 జర్నీలో ఐదు నిమిషాల నుండి ఐదు ఏండ్ల వరకు పనిచేసిన అందరికి నా కృతజ్ఞతలు. పుష్ప పోస్టర్‌లో నా ఫొటో చూసుకున్న ప్రతిసారి.. నా మీద ఈ టీమ్ అంతా చూపిన ప్రేమే కనిపించింది. మీరు ఎంతో కష్టపడి అద్భుతమైన సినిమా ఇచ్చారు. నిర్మాతలు రవి, నవీన్ లేకుంటే పుష్ప సాధ్యమయ్యేది కాదు. ప్రతి డిపార్ట్‌మెంట్‌కు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. దేవిశ్రీప్రసాద్ నా సాంగ్స్‌ను బిలియన్స్‌ల్లో చూపించాడు. దేవిశ్రీ ప్రసాద్ తన అద్భుతమైన సంగీతంతో సినిమాకు ఎనర్జీ ఇచ్చాడు. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ఆదరించిన పుష్ప అభిమానులకు నా థ్యాంక్స్. నేను సుకుమార్‌కు థ్యాంక్స్ చెప్పి వదిలేయలేను. ఎందుకంటే అందరికి హిట్ ఇచ్చేది దర్శకుడే. ఈ సినిమా విషయంలో అందరూ సుకుమార్‌కు థ్యాంక్స్ చెప్పాలి. సుకుమార్ మాత్రం ఈ సినిమా విజయంలో అందరికి క్రెడిట్ ఇస్తాడు. కానీ అందరికి క్రెడిట్ ఇవ్వడానికి కారణం దర్శకుడు సుకుమారే. నా నటనకు ఎంతో మంచి పేరు వచ్చింది. దీనికి కారణం దర్శకుడు సుకుమారే. సుకుమార్‌కు నేను బిగ్గెస్ట్ ఫ్యాన్‌ని, ఆయన సీన్ చెబుతుంటే నాకు పిచ్చెక్కిపోతుంది. జీనియస్ దర్శకుడు సుకుమార్. నేను ‘పుష్ప 2 షూటింగ్ అయిపోయిన తరువాత ఎంతో ఎమోషనల్ అయ్యాను. పుష్ప అనేది ఓ ఎమోషన్. ఈ సినిమా జరుగుతున్నప్పుడు ఐదు సంవత్సరాలు సుకుమార్ ఏది చెబితే అది చేశాం. ఈ సినిమాకు వెచ్చించిన ఐదు సంవత్సరాలు అందరికి జీవితాంతం గుర్తుండిపోతుంది. ఈ ఐదేళ్ల ప్రతి ఒక్కరికి ప్రతి సెకనుకు ఎంతో ఉపయోగపడింది. ఈ సినిమా సక్సెస్‌ను నా అభిమానులకు అంకితం చేస్తున్నాం. పుష్ప3 ఏంటో తెలియదు కాదు కానీ ఓ అద్భుతంలా కనిపిస్తుంది అన్నారు. దర్శకుడు సుకుమార్ మాట్లాడుతూ, మైత్రీ మూవీస్ చెర్రీ సలహాతోనే పుష్పను రెండు భాగాలుగా చేశాను. నాకు రంగస్థలం నుంచి ఇప్పటి వరకు వరుస హిట్స్ రావడానికి మైత్రీ మూవీస్ కారణం. నాపేరు సుకుమార్ కాదు. సుకుమార్ దేవిశ్రీ ప్రసాద్. దేవి లేకుండా నేను సినిమా చేయలేను. భవిష్యత్‌లో కూడా చేయలేను. ఇక అల్లు అర్జున్ నాకు ఎంతో ఎనర్జీ ఇస్తాడు. నా దగ్గర సరైన కథ లేకుండా బన్నీ ఒకే అన్నాడు. ఈ సక్సెస్ క్రెడిట్ మొత్తం అల్లు అర్జున్‌దే. నేషనల్ అవార్డ్ విన్నర్ పర్ఫార్మ్ చేస్తే ఎలా ఉంటుందో ఈ సినిమా అలా ఉంటుంది అని ప్రతి సన్నివేశం ముందు చెప్పేవాడిని. ఈరోజు ఆయన నటనకు ఎంతో మంది నుంచి ప్రశంసలు వస్తున్నాయి. ఈ సినిమా సక్సెస్‌లో భాగం అయిన అందరికి నా కృతజ్ఞతలు అన్నారు.

నిర్మాత రవిశంకర్, మాట్లాడుతూ ‘పుష్ప2 కు పనిచేసిన అందరికి మా థ్యాంక్స్. ఇంత మంచి సినిమాలో పార్ట్ అయినందుకు హ్యాపీ. ఈ సినిమాకు హీరో, దర్శకుడు ఎంతో కష్టపడ్డారు. దేవి బ్యాక్‌బోన్ ఆఫ్ ది ఫిలిం. ఈ సినిమాకు పనిచేసిన అందరికి కృతజ్ఞతలు. అన్నారు.

నిర్మాత నవీన్ మాట్లాడుతూ, అంచనాలు మంచి కలెక్ట్ చేస్తుందని అనుకున్నాం కానీ. ఇంత పెద్ద బ్లాక్‌బస్టర్ అవుతుందని ఊహించలేదు. ఇంత మంచి సినిమా మా బ్యానర్‌కు ఇచ్చినందుకు హీరో, దర్శకుడికి కృతజ్ఞతలు అన్నారు.

దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ, ఎన్ని మాటలతో వర్ణించిన చెప్పలేం, పుష్ప అనేది ఓ మ్యాజిక్. ఈ మ్యాజిక్ క్రియేట్ చేసిన హీరో, దర్శకుడు, మైత్రీ మూవీ మేకర్స్ కృతజ్ఞతలు. కష్టపడితే యూనివర్స్ మనకు ఇవ్వాల్సింది ఇచ్చేస్తుంది దీనికి నిదర్శనం ఈ సక్సెస్. అందరి కష్టం, నిజాయితీకి ఈ పెద్ద బ్లాక్‌బస్టర్ అనేది నిదర్శనం. సుకుమార్ విజన్ ‘పుష్ప2 ప్రపంచవ్యాప్తంగా ఎంతో గుర్తింపు వచ్చింది అన్నారు.



# ‘వేవ్స్’కమిటీలో భాగమైనందుకు సంతోషంగా ఉంది

## ప్రధాని మోడీకి మెగాస్టార్ చిరంజీవి ధన్యవాదాలు

**అంతర్జాతీయస్థాయిలో** భారత్‌ను గ్లోబల్ ఎంటర్టైన్మెంట్ హబ్‌గా మార్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది చివర్లో వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్టైన్మెంట్ సమ్మిట్ (వేవ్స్)ను నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో ఇండియన్ సినీ, పారిశ్రామిక ప్రముఖులందరితోనూ ప్రధాని నరేంద్ర మోడీ వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. ఈ క్రమంలో మెగాస్టార్ చిరంజీవిని వేవ్స్ అడ్వైజరీ బోర్డులో భాగం చేశారు. ఈ మేరకు చిరంజీవి తాజాగా తన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ప్రధాని మోడీ నాడు వేవ్స్ అడ్వైజరీ బోర్డు మెంబర్లతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. ఇందులో చిరంజీవి, సుందర్ పిచాయ్, సత్య నాదేళ్ల, ముఖేష్ అంబానీ, ఆనంద్ మహీంద్రా, అమితాబ్ బచ్చన్, షారుఖ్ ఖాన్, మోహన్ లాల్, రజినీకాంత్, ఆమీర్ ఖాన్, ఏఆర్ రెహమాన్, అక్షయ కుమార్, రణ్ బీర్ కపూర్, దీపిక పదుకొణె వంటి వారు పాల్గొన్నారు.

ఆర్థికరంగం కోసం దావోస్‌లోని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ఎలా జరుగుతుందో.. వినోద పరిశ్రమ కోసం అంతర్జాతీయ శిఖరాగ్ర సదస్సుగా వేవ్స్‌ను రూపొందిస్తున్నారు. వినోదం, సృజనాత్మకత, సంస్కృతిలో భారతదేశాన్ని ప్రపంచ అగ్రగామిగా అభివృద్ధి చేయడం దీని లక్ష్యం. ఈ మేరకు మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ ఇంతటి మహోత్తరమైన కార్యక్రమంలో భాగం చేసిన గౌరవనీయులైన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గారికి ధన్యవాదాలు. వేవ్స్ అడ్వైజరీ బోర్డ్‌లో భాగం కావడం, ఇతర గౌరవనీయమైన సభ్యులతో పాటుగా నా ఆలోచనల్ని పంచుకోవడం ఆనందంగా ఉంది. మోడీ మానస పుత్రిక అయిన వేవ్స్ భారతదేశాన్ని ప్రపంచ వేదికలపై సగర్వంగా చాటుకునేలా చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. త్వరలో జరగనున్న అద్భుతాల కోసం మనమంతా ఎదురుచూస్తుండాలి అని అన్నారు. ఈ భేటీ మీద ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పందిస్తూ.. వినోదం, సృజనాత్మకత, సంస్కృతి ప్రపంచాన్ని ఒకచోట చేర్చే ప్రపంచ శిఖరాగ్ర సదస్సు అయిన వేవ్స్ అడ్వైజరీ బోర్డ్ విస్తృతమైన సమావేశం ఇప్పుడే ముగిసింది. అడ్వైజరీ బోర్డు సభ్యులు వివిధ రంగాలకు చెందిన ప్రముఖ వ్యక్తులు, వారు తమ మద్దతును పునరుద్ఘాటించడమే కాకుండా భారతదేశాన్ని గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా మార్చడానికి మా ప్రయత్నాలను ఎలా మరింత మెరుగుపరచాలనే దానిపై విలువైన సలహాలు, సూచనల్ని పంచుకున్నారు అని అన్నారు.

# పోస్ట్ ప్రొడక్షన్ పూర్తి చేసుకున్న ‘చంద్రేశ్వర’



**శివ బాలాజీ** ఫిలింస్ పతాకంపై బేబీ అఖిల సమర్పణలో సురేష్ రవి ,ఆశా వెంకటేష్ హీరో హీరోయిన్లుగా జీవి పెరుమాళ్ వర్ధన్ దర్శకత్వంలో డాక్టర్ రవీంద్ర చారి నిర్మించిన ఎమోషనల్ ఎంటర్టైనర్ ‘చంద్రేశ్వర్ణ. ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలన్నీ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్ర చారి మాట్లాడుతూ ఇదొక ఆర్కియాలజీ నేపథ్యంలో ఎమోషనల్ తో కూడిన సస్పెన్స్ థ్రిల్లర్. ఈ సినిమాలో మంచి డివోషనల్ టచ్ కూడ వుంటుంది . ఈ చిత్రంలో శివుని నేపథ్యంలో ఉండే సాంగ్ ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుంది. జరార్డ్ ఫెలిక్స్ అందించిన సంగీతం ప్రధాన ఆకర్షణగా ఈ చిత్రం ప్రతి ఒక్కరిని ఆకట్టుకునేలా తీర్చిదిద్దడం జరిగింది. అలాగే సీనియర్ నటులు ఎంతోమంది ఈ చిత్రంలో నటించారు. ఈ చిత్రాన్ని అన్ని కమర్షియల్ హంగులతో ఫిబ్రవరి నెల ఆఖరుకు విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం అని అన్నారు. సురేష్ రవి, ఆశ వెంకటేష్, నిలగల్ రవి, బోసే వెంకట్, అడుకులం మురుగదాస్ గజరాజ్, జె ఎస్ కే గోపి, తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: జెరాడ్ ఫెలిక్స్, డిఒపి: ఆర్వి సీయోన్ ముత్తు, సింగర్స్: సాయి చరణ్, లిరిక్స్: వెంకట్, జ్యోతి, డిటిఎస్: శ్యామ్, ఎడిటర్: నందమూరి హరి, పిఆర్వో: బి. వీరబాబు, కో ప్రొడ్యూసర్ పి.సరిత , వి. బాలకృష్ణ,ప్రొడ్యూసర్: డాక్టర్ రవీంద్ర చారి, డైరెక్టర్: జీవి పెరుమాళ్ వర్ధన్

# కంటెంట్ బేస్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్..




**ఎటువంటి** బ్యాగ్రౌండ్ లేకుండా తెలుగు ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న విలక్షణమైన నటులలో రాగ్ మయూర్ ఒకరు. “సినిమా బండ్షి సినిమా తోనే విలక్షణమైన హీరోగా మంచి పేరు సంపాదించుకుంటున్నాడు. అద్భుతమైన పాత్రలకు కేరాఫ్ అడ్రస్ అవుతున్నాడు. వచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకోకుండా నచ్చిన పాత్రలను మాత్రమే చేస్తూ కెరియర్‌లో ఆచితూచి ముందడుగు వేస్తున్నాడు. తను ఏ పాత్ర చేసిన చాలా సహజంగా నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నాడు.

‘సినిమా బండ్షి సినిమా ఎంత పెద్ద హిట్ అయిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా ఆ సినిమాలో మరిడేష్ బాబు అనే పాత్రలో కనిపించిన రాగ్ మాయూర్ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. మరిడేష్ బాబు పాత్రలో రాగ్ మయూర్ నటించాడు అనేకంటే ప్రవర్తించాడు అని చెప్పాలి. ఆ సినిమాతోనే మంచి గుర్తింపు రావడంతో పాటు వరుసగా అవకాశాలు కూడా వచ్చాయి. రీసెంట్‌గా పంచాయత్ సినిమాకి రీమేక్ గా తెరకెక్కిన సివరపల్లి వెబ్ సిరీస్ ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో ట్రెండింగ్ లో ఉంది. ఈ సినిమాలో శ్యామ్ అనే పాత్రలో కనిపించాడు రాగ్ మయూర్. ఇంజనీరింగ్ చదువుకొని అమెరికా వెళ్లాలి అనుకునే ఒక కుర్రోడు సివరిపల్లి అనే ఒక ఊరికి పంచాయతీ సెక్రటరీగా వెళ్లడం, అక్కడ జరిగే కొన్ని పరిణామాలు ఆసక్తికరంగా, సహజంగా అనిపిస్తాయి. కొన్ని ఎమోషనల్ సీన్స్ లో రాగ్ మయూర్ నటించిన విధానం వర్ణనాతీతం అని చెప్పాలి. అందుకే ఈ వెబ్ సిరీస్ చాలామందికి విపరీతంగా నచ్చింది. సుకుమార్ కూతురు సుకృతి నటించిన గాంధీ తాత చెట్టు సినిమాకు కూడా మంచి ప్రశంసలు వచ్చాయి. ఈ సినిమాలో విలన్ పాత్రలో నటించాడు రాగ్ మయూర్. సూపర్ స్టార్ మహేష్ బాబు ఈ సినిమా గురించి ట్విట్టర్ వేదికగా రాసుకొచ్చారు. ఒకే రోజు రెండు వైవిధ్యమైన పాత్రల్లో నటించిన సినిమాలు రిలీజ్ అవ్వడం కూడా రాగ్ కెరియర్ లో ఒక అరుదైన అంశం. ప్రస్తుతం రాగ్ మయూర్ గరివిడి లక్ష్మి అనే సినిమాలో హీరోగా నటిస్తున్నాడు. ఈ సినిమాలో ఉత్తరాంధ్ర యాసను రాగ్ మయూర్ మాట్లాడబోతున్నట్లు సమాచారం వినిపిస్తుంది. ఈ సినిమా కూడా రాగ్ కెరియర్‌కు ప్లస్ కాబోతోంది అన్నారు.




# ‘శంబాల’ నుంచి స్వాసిక ఫస్ట్ లుక్ పోస్టర్..



**లబ్బర్ పందు,** పొరింజు మరియం జోస్, సత్తై, అయలుం నానుమ్ తమ్మిల్, ఇష్క్,సీబీఐ 5, కుమారి మొదలైన తమిళ, మలయాళ భాషల్లో నటించి స్వాసిక మంచి గుర్తింపును సంపాదించు కున్నారు. ఎన్నో కమర్షియల్ బ్లాక్‌బస్టర్‌లను తన ఖాతాలో వేసుకున్న స్వాసిక ప్రస్తుతం తెలుగు ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. ఆది సాయి కుమార్ హీరోగా సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్ శంబాల ఏ మిస్టిక్ వరల్‌లో స్వాసిక హీరోయిన్‌గా నటించారు. ఈసినిమాను రాజశేఖర్ అన్న భీమోజు, మహీధర్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తుండగా.. యుగంధర్ ముని దర్శకత్వం వహిస్తున్నారు. వసంత పాత్రలో స్వాసిక శంబాల చిత్రంలో కనిపించనున్నారు. తాజాగా రిలీజ్ చేసిన ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఎరుపు రంగు చీరలో స్వాసిక కనిపించిన తీరు.. ఆమె చూపులు, చుట్టూ ఉన్న వాతావరణం, ఆ పక్షి, దిష్టిబొమ్మ ఇలా అన్నింటినీ చూస్తుంటే సినిమా మీద మరింత ఆసక్తి పెరిగేలా ఉంది. శంబాల చిత్రం ఓ సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో రాబోతోంది. ఈ మూవీలో ఆది సాయి కుమార్ భౌగోళిక శాస్త్రవేత్తగా ఓ ఛాలెంజింగ్ రోల్‌లో కనిపించనున్నారు.

# ‘మదం’ చూడాలంటే గుండె ధైర్యం కావాలి..

**హర్ష గంగవరపు,** లతా విశ్వనాథ్, ఇనయ సుల్తాన ప్రధాన పాత్రల్లో ఏకైవ హోమ్స్ ప్రై.లి. బ్యానర్ మీద సూర్యదేవర రవీంద్రనాథ్ (చిన్న బాబు), రమేష్ బాబు కోయ నిర్మించిన చిత్రం ‘మదణ. ఈ చిత్రానికి వంశీ కృష్ణ మల్లా దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని మార్చి 14న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో మూవీకి సంబంధించిన టీజర్‌ను తండేల్ సినిమాతో పాటుగా థియేటర్లలో యాడ్ చేశారు. ప్రస్తుతం మదం మూవీ టీజర్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. దీంతో చిత్రయూనిట్ మీడియా ముందుకు వచ్చింది. ఈ టీజర్ సక్సెస్ అయిన సందర్భంగా డైరెక్టర్ వంశీకృష్ణ మల్లా మాట్లాడుతూ, మా మదం సినిమా మార్చి 14న రిలీజ్ కాబోతోంది. ఈ చిత్రానికి పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మా నిర్మాత రమేష్ ఇచ్చిన కథను చూసినప్పుడు నాకు చాలా భయమేసింది. ఇంతటి రా, రస్టిక్ సినిమా తెలుగులో రావడం అరుదు. తమిళ్, మలయాళీ భాషల్లో ఇలాంటి కంటెంట్ వస్తుంటుంది. మదం కథ నాకు చాలా నచ్చింది. ఇలాంటి క్లైమాక్స్ ఇప్పటి వరకు ఇండియన్ సినీ హిస్టరీలో రాలేదు. ఈ మూవీని చూడాలంటే చాలా గుండె ధైర్యం కావాలి అని అన్నారు. రైటర్ రమేష్ బాబు కోయ మాట్లాడుతూ,నా కథను ఇంత అద్భుతంగా తీసిన వంశీకృష్ణకు థాంక్స్. మాకు ఈ ప్రయాణంలో సహకరించిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. టీజర్‌ను ఇంత బాగా ఆదరిస్తున్న ఆడియెన్స్‌కు ధన్యవాదాలు అని అన్నారు.

ఇనయ సుల్తానా మాట్లాడుతూ,నాకు నెగెటివ్ పాత్రలు చేయడమంటే ఇష్టం. మదం చిత్రంలో నేను చాలా ఇంపార్టెంట్ కారెక్టర్‌ను చేశాను. మా డైరెక్టర్ వంశీ గారు సినిమాను అద్భుతంగా తీశారు. నా క్లిష్ట పరిస్థితుల్లో వంశీ గారు సపోర్ట్‌గా నిలిచారు. నేను బాగా నటించడానికి ఆయనే కారణం. లత నాకు మంచి స్నేహితురాలు. హర్ష చాలా రియలిస్టిక్‌గా నటించాడు. సినిమా అద్భుతంగా వచ్చింది. మార్చి 14న సినిమా రాబోతోంది. అందరూ చూడండి అని అన్నారు.



హర్ష గంగవరపు మాట్లాడుతూ, మదం సినిమాకు కథే హీరో. ఇందులో హై ఎమోషన్స్ ఉంటాయి. కథ చాలా బాగుంటుంది. దానికి తగ్గ పాత్రలు అందరికీ పడ్డాయి. అన్ని కారెక్టర్స్ బాగుంటాయి. నటించే స్కోప్ అందరికీ దొరికింది. మా రమేష్ కథ, వంశీ మేకింగ్ అద్భుతంగా ఉంటుంది. అందరికీ మా సినిమా నచ్చుతుందని భావిస్తున్నాను అని అన్నారు.

లతా విశ్వనాథ్ మాట్లాడుతూ,నా నిజ జీవితంలో దగ్గరగా ఉండే పాత్రను పోషించాను. అందుకే నాకు ఎక్కడా కష్టంగా అనిపించలేదు. నాకు ఇంత మంచి పాత్రను ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. నా ఫ్రెండ్ ఇనయతో కలిసి నటించడం ఆనందంగా ఉంది. హర్షతో నటించడం సంతోషంగా ఉంది. మా సినిమా మార్చి 14న రాబోతోంది. అందరూ సపోర్ట్ చేయండి అని అన్నారు.

# ‘లైల్లా ఫన్ రైడ్ లా ఉంటుంది

**- నిర్మాత సాహు గారపాటి**



**మాస్ కా దాస్** విశ్వక్సేన్ యూనిక్ రొమాంటిక్ యాక్షన్ ఎంటర్టైనర్ ‘లైల్లా ఎక్సయిటింగ్ ప్రమోషనల్ కంటెంట్‌తో స్ట్రాంగ్ బజ్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రానికి రామ్ నారాయణ్ దర్శకత్వం వహించారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించారు. ఆకాంక్ష శర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. పాటలు చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. లేటెస్ట్‌గా విడుదలైన ట్రైలర్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. లైలా ఫిబ్రవరి 14న బిగ్ స్క్రీన్స్ లో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత సాహు గారపాటి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.

**లైలా సినిమా నిర్మించడానికి మిమ్మల్ని ఎట్రాక్ట్ చేసిన ఎలిమెంట్స్ ఏమిటి ?**

మెయిన్ కామెడీ. దీంతో పాటు ఒక హీరో ఇలాంటి కథని చేస్తానని యాక్సప్ట్ చేయడం నాకు చాలా నచ్చింది. అంతకుముందు కొందరు హీరోలని సంప్రదించాం. లేడి గెటప్ చేయడం అంత ఈజీ కాదు. విశ్వక్ చేస్తానని చెప్పడంతో నాకూ ఇంట్రస్ట్ కలిగి ముందుకు తీసుకెళ్ళాం. ఇలాంటి కథలు వచ్చి చాలా కాలమైయింది. విశ్వక్ చాలా జీల్ వున్న యాక్టర్. ఈ కథ విన్నవెంటనే అన్న ఇది నేనుచేయాల్సిన క్యారెక్టర్ అని చెప్పారు. ఇందులో లవ్ స్టోరీతో పాటు ఫన్ ఎంటర్ టైన్మెంట్ వుంటుంది.

**లైలా, సోను క్యారెక్టర్స్ బ్యాలెన్స్ ఎలా వుంటుంది ?**

ఫస్ట్ హాఫ్ అంతా సోను వుంటాడు. తన లవ్ స్టోరీ ఫస్ట్ హాఫ్ లో వుంటుంది. అనుకోని కారణంగా తనని లైలా గా మార్చుకొని ఇన్నోసెన్స్ ని ప్రూవ్ చేసుకుంటాడు. ఆ రీజన్ చాలా ఎమోషనల్ గా వుంటుంది. విశ్వక్ లైలా గెటప్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది, అందరూ లుక్ పర్ఫెక్ట్‌గా సెట్ అయ్యిందని అంటున్నారు. నా వరకూ లైలాకే ఎక్కువ మార్కులు వేస్తాను. ట్రైలర్ చూస్తుంటే అడల్ట్ కామెడీ అనిపిస్తోంది.

**ఇలాంటివి బాలీవుడ్‌లో ఎక్కువగా వర్క్ అవుతాయి కదా ?**

అడల్ట్ కామెడీ అన్ని చోట్ల వుంది. ట్విట్టర్ ఓపెన్ చేస్తే కనిపించేదంతా అదే కదా. దానితో పోల్చుకుంటే ఇది చాలా తక్కువ. హీరో లేడీ క్యారెక్టర్, కొందరికి అర్థం కాని డెక్కన్ లాంగ్వేజ్ మాట్లాడటం వలన ‘ఏ’ సర్టిఫికేట్ ఇచ్చారు కానీ సినిమాలో ఆడల్ట్ కామెడీ అంటూ ఏమీ లేదు. రెగ్యులర్‌గా మనం మాట్లాడుకున్నట్లే ఉంటుంది.

**యూత్ ని టార్గెట్ చేసినట్లుగా అనిపిస్తోంది ?**

యూత్ ని టార్గెట్ చేశాం. అయితే ఫ్యామిలీ ఆడియన్స్ కూడా ఎంజాయ్ చేస్తారు. నవ్వించాలనే ప్రయత్నంతో చేసిన సినిమా ఇది. అందులో సక్సెస్ అయ్యామని నమ్ముతున్నాం.

**రేపు మెగాస్టార్ చిరంజీవి ఈవెంట్ కి వస్తున్నారు కదా.. ఆయన ట్రైలర్ చూశారా ?**

ట్రైలర్ చూశారు. కొత్త ప్రయత్నం చేశామని విశ్వక్‌ని మెచ్చుకున్నారు. ఆయనకి ట్రైలర్ చాలా నచ్చింది. మమ్మల్ని ఎంకరేజ్ చేయడానికి ఆయన రావడం మా అదృష్టం.

**చిరంజీవితో సినిమా ఎప్పుడు స్టార్ట్ చేస్తున్నారు?**

మే, జూన్‌లో స్టార్ట్ అవుతుంది. నెక్స్ట్ సంక్రాంతికి రిలీజ్ చేస్తాం. అనిల్ రావిపూడి మార్క్‌లో పర్ఫెక్ట్ కమర్షియల్ సినిమాలా వుంటుంది. వింటేజ్ చిరంజీవిలా ఆయన రోల్ ఉంటుంది.

**డైరెక్టర్ రామ్ నారాయణ్ గురించి ?**

తన కథకు తగ్గట్టుగా విశ్వక్‌ని చూపించడంలో డైరెక్టర్ వందశాతం సక్సెస్ అయ్యాడు. సినిమాని చాలా అద్భుతంగా తీశాడు. లైలా అనే టైటిల్ దర్శకుడు స్క్రిప్ట్ రాసుకున్నప్పుడే ఫిక్స్ చేసుకున్నాడు. తను అనుకున్నది పెర్ఫెక్ట్ గా ప్రజెంట్ చేశాడు.

**లైలాలో ఎమోషనల్ పాయింట్ ఏమిటి ?**

లైలా కంప్లీట్ ఎంటర్ టైనర్. హైదరాబాద్ బ్యాక్ డ్రాప్ లో వుంటుంది. అందులో మదర్ ఎమోషన్ కూడా హత్తుకునేలా వుంటుంది. సినిమా అంతా ఫన్ రైడ్ లా వుంటుంది. రెండు గంటల పాటు హాయిగా నవ్వుకుందామని తీసిన సినిమా లైలా.

**ఒక నిర్మాత కావాలని వచ్చిన వారికి మీరు ఏం చెప్తారు ?**

ఫ్రాంక్ గా చెప్పాలంటే మార్కెట్ కొంచెం ఇబ్బంది గానే వుంది. మనం అనుకున్న బడ్జెట్‌లో చూసుకుంటే హ్యాపీ. పెరిగితే ఎవరికైనా ఇబ్బందే.

# ఆ ఊరు ప్రపంచానికి పరిచయమైంది!

ఊరు, ఊళ్లోని ప్రజలు... ఇదే మా ప్రపంచం. ఝార్ఖండ్ 'బుండూ' అంటే ఒక పల్లె ఉందన్న సంగతి ఆ రాష్ట్ర ప్రజలకీ తెలిసుండదు. కానీ ఇప్పుడు మా ఊరి పేరునీ, మా నాయకుడి గొప్పతనాన్ని ఇంత పెద్ద వేదిక మీద పొగుడుతోంటే ఆనందంగా ఉంది. ఇప్పుడు మా ఊరు ప్రపంచానికి పరిచయమైంది అంటోంది పూన్. 'ప్రధానమంత్రిని అల్లంత దూరం నుంచి చూస్తామను కున్నాం. కానీ ఆయన మాటతో మాట్లాడతారని అనుకోలేదు. ప్రధాని నివాసం, పార్లమెంట్ చూస్తామని కలలోనైనా ఊహించలేదు. ఇవన్నీ నిజంగా జరుగుతోంటే కలలో ఉన్నట్లుగానే ఉంది' అని తమ అనుభవాలను చెప్పారు. ఛత్తీస్గఢ్ నుంచి వచ్చిన 'బైగా' మహిళలు. ఇంట్లో ఒక టీవీ ఉంటే బాగుండు. ప్రపంచాన్ని తెలుసుకోవచ్చు. జెండా వందనం, పరేడ్ స్టేజ్ ఎలా జరుగుతాయో చూడొచ్చు అనుకునేదాన్ని. కానీ ఇంత దగ్గరగా నా కళ్లారా చూసిన అనుభూతి ముందు అదెం? ఆ అర్హత మాకుందన్న భావనే కొత్తగా ఉంది అంటోంది లద్దానికి చెందిన జుబేదా. ఎవరు వీళ్లంతా అంటే.. ఈ



గణతంత్ర వేడుకలకు సామాన్యులకూ ఆహ్వానాలు అందాయని తెలుసుగా! ఆ జాబితాలో ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందిన వివిధ రాష్ట్రాలకు చెందిన 550 మంది= గిరిజనులు ఉన్నారు. వీళ్లంతా వాళ్లే. 19 ఏళ్ల నుంచి 50కి పైగా వయసున్న వారు ఈ ఆహ్వానాలను అందుకున్నారు. కానీ వీరిలో జీవితంలో ఒక్కసారి కూడా ఊరు దాటనివారే ఎక్కువ. కాక పోతే ప్రభుత్వ ఆసరాని అందుకు బతుకుల్ని మార్చుకున్నారు. రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనే అవకాశం వచ్చింది. అలా వాళ్ల జీవితాల్లో ఇది ఓ అరుదైన సంఘటన మాత్రమే కాదు... మేమూ ఎవరికీ తీసిపోము. తలుచుకుంటే ఏదైనా సాధించగలమన్న ఆత్మవిశ్వాసాన్ని వాళ్లలో పెంచిన సందర్భం కూడా.



# ఆమె పెళ్లి రాష్ట్రపతి నిలయంలో..

రాజుల కాలం నాటి కోట్లు, ప్రకృతి అందాలతో అలరారే ప్యాలస్‌లు, సముద్రపు అలల హోరుతో ఆహ్లాదాన్నిచ్చే బీచ్‌లు.. పెళ్లి వేదికలుగా మారుతున్న రోజులివి. కొన్ని సెలబ్రిటీలు, సంపన్నులు ఈ ప్రాంతాలనే తమ పెళ్లి మండపాలుగా ఎంచుకొంటున్నారు. అందుకే వీళ్ల వివాహాలు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారుతుంటాయి. అయితే వృత్తినే దైవంగా భావించే సీఆర్పీఎఫ్ అధికారిణి పూనమ్ గుప్తా కూడా తన పెళ్లి ఇలాగే అందరి దృష్టిని ఆకర్షిం చేలా జరగాలి. అలాగని గోవా లాంటి బీచుల్ని, రాజస్థానంలో కొలువైన కోటల్ని తన పెళ్లి వేదికగా చేసుకోవాలనుకోలేదామె. అంతకుమించి.. భారతీయ సంస్కృతికి, వారసత్వానికి ప్రతీకగా నిలిచే రాష్ట్రపతి నిలయంలో పెళ్లి పీటలెక్కేందుకు రడీ అయింది. ఇలా రాష్ట్రపతి భవనంలో జరగనున్న తొలి వివాహం ఇదే కావడం విశేషం! అందుకే ప్రస్తుతం పూనమ్ పేరు దేశవ్యాప్తంగా మార్మోగుతోంది. అసలు ఈ అధికారికి ఈ అవకాశం ఎలా వచ్చింది!

**ముర్ము మనసు గెలుచుకొని:** వివాహం... ప్రతిఒక్కరి జీవితంలో ఓ మధుర ఘట్టం. అందుకే ఈ వేడుకను ఆత్మీయుల సమక్షంలో ఘనంగా జరుపుకుంటారు. సీఆర్పీ ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ అయిన పూనమ్ గుప్తా కూడా ఇలాగే ఆలోచించింది. ప్రస్తుతం రాష్ట్రపతి భవన్ 'వ్యక్తిగత భద్రతా అధికారిణి (PSO)'గా విధులు నిర్వర్తిస్తున్న ఆమె.. తాను పనిచేసే చోటే వివాహం చేసుకోవాల్సి ఉంది. అయితే అదంతా సులభం కాదు. రాష్ట్రపతి భవనంలో వివాహమంటే దేశ రాష్ట్రపతి అనుమతి కావాలి. విధి నిర్వహణలో తాను చూపిన నిబద్ధత, అంకితభావంతోనే ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మనసు గెలుచుకుంది పూనమ్. దీనితో పూనమ్ కోరిక ప్రకారం రాష్ట్రపతి భవనంలో వివాహం చేసుకునేం దుకు ఆమె అనుమతించారు. అందుకే పెళ్లికి ముందే ఈ అధికారికి జీవితాంతం మర్చిపోలేని కానుకను అందిం చారు. ముర్ము ఇలా రాష్ట్రపతి నిలయంలో మనువాడ నున్న తొలి వ్యక్తిగా పూనమ్ పేరు చిరస్థాయిగా నిలిచి పోనుంది. ఫిబ్రవరి 12న ఇక్కడి మదర్ థెరిసా క్రాస్ కాంప్లెక్స్‌లో తన కుటుంబ సభ్యులు, అతి కొద్దిమంది బంధువుల సమక్షంలో వివాహ బంధంలోకి అడుగు పెట్టనున్నారు డేరింగ్ ఆఫీసర్.

**లేఖ రాసి.. అమమతి కోరి!** సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ అయిన పూనమ్ విధి నిర్వహణలో అడుగడుగునా తన అంకితభావాన్ని ప్రదర్శిస్తుంది. ఈ చెల్లింపునే రెండేళ్ల క్రితం గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో మహిళా బృందానికి నాయకత్వం వహించి వార్తల్లో నిలిచింది. ప్రస్తుత రాష్ట్రపతి నిలయంలో వ్యక్తిగత భద్రతా అధికారిణి (పీఎస్ఓ)గా సేవలందిస్తున్న ఆమె.. గతంలో బీహార్‌లోని నక్సల్స్ ప్రభావిత విభాగాలనూ పనిచేసి.. ధైర్యసాహసాలు ప్రదర్శించారు. ఇలా తన వృత్తిలో భాగంగా ఎలాంటి సవాలుకైనా వెనకాడని ఆమెకు.. జమ్మూకశ్మీర్‌లో సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాం డెంట్‌గా పనిచేస్తున్న అవినాశ్ కుమార్‌తో ఇటీవలే పెళ్లి నిశ్చయమైంది. ఈ జంట రాష్ట్రపతి భవన్‌లోనే వివాహం చేసుకోవాలనుకున్నారు. అయితే ఇందుకు అనుమతి కోరుతూ రాష్ట్రపతికి లేఖ రాసినట్లు చెబుతోంది పూనమ్.




**రాష్ట్రపతి అధికారిక నివాసం..** భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక వారసత్వానికి ప్రతీక ఇక్కడ విధులు నిర్వహించడం గౌరవంగా భావించాను. అందుకే.. ఇక్కడే పెళ్లి చేసుకోవాలనుకున్నా. కానీ అం దుకు ముర్ము జీ ఆమోదం కావాలి. కాబట్టి.. మేడమ్ అనుమతి కోరుతూ లేఖ రాశాను. ఆమె పెద్ద మనసుతో నా విన్నపాన్ని అంగీకరిస్తూ.. మా వివాహానికి ప్రత్యేక అనుమతి ఇచ్చారు. దీంతో రాష్ట్రపతి నిలయంలో మను వాడనున్న తొలి జంటగా మా పేరు మార్మోగ నుంది... అంటూ సంబరపడిపోతోంది మహిళా అధికారిణి.



**చిన్ననాటి కల..** మధ్యప్రదేశ్‌కు చెందిన పూనమ్‌కు చిన్నప్పట్నుంచీ సైన్యంలో చేరాలని కోరిక, గణిత డిగ్రీ డిగ్రీ పూర్తిచేసిన ఆమె.. ఆపై ఆంగ్ల సాహిత్యంలో చదివింది. తర్వాత ప్రభుత్వ పోటీలపై దృష్టిసారించిన పూనమ్.. 2018లో యూపీఎస్సీ సీఏపీఎఫ్ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభకనబరుస్తూ ఆలిండియా 81వ ర్యాంక్‌ని సాధించింది. సీఆర్పీఎఫ్ ఉద్యోగం రావడంతో నా కల నెరవేరింది. బిహార్‌లోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతంలో తొలి పోస్టింగ్ అందుకుంది. ఇదెంతోగా సవాలు, సాహసోపేతంగా అనిపించింది. అనుక్షణం. అప్రమత్తంగా ఉంటూనే, ధైర్యసాహసాలు ప్రదర్శిస్తూ విధులు నిర్వర్తించాను. దీనితో రాష్ట్రపతి నిలయంలో వ్యక్తిగత భద్రతా అధికారిగా ప్రమోషన్ అందుకున్నారు. ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము భద్రతను పర్యవేక్షించే బృందంలో భాగమయ్యాను. ఈ అవకాశం రావడం నా అదృష్టం.. అని చెబుతోన్న పూనమ్ సోషల్మీడియాలోనూ చురుగ్గా ఉంటుంది. ఇన్స్టా వేదికగా తన వృత్తికి సంబంధించిన విషయాలు పంచుకుంటూ విద్యార్థుల్లో, ఈ తరం అమ్మాయిల్లో స్ఫూర్తిని నింపుతోంది లేడీ ఆఫీసర్.

# అందానికి చెరకు

రుచితో పాటు పోషకాలు నిండి ఉన్న చెరకు రసం ఆరోగ్యానికే కాదు.. అందానికి, కేశ సౌందర్యానికీ మేలు చేస్తుందంటున్నారు నిపుణులు. అదెలాగో తెలుసుకుందాం రండి..

**చర్మకాంతికి..** చెరకురసంలో కొద్దిగా ముల్తానీ మట్టిని కలిపి




పేస్ట్ చేసుకుని ముఖానికి పట్టిస్తే చర్మంపై ఉన్న నల్ల మచ్చలు తొలగిపోతాయి. ఇందులో ఉండే సమ్మేళనాలు చర్మకణాలను పునరుత్తేజితం చేస్తాయి. చెరకు రసంలో తేనె కలిపి.. ఈ మిశ్రమంతో పావుగంట పాటు చర్మానికి మర్దన చేయాలి. తర్వాత ఇరవై నిమిషాల పాటు ఉంచి కడిగేయాలి. వారానికి రెండుసార్లు ఇలా చేయడం వల్ల చర్మం మృదువుగా మారుతుంది. .కాఫీపొడికి కాస్త చెరకురసాన్ని చేర్చి స్క్రాబ్‌లో ఉపయోగిస్తే చర్మం కాంతులీనుతుంది. నిమ్మరసం, యాపిల్ జ్యూస్, ద్రాక్ష రసం, కొబ్బరి పాలు, చెరకు రసం.. వీటని సమపాళ్లలో తీసుకొని బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని చర్మానికి పట్టించాలి. ఇలా చేయడం వల్ల చర్మంపై ఉన్న మొటిమలు, మచ్చలు తొలగిపోయి మేనికి మెరుపు వస్తుంది. చర్మాన్ని యవ్వనంగా, బిగుతుగా ఉంచడానికి మామూలు ఐస్క్యూబ్ల కన్నా చెరకు రసంతో తయారు చేసుకున్న ఐస్ క్యూబ్‌ను వాడితే రెట్టింపు ఫలితాలుంటాయని నిపుణులు భావిస్తున్నారు. బొప్పాయి గుజ్జులో చెరకు రసాన్ని కలిపి పట్టించడం వల్ల చర్మం బిగుతుగా మారుతుంది. .. నాలుగు చెంచాల చెరకు రసానికి రెండు చెంచాల నెయ్యి చేర్చి.. ఈ మిశ్రమంతో చర్మానికి మర్దన చేస్తే ఎండ వల్ల



కమిలిన చర్మం తిరిగి కొత్త నిగారింపును సంతరించుకుంటుంది. లీటరు నీటిలో గుప్పెడు పుదీనా ఆకులు, పావు లీటరు చెరకు రసం కలిపి, మరిగించి ఆవిరి పట్టుకుంటే చర్మం తేటగా తయారవుతుంది. ఎటువంటి పదార్థాలూ కలపకుండా స్వచ్ఛమైన చెరకు రసాన్ని ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు చర్మానికి పట్టిస్తే చర్మం ఆరోగ్యంగా, మృదువుగా మారుతుంది. కురులకు కొత్త కళ.. చెరకు రసాన్ని కుదుళ్లకు పట్టించి గంట తర్వాత గోరు వెచ్చని నీటితో తలస్నానం చేస్తే పొడిబారిన జుట్టు తిరిగి పట్టులా మెరుస్తుంది. చెరకు రసం జుట్టుకు సహజ సిద్ధమైన కండిషనర్గా ఉపయోగపడుతుంది.

# అరటిపండు అందాలు



ఇతర ఏ పండ్లలోనూ లేనన్ని సుగుణాలు అరటిపండ్లలో ఉన్నాయంటే అతిశయం కాదు. ఇవి రుచీ, బలమే కాదు ధర కూడా స్వల్పం. ఈ తియ్యటి పండ్ల మీది ప్రేమతో చూడముచ్చటైన ఆకృతులిచ్చి, పళ్లేల్లో అమర్చారు. ఇక పిల్లలు తినకుండా ఉండగలరా చెప్పండి.









# దానిమ్మ జ్యూస్ ఇక సులువు!



ఎర్రటి దానిమ్మ గింజలు చూడడానికి భలే ఆకర్షణీయంగా ఉంటాయి కదా. తినడానికి రుచిగానూ ఉంటాయి. కానీ ఒలుచుకుని తినాలంటేనే ఎక్కడలేని నీరసం ముంచుకొస్తుంది. పోనీ మిక్సీలో వేసి జ్యూస్ తీసుకోవాలంటే జార్ సిద్ధం చేసుకోవాలి. సమయానికి కరెంటు లేకపోతే మరో ఇబ్బంది. కానీ ఇలాంటి జ్యూసర్ ఒకటి ఉంటే ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. గింజలను దీంట్లో వేసి చేత్తో ఒత్తుతూ పైభాగాన్ని తిప్పితే చాలు జ్యూస్ కింది పాత్రలోకి దిగుతుంది. తర్వాత దీన్ని సులువుగా శుభ్రం చేసుకోవచ్చు కూడా. మీకు నచ్చిందా మరి...

# అందుకే రోటి పచ్చళ్లే మంచివట !



**పల్లీ చట్నీ, నువ్వుల చట్నీ, కొబ్బరి చట్నీ, కరివేపాకు చట్నీ, వివిధ రకాల కాయగూరలుఆకుకూరలతో చేసుకునే చట్నీలు..** ఇలా ఏదో ఒక పచ్చడి లేనిదే మన భోజనం పూర్తి కాదు. బయట హోటల్‌లో భోంచేసినప్పుడు కూడా ఏదో ఒక చట్నీ వడ్డించడం మనం చూస్తూనే ఉంటాం. మన ఆహారపుటలవాట్లలో చట్నీకి ప్రాధాన్యత ఉంటే మరి, అలాంటి చట్నీని తయారు చేసుకోవడానికి మనం ఏం ఉపయోగిస్తాం..? మిక్సీ లేదంటే వెట్ గైండర్ కాదు! సులభంగా, త్వరగా చట్నీ చేయడం పూర్తవుతుంది కాబట్టే అందరూ వీటి పైనే ఆధారపడతారు. కానీ అదే సమయంలో రోట్లో రుబ్బుకున్న పచ్చడి రుచిని ఇది అందించలేదని కూడా అంటుంటారు మన పెద్దవాళ్లు, మరి, మిక్సీలో రుబ్బుకున్న పచ్చడి కంటే రోట్లో చేసుకున్న పచ్చడికి ఎందుకంత రుచి వస్తుంది? దానివల్ల మన ఆరోగ్యానికి చేకూరే ప్రయోజనాలేంటి? తెలుసుకుందాం రండి.. ఇడ్లీ, దోసె, వడ, వంటి టిఫిన్స్‌లోకే కాదు.. భోజనంలోకీ రకరకాల పచ్చళ్లను తినడం మనలో చాలామందికి అలవాటు! అయితే మిక్సీ, వెట్ గ్రైండర్ వంటి గ్యాడ్జెట్స్ వచ్చాక మనకు ఆ పని మరింత తేలికైంది. కానీ ఇలాంటి పరికరాల్లో రుబ్బుకున్న పచ్చళ్ల రోట్లో నూరుకున్న పచ్చడిలోనే ఎక్కువ పోషకాలు ఉంటాయంటున్నారు పోషకాహార నిపుణులు. వారానికి మూడుసార్లు! మన భారతీయ పాకశాస్త్రంలో పచ్చళ్లది ప్రత్యేక స్థానం. మసాలాలు, ఫైబర్, ఫైటోన్యూట్రియంట్స్ వంటి పోషకాలన్నీ వీటి ద్వారా మన శరీరానికి అందుతాయి. వారానికి కనీసం మూడు సార్లు ఏదో ఒక పచ్చడిని ఆహారంలో భాగంగా తీసుకోవడం మంచిది. మీకు మరో విషయం తెలుసా? పచ్చళ్లను భోజనంలో.. అది కూడా లంచ్‌లో భాగంగా తీసుకోవడం వల్ల మధ్యాహ్నం భోంచేశాక వచ్చే ఒక రకమైన నిద్ర మత్తు, అలసటకు దూరంగా ఉండొచ్చు. ఇక చట్నీ చేసే వీటిని వాడే పదార్థాలన్నీ పచ్చడి బండతో ముక్కలు ముక్కలు చేయడం వల్ల వాటిలోని సూక్ష్మ పోషకాలు, స్టెరోల్స్, ఫ్లేవనాయిడ్స్.నన మొదలైనవన్నీ బయటికి విడుదలవుతాయి. ఆ చట్నీని తినడం వల్ల అవన్నీ మన శరీరానికి బాగా పడతా యంటున్నారు పోషకాహార నిపుణులు. చాలామంది చట్నీ అనగానే మిక్సీ/వెట్ గ్రైండర్లో చేసేస్తుంటారు. పని పూర్తవడంతో పాటు ఎలాంటి త్వరగా లేకుండా సులభంగా చట్నీ చేసేయచ్చని వారు భావిస్తున్నారు. నిజానికి ఇలా మిక్సీలో చట్నీ చేయడం వల్ల వాటిలోని పోషకాలన్నీ నశించిపోతాయి. అదేలాగంటే.. మనం పచ్చడి కోసం వాడే పదార్థాల్లో ఉండే కొన్ని సూక్ష్మ పోషకాలు వేడికి తట్టుకోలేవు. కాబట్టి మిక్సీ/గ్రైండర్‌లో పచ్చడి చేసే వేడి ఉత్పత్తయ్యే వల్ల ఇవన్నీ నశించిపోతాయి. అదే రోట్లో రుబ్బుకునే పచ్చళ్ల కోసం పచ్చడి బండను ఉపయోగిస్తాం. ఇది ఉష్ణ నిరోధకం కాబట్టి పచ్చడి చేసే వేడి పుట్టకుండా అందు లోని పోషకాలన్నీ అలాగే నిక్షిప్తమై ఉంటాయి. ఇలా రోట్లో చేసే పచ్చడి వల్ల ఆయా పదార్థాల్లోని సుగుణాలన్నీ మన శరీరానికి అందుతాయి.. అలాగే చక్కటి రుచిని ఆస్వాదించవచ్చు.



**ప్రయోజనాలెన్నో!.** ◆ ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. శరీరంలోని కణాల రక్తంలోని గ్లూకోజు మరింత సమర్థంగా ఉపయోగించుకుంటుంది. ◆ థైరాయిడ్ సమస్యతో బాధపడే వారు విపరీతమైన అలసటకు గురవుతారు. అలాంటి వారు రోజూ తప్పనిసరిగా చట్నీ తీసుకోవడం మంచిది. ఆ అలసటను దూరం చేసుకోవచ్చు. ◆అజీర్తి వంటి జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడే వారికి రోటి పచ్చళ్లు మంచి ప్రత్యామ్నాయం. ఎందుకంటే ఇవి జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తాయి. 'సి ' డి', 'బి12 '.. వంటి విటమిన్ల లోపం ఉన్న వారు రోజూ తీసుకునే ఆహారంలో చట్నీని తప్పనిసరిగా భాగం చేసుకోవాలి.

# పరమాత్ముడి కృతజ్ఞత



ఆధ్యాత్మికం

**దేవకీపుత్రుడు ఓ రోజు** ద్వారకలోని తన నందనవనంలో ఆత్మీయులతో కలిసి విహరిస్తున్నాడు. అర్ధాంగి రుక్మిని ఓ వైపు, అనుంగు సోదరి ద్రౌపది మరో వైపు, వెంట పరిచారికలతో ఆహ్లాదకరంగా కబుర్లాడుతూ గులాబీతోట దిశగా సాగుతోంది. సోదరికి, అర్ధాంగికి బహుకరించేందుకు అందంగా అర విరిసిన గులాబీలను స్వయంగా కోయటానికి సిద్ధమయ్యాడు వాసుదేవుడు. హడావుడిగా కొమ్మపై చేయి పెట్టిన కృష్ణుడి వేళ్లకు ముళ్లు గుచ్చుకున్నాయి. చేతికి రక్తం కారుతోంది. రుక్మిణీదేవి, పరిచారికలు కట్టుకట్టేందుకు వస్త్రం కోసం భవనం దిశగా పరుగులు పెట్టారు. పక్కనే ఉన్న సోదరి. ద్రౌపదీ మాత్రం తన పట్టుచీర కొంగును చింపి సోదరుడి చేతికి కట్టు కట్టింది. ఆ ఆలోచన వారికి రానందుకు రుక్మిణీదేవి, పరిచారికలు కొంచెం సిగ్గుపడ్డారు. చెల్లెలి స్పందనకు కృష్ణుడు కదిలిపోయాడు. ఆ సంఘటనను మనసులో ముద్రించుకున్నాడు. అలా కాలం గడిచిపోయింది. కౌరవసభలో పాండవులకు పరాభవం ఎదురైంది. దుశ్శాసనుడు ద్రౌపదిని నిండు సభలో అవమానిస్తున్న సందర్భమది. అర్తజన రక్షకుడికి 'అన్న' అన్న సోదరి పిలుపు వినిపించింది. తక్షణం ఆమె తన గాయానికి కట్టిన పట్టుపీలిక గుర్తొచ్చింది. ఆ అనురాగానికి ప్రతిఫలంగా అనంతమైన వస్త్రాన్ని ప్రసాదించి ఆమె మానాన్ని కాపాడాడు. తన కృతజ్ఞతను చాటుకున్నాడు. గోరంత మేలు చేసినా, కొండంత కృతజ్ఞతలు చెల్లించుకోవటం భగవంతుని లక్షణం అని నిరూపించాడు. శ్రీకృష్ణపరమాత్ముడికి సంబంధించి జానపదుల్లో ప్రచారంలో ఉన్న కథ ఇది.

# ఊదలుతో ఊబకాయం దూరం..

రాగులు, సజ్జల్లాంటివి తింటుంటాం కానీ ఊదల గురించి మనకు పెద్దగా తెలీదు. వీటిలో పీచు, ప్రొటీన్లు, క్యాల్షియం, ఐరన్, భాస్వరం, మెగ్నీషియం విస్తారం. ఊదల వల్ల ఎన్నో ప్రయోజాలు ఉన్నాయి

★ ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. ఊబకాయం రాదు.
★ రక్తహీనత నుంచి బయటపడొచ్చు. బ్లడ్ షుగర్ స్థాయి క్రమబద్ధమవుతుంది.
★ గుండెజబ్బులు వచ్చే అవకాశం తగ్గుతుంది.
★ ఊదలతో జావ, అన్నం, ఇడ్లీ, ఖీర్, రొట్టెలు, పరోటా, ఉప్మా, ధోక్లా, టిక్కీ, కిచిడీ, పులావ్ ఇలా . ఎన్నో చేసుకోవచ్చు.

ఊదల పులావ్ ఇలా... ఒక కప్పు ఊదలకు రెండు టేబుల్ స్పూన్ల నెయ్యి, రుచికి సరిపడా ఉప్పు, చారెడు జీడిపప్పు, లవంగాలు, యాలకులు రెండేసి, దాల్చినచెక్క అంగుళం ముక్క, సోంపు, జీలకర్ర, అల్లం వెల్లుల్లి ముద్ద చెంచా చొప్పున, మూడు పచ్చిమిర్చి, నిమ్మ ఉల్లి, టొమాటో, బంగాళాదుంప, బంగాళాదుంపల పొడి చారెడు, కొత్తిమీర తరుగు, రెండు ఉల్లికాడలు తీసుకోవాలి. ఊదలను కడిగి నానబెట్టాలి, ఈలోగా.. ఉల్లి, బంగాళదుంప మొదలైనవాటిని తరగలి. ప్యాన్‌లో నెయ్యి వేడయ్యాక మసాలా దినుసులు, అల్లం వెల్లుల్లి ముద్ద, జీడిపప్పు వేయాలి. అవి వేగాక మిరియాల పొడి, ఉల్లి, పచ్చిమిర్చి, టొమాటో, బంగాళ దుంప, తరిగిన ఉల్లికాడలు, ఉప్పు జతచేసి వేయించాలి. వాటిని కాస్త ఊడకనిచ్చి.. నాన బెట్టిన ఊదలు, రెండు కప్పుల నీళ్లు, నిమ్మరసం వేసి కలియతిప్పి మూత పెట్టాలి. మూడు నిమిషాల తర్వాత దించేసి కొత్తిమీర తరుగు చల్లితే సరిపోతుంది.



# ఛాంపియన్స్ ట్రోఫీ.. స్క్వాడ్‌లకు టెర్రర్


బుమ్రా


జామీ స్మిత్


లాకీ ఫెర్గూసన్


పాట్ కమ్మిన్స్

## గాయాల బారిన ప్లేయర్స్

## పలువురు స్టార్లు దూరం

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక ఛాంపియన్స్ ట్రోఫీ-2025 దగ్గర పడుతున్న కొద్దీ వివిధ జట్లు భయాలతో తారెత్తుతున్నాయి. ఈ టోర్నమెంట్‌లో ఆడుతున్న చాలా మంది ఆటగాళ్లపై సస్పెన్స్ నెలకొంది. ప్రధానంగా గాయాల పాలైన పలువురు స్టార్లు ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యే అవకాశాలు ఉత్పన్నమయ్యాయి. ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభానికి ముందు చాలా మంది ఆటగాళ్లు గాయాల కారణంగా ఆటకు దూరంగా ఉన్నారు. 2025 సంవత్సరంలో క్రికెట్ ప్రపంచంలో మొట్టమొదటి, అతిపెద్ద టోర్నమెంట్ ఛాంపియన్స్ ట్రోఫీ అవుతుంది. ఈ ఐసిసి టోర్నమెంట్ ఈ నెల 19 నుంచి ప్రారంభమవుతుంది. ఫైనల్ మ్యాచ్ మార్చి 9 న జరుగుతుంది. ఈ ట్రోఫీకి ఇప్పటికే అన్ని జట్లు తమ స్క్వాడ్లను ప్రకటించాయి. అయితే, స్క్వాడ్ ప్రకటన తర్వాత, చాలా జట్లు పెద్ద షాక్‌కు గురయ్యాయి. ప్రతీ జట్టులోని కొంతమంది ప్లేయర్లు గాయాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ కారణంగా కొంతమంది ఆటగాళ్లను టోర్నమెంట్ నుంచి తొలగించేందుకు సిద్ధమవుతున్నాయి. ఓ జట్టులో అయితే ఏకంగా 9 మంది ఆటగాళ్లు గాయాలపాలయ్యారు. భారత్ విషయానికి వస్తే జట్టులో గాయపడిన జస్ప్రీత్ బుమ్రాను చేర్చుకుంది. ఆస్ట్రేలియా పర్యటనలో బుమ్రా వెన్ను నొప్పితో బాధపడాల్సి వచ్చింది. బుమ్రాకు స్కాన్, అసెస్‌మెంట్ పరీక్ష రెండు రోజుల క్రితం జరిగింది. నివేదిక అందిన తర్వాతే అతనిని ఛాంపియన్స్ ట్రోఫీలో ఉంచాలా లేదా అనే దానిపై నిర్ణయం తీసుకోనున్నారు. ఇక బుమ్రాతో పాటు, ఇంగ్లాండ్ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ జామీ స్మిత్ కూడా గాయపడ్డాడు. అతను ఛాంపియన్స్ ట్రోఫీలో ఇంగ్లాండ్ జట్టులో భాగం. రాజ్‌కోట్‌లో భారత్‌తో జరిగిన మూడో టీ20లో అతని కాలికి గాయమైంది. ఈ గాయం నుంచి స్మిత్ ఇంకా కోలుకోలేదు. న్యూజిలాండ్‌కు చెందిన స్పీడ్ బౌలర్ లాకీ ఫెర్గూసన్ తొడ కండరాల గాయం కారణంగా ఈ ట్రోఫీతో పాటు, పాకిస్థాన్‌లో జరగనున్న ట్రై నేషన్ సిరీస్‌కు దూరంగా ఉండే అవకాశం ఉంది. దీంతో న్యూజిలాండ్ టీమ్‌కు తీవ్ర నష్టం ఏర్పడనుంది. ఇక పాకిస్తాన్ వర్ధమాన బ్యాట్స్‌మన్ సామ్ అయూబ్‌ను కూడా ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి తొలగించాల్సి వచ్చింది. అతను చీలమండ గాయంతో బాధపడుతున్నాడు. ఈ ఏడాది ప్రారంభంలో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు శామ్ అయూబ్ తీవ్ర గాయపడ్డాడు. అయూబ్ ఫిట్‌గా ఉండి ఉంటే, అతనికి ఖచ్చితంగా పాకిస్తాన్ జట్టులో అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. ఇక ఈ ట్రోఫీ ప్రారంభానికి ముందు ఆస్ట్రేలియాకు అతిపెద్ద దెబ్బ తగిలింది.

ఛాంపియన్స్ ట్రోఫీ టీమ్‌లో చేరిన 3 ఆస్ట్రేలియా ఆటగాళ్లను తొలగించారు. ఒకరు పదవీ విరమణ చేశారు. వెన్ను గాయం కారణంగా మిచెల్ మార్ష్ ఇప్పటికే జట్టుకు దూరమయ్యాడు. ఆ తర్వాత, కెప్టెన్ పాట్ కమ్మిన్స్ చీలమండ, జోష్ హాజిల్‌వుడ్ తుంటి గాయం కారణంగా టోర్నమెంట్‌కు దూరమయ్యాడు. ఇంతలో, ఆస్ట్రేలియా స్టార్ ఆల్ రౌండర్ మార్కస్ స్టోయినిస్ అకస్మాత్తుగా రిటైర్ అయ్యాడు. స్టోయినిస్ కూడా గాయాలతో బాధ పడుతున్నాడు. కాగా ట్రోఫీకి దక్షిణాఫ్రికా జట్టులో భాగమైన ఇద్దరు ఫాస్ట్ బౌలర్లుకూడా పెద్ద ఎదురు దెబ్బ తగిలారు. గజ్జల్లో గాయం, అన్రిక్ నోర్ట్జియా వెన్ను గాయం కారణంగా జెరాల్డ్ కోయెట్జీ ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యాడు.




## సౌతాఫ్రికా టి20 ఫైనల్లో..

# ఛాంపియన్‌గా ముంబై

## రెండు సార్లు విజేత సన్‌రైజర్స్‌కు ఎదురు దెబ్బ

**న్యూఢిల్లీ:** సౌతాఫ్రికా టి20 టోర్నమెంట్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్‌కు ఎదురు దెబ్బ తగిలింది. 20 టోర్నమెంట్‌లో గ్రాండ్ విక్టరీ కొట్టి ముంబై కేప్ టౌన్‌ఛాంపియన్‌గా నిలిచింది. ఇప్పటికే రెండుసార్లు విజేతగా నిలిచిన సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టును చిత్తు చిత్తుగా ఓడించింది. ఈ ఫైనల్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు చెందిన సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టును 76 పరుగుల తేడాతో ముంబై మట్టికరిపించింది. ఈ మ్యాచ్‌లో అద్భుతంగా బౌలింగ్ చేసిన ముంబై బౌలర్ ట్రెంట్ బోల్ట్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ లభించింది. ఈ మ్యాచ్‌లో నాలుగు ఓవర్లు వేసిన బోల్ట్ 9 పరుగులే ఇచ్చి రెండు వికెట్లు తీయడం జరిగింది. దీంతో ఫైనల్‌లో సన్‌రైజర్స్ జట్టు కకావికలమైంది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ముంబై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 181 పరుగులు చేసింది. సన్‌రైజర్స్ బౌలర్లు సరైన లెన్త్‌తో బౌలింగ్ చేయకపోవడంతో ముంబై భారీ స్కోర్ చేయగలిగింది. ఇక ముంబై ఇన్నింగ్స్‌లో ఏ ఒక్క ప్లేయర్ 40 పరుగులు చేయలేకపోయినా, సమిష్టిగా తలా కొన్ని పరుగులు చేశారు. కోనార్ 39 పరుగులు చేయగా, దేవాల్డ్ బ్రేవిస్ 38 పరుగులు చేసి రాణించాడు. వికెట్ కీపర్ రికెల్టన్ 33 పరుగులు చేసి జట్టుకు అమూల్యమైన పరుగులు అందించాడు. లిండే 20 పరుగులు, దుస్సేన్ 23 పరుగులు చేశారు. ఇక ముంబై కెప్టెన్ రషీద్ ఖాన్, హెన్రిక్స్, కోరబిన్ కూడా డకౌట్ అయ్యారు. ముంబై కేప్ టౌన్ ఉంచిన 182 పరుగుల లక్ష్యాన్ని చేదించే క్రమంలో సన్‌రైజర్స్ దారుణంగా విఫలమైంది. ఈ ఫైనల్ మ్యాచ్‌లో 18.4 ఓవర్లు ఆడిన సన్రైజర్స్... 105 పరుగులకే ఆల్ అవుట్ అయింది. టామ్ అంబెల్ ఒక్కడే 30 పరుగులు చేయగా టోనీ 26 పరుగులు చేయగలిగాడు. ఇక సన్‌రైజర్స్ కెప్టెన్ ఐడెన్ మార్క్రం దారుణంగా విఫలమై ఆరు పరుగులకే అవుట్ అయ్యాడు. ఇలా టాప్ ఆర్డర్ బ్యాటర్లు ఎవరూ కూడా రాణించకపోవడంతో సన్‌రైజర్స్ 105 పరుగులకే కుప్పకూలింది. కాగా ఇప్పటికే రెండు సార్లు ఛాంపియన్ గా నిలిచిన సన్‌రైజర్స్ ఈసారి ఫైనల్ పరాజయం పాలవగా, మొదటిసారి సౌతాఫ్రికా టీ20 టోర్నమెంట్ ఛాంపియన్‌గా ముంబై కేప్ టౌన్ నిలిచింది.

## గ్రాండ్‌స్లామ్ చెస్‌లో నాకౌట్‌కు గుకేశ్

**న్యూఢిల్లీ:** ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ చెస్ టూర్‌లో భారత యువ గ్రాండ్ మాస్టర్, ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ నాకౌట్‌కు అర్హత సాధించాడు. జర్మనీలోని హాంబర్గ్‌లో జరిగిన క్వాలిఫయర్స్ చివరి మ్యాచ్‌లో స్టార్ ప్లేయర్ మాగ్నస్ కార్ల్‌సన్ చేతిలో ఓటమి పాలైనప్పటికీ గుకేశ్ ముందంజ వేశాడు. ఈ టోర్నీ మొత్తంలో 9మ్యాచ్‌లు ఆడిన గుకేశ్‌స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోయాడు. ఒక్క మ్యాచ్ లోనూ విజయం సాధించని భారత గ్రాండ్‌మాస్టర్, ఏడు మ్యాచ్‌లను డ్రాచేసుకొని, మరోరెండు మ్యాచ్‌ల్లో ఓటమి పాలయ్యాడు. ఫలితంగా గుకేశ్ ఖాతాలో 3.5పాయింట్లు చేరాయి. పదిమంది ప్లేయర్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో ఎనిమిదో స్థానంలో నిలవడం ద్వారా గుకేశ్ నాకౌట్లో అడుగుపెట్టాడు. క్వాలిఫయింగ్ దశ ముగిసే సరికి ఫ్రాన్స్ గ్రాండ్ మాస్టర్ అలిరెజా ఫిరౌజా, ఉజ్బేకిస్తాన్‌కు చెందిన జవోకిర్ సిందరోవ్ చెరో 6.5 పాయింట్లతో తొలి రెండు స్థానాల్లో నిలిచారు. ఇక అమెరికా గ్రాండ్ మాస్టర్ ఫాబియానో కరున (6 పాయింట్లు) మూడోస్థానం దక్కించుకోగా, మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే), హికారు నకమురా (అమెరికా) చెరో 5.5 పాయింట్లతో వరుసగా నాలుగో, ఐదో స్థానాల్లో నిలిచారు. జర్మనీకి చెందిన విన్సెంట్ కైమెర్ 4 పాయింట్లతో ఆరో ప్లేస్ దక్కించుకున్నాడు. ఉజ్బేకిస్తాన్‌కు చెందిన నొదిర్‌బెక్ అబ్దుసత్తోరోవ్, గుకేశ్ చెరో 3.5 పాయింట్లతో వరుసగా ఏడు, ఎనిమిదో స్థానాల్లో నిలిచారు.

## ముగిసిన టెన్నిస్ స్టార్ 'మాయ' పోరు



**న్యూఢిల్లీ:** ముంబై ఓపెన్ డబ్ల్యూటీఏ-125 టోర్నీలో సంచలన ప్రదర్శన కొనసాగిస్తూ వచ్చిన భారత టీనేజ్ టెన్నిస్ స్టార్ మాయ రాజేశ్వరన్ రేవతి పోరు సెమీ ఫైనల్లో ముగిసింది. ముంబై ఓపెన్ డబ్ల్యూ టీఏ-125 టోర్నీలో వైల్డ్ కార్డ్ ఎంట్రీతో బరిలో కిదిగిన ఆమె అద్భుత ప్రదర్శనతో పలువురు అంతర్జాతీయ క్రీడాకారిణులను కంగుతినిపించి ఒక్క సారిగా వార్తల్లో నిలిచింది. కానీ ఆమె జోరుకు సెమీస్‌లో చుక్కెదురైంది. ఈ మ్యాచ్లో 15 ఏళ్ల భారత ప్లేయర్ 3-6, 1-6తో స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రపంచ 117వ ర్యాంకర్ జిల్ టెచ్‌మన్ చేతిలో పరాజయం చవి చూసింది. మొత్తానికి బరిలోకి దిగిన తొలి సీనియర్ స్థాయి టోరీల్నో మాయ చేసిన పోరాటం అందర్ని ఆకట్టుకుంది. రెండో సెమీస్‌లో ఎనిమిదో సీడ్ మనంచయ సవంగ్‌కావ్ (థాయ్‌లాండ్) 6-2, 6-2తో రెండో సీడ్ రెబెక్కా మరినో (కెనడా)పై గెలిచి ఫైనల్ చేరింది.

# రెండో టెస్టులో..ఆస్ట్రేలియా సూపర్ విక్టరీ



## శ్రీలంక 9 వికెట్ల తేడాతో ఓటమి

**న్యూఢిల్లీ:** వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ సైకిల్ 2023-25ను ఆస్ట్రేలియా సూపర్ విక్టరీతో ముగించింది. గాలే వేదికగా శ్రీలంకతో జరిగిన రెండో టెస్టులో 9 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా ఘనవిజయం సాధించింది. దీంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0 తేడాతో ఆసీస్ క్లీన్ స్వీప్ చేసింది. శ్రీలంక నిర్ధేశించిన 75 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కంగారులు కేవలం ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి చేధించింది. ఉస్మాన్ ఖావాజా (27), మార్నస్ లబుషేన్ (26) ఆజేయంగా నిలిచి మ్యాచ్‌ను ముగించారు. అంతకుముందు 8 వికెట్లు నష్టానికి 211 ఓవర్‌నైట్ స్కోరుతో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన శ్రీలంక తమ రెండో ఇన్నింగ్స్‌లో 231 పరుగులకే ఆలౌటైంది. దీంతో పర్యాటక ఆసీస్ ముందు కేవలం 75 పరుగుల లక్ష్యాన్ని మాత్రమే శ్రీలంక ఉంచగలిగింది. కాగా లంక బ్యాటర్లలో సీనియర్ ఆల్రౌండర్ ఏంజెలో మాథ్యూస్ (149 బంతుల్లో 76; 4 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా, వికెట్ కీపర్ కుశాల్ మెండిస్ (50 బంతుల్లో 48 బ్యాటింగ్; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. ఈ మ్యాచ్ అనంతరం అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకనున్న సీనియర్ బ్యాటర్ దిముత్ కరుణరత్నే (14) ఎక్కువసేపు నిలువలేకపోగా, పతుమ్ నిషాంక (8), దినేశ్ చండిమాల్ (12), కమిందు మెండిస్ (14), కెప్టెన్ ధనంజయ డిసిల్వ (23) విఫలమయ్యారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మాథ్యూ కునేమన్, నాథన్ లియోన్ తలా 4 వికెట్లు పడగొట్టగా, వెబ్స్టర్ రెండు వికెట్లు సాధించాడు. ఇక ఆస్ట్రేలియా తమ తొలి ఇన్నింగ్స్‌లో 414 పరుగుల భారీ స్కోర్ చేయగా, శ్రీలంక తమ మొదటి ఇన్నింగ్స్‌లో 257 పరుగులకే ఆలౌటైంది. ఈ మ్యాచ్‌లో ఆసీస్ స్పిన్నర్లు మాథ్యూ కునేమన్, నాథన్ లియోన్ సత్తా చాటారు. రెండు ఇన్నింగ్స్‌ల కలిపి కునేమన్, లియోన్ చెరో 7 వికెట్లు పడగొట్టారు. కాగా ఆస్ట్రేలియా ఇప్పటికే డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ఆర్హత సాధించింది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భారత్‌ను ఓడించి ఆసీస్ తమ డబ్ల్యూటీసీ బెర్తును ఖారారు చేసుకుంది.

# డీప్ సీక్ ఎఐపై హ్యాకర్ల ఫోకస్

**ముంబై, ఫిబ్రవరి 9:** ఇప్పటికే చైనా ఎఐపై అనేక విమర్శలు వచ్చాయి. దాని వల్ల దేశ భద్రతకు ప్రమాదం కలుగుతుందంటూ పలు దేశాలు నిషేధం విధించాయి. ఇప్పుడు మరో కొత్త విషయం ప్రపంచాన్ని షాక్‌కు గురి చేస్తోంది. డీప్ సీక్ ఏఐని వాడుకుని హ్యాకర్లు అనేక దారుణాలకు పాల్పడే అవకాశం ఉందని చెబుతున్నారు. తాజా చెక్ పాయింట్ నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించారు. డీప్ సీక్ తన కొత్త ఆర్ఐ ఎఐ మోడల్‌ను ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేసింది. దీన్ని అనేక మంది యూజర్లు ఇన్ స్టాల్ చేసుకున్నారు. డీప్ సీక్ ఎఐ సేవలను ప్రశంసించారు. ఇదే సమయంలో హ్యాకర్ల కన్ను డీప్ సీక్ ఎఐపై పడింది. వారు దాని సేవలను పూర్తిగా దుర్వినియోగం చేసే అవకాశం ఉందని సమాచారం. ఎందుకంటే హ్యాకర్ కమ్యూనిటీ ప్రస్తుతం డీప్ సీక్, క్వెన్ ద్వారా హానికరమైన కంటెంట్‌ను డెవలప్ చేయడానికి ఎఐ సాధనాలను ఉపయోగిస్తున్నారు. ఎఐ టెక్నాలజీ కారణంగా అన్ని రంగాలలో పనులు మరింత సులభమయ్యాయి. ఏ సమస్యకైనా చిటికెలో పరిష్కారం చూపుతున్నాయి. దీనితో అనేక కంపెనీలు ఏఐ సేవలపై ఆధారపడుతున్నాయి. మనుషుల కంటే వేగంగా, తప్పులు లేకుండా సమస్యలను పరిష్కరించడం దీని ప్రత్యేకత. అయితే కొత్త ఎఐ మోడళ్లపై అప్రమత్తంగా ఉండాలని భద్రతా నిపుణులు చెబుతున్నారు. చెక్ పాయింట్ సాఫ్ట్‌వేర్ టెక్నా లజీస్ లిమిటెడ్ విడుదల చేసే వార్షిక నివేదికను చెక్ పాయింట్ నివేదిక అంటారు. సైబర్ సెక్యూరిటీకి సంబంధించిన అనేక విషయాలను దీనిలో ఉంటాయి. ప్రపంచ వ్యాప్తంగా సైబర్ దాడులలో 44 శాతం పెరుగుదల నమోదైందని తాజా నివేదికలో తెలిసింది. డీప్ సీక్ మార్కెట్‌లోకి రావడంతోనే సంచలనం రేపింది. వస్తూనే అమెరికా స్టాక్ మార్కెట్‌ను గడగడలాడించింది. దీంతో యూఎస్ టెక్ స్టాక్‌లను భారీగా అమ్ముకోవాల్సి వచ్చింది. డీప్ సీక్ దెబ్బకు ఎన్విడియా, ఒరాకిల్‌తో సహా అనేక మంది బిలియనీర్లు భారీ నష్టాల బారిన పడ్డారు. ఒక రకంగా చెప్పాలంటే చైనాకు చెందిన డీప్ సీక్ ఏఐని చూసి అమెరికా కూడా భయపడింది. చైనాకు చెందిన లియాంగ్ వెన్ ఫెంగ్ అనే వ్యాపారవేత్త ఏఐ కంపెనీ డీప్ సీక్ ఏర్పాటు చేశారు. అమెరికాకు ధీటుగా చైనాను నిలిపేందుకే కొత్త చాట్ బాట్ రూపొందించినట్టు చెప్పాడు. డీప్ సీక్ ఉత్పాదక ఎఐ మోడల్ రిలీజ్ వల్ల అమెరికాలోని టెక్ స్టాక్‌లలో భారీ అమ్మకాలు జరిగాయి. ప్రముఖ చిప్ కంపెనీ అయిన ఎన్విడియా దాదాపు 600 బిలియన్ల నష్టపోయింది. ఒరాకిల్ ఛైరమ్ లారీ ఎల్లిసన్ కు 27.6 దాలర్లు, ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్‌కు 20.8 బిలియన్ దాలర్ల నష్టం కలిగింది.



# భారీగా పెరిగిన విదేశీ మారకద్రవ్యం..

**ముంబై, ఫిబ్రవరి 9:** జనవరి 31తో ముగిసిన వారానికి భారతదేశ ఫారెక్స్ నిల్వలు 1.05 బిలియన్ డాలర్లు పెరిగి 630.607 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని ఆర్‌బీఐ ఇటీవల తెలిపింది. గత నివేదికలో మొత్తం నిల్వలు 5.574 బిలియన్ల డాలర్ల నుంచి పెరిగి 629.557 బిలియన్ల డాలర్లకు చేరుకున్నాయి. రూపాయిలో అస్థిరతలను తగ్గించడంలో ఆర్‌బీఐ కీలక చర్యలు తీసుకుంటుంది. ముఖ్యంగా ఫారెక్స్ మార్కెట్ జోక్యాలతో పాటు పునఃమూల్యాంకనం వంటి చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఆర్‌బీఐ చర్యల కారణంగా గత కొన్ని వారాలుగా వాల్యూ పరంగా తగ్గుతున్న నిల్వలు వరుసగా రెండవ వారంలో పెరిగాయి. 2024 సెప్టెంబర్ చివరి నాటికి ఫారెక్స్ నిల్వలు ఆల్ టైమ్ గరిష్ట స్థాయికు చేరాయి. అంటే ఫారెక్స్ నిల్వలు 704.885 బిలియన్ల డాలర్లకు పెరిగాయి. జనవరి 31తో ముగిసిన వారానికి నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 207 మిలియన్ డాలర్లు తగ్గి 537.684 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని శుక్రవారం విడుదల చేసిన డేటా ప్రకారం వెల్లడైంది. డాలర్ పరంగా వ్యక్తీకరించిన విదేశీ కరెన్సీ ఆస్తులలో విదేశీ మారక నిల్వలలో ఉన్న యూరో, పౌండ్, యెన్ వంటి యూఎస్ యేతర యూనిట్ల పెరుగుదల లేదా తరుగుదల ప్రభావం ఉంటుంది. ఈ వారంలో బంగారం నిల్వలు 1.242 బిలియన్ డాలర్లు పెరిగి 70.893 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలిపింది. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 29 మిలియన్ల డాలర్లు పెరిగి 17.889 బిలియన్ల డాలర్లకు చేరుకున్నాయని అపెక్స్ బ్యాంక్ తెలిపింది. ఈ బ్యాంక్ గత వారం తెలిపిన వివరాల ప్రకారం భారతదేశం యొక్క నిల్వ స్థానం 14 మిలియన్ల డాలర్లకు తగ్గి 4.141 బిలియన్ల డాలర్లకు చేరుకుంది.



## వాణిజ్యం

# బెంగళూరులో ఇల్లు కొంటున్న తెలుగు టెక్కీలకు అలర్ట్!

**బెంగళూరు, ఫిబ్రవరి 9:** ఇండియన్ సిలికాన్ వ్యాలీగా ఉన్న బెంగళూరుకు దేశంలోని అనేక ప్రాంతాలకు చెందిన ఉద్యోగులు పనిచేసేందుకు వస్తూనే ఉంటారు. అయితే ఆ నగరంలో ఎక్కువగా స్థిరపడిన వారిలో ఎక్కువ శాతం రెండు తెలుగురాష్ట్రాలకు చెందిన ఉద్యోగులు, టెక్కీలు, వ్యాపారులు ఉన్నారు. ఈ క్రమంలోనే ఉద్యోగం కోసం నగరానికి వెళుతున్న వారు క్రమంగా అక్కడే స్థిరపడాలని ఇల్లు కూడా కొనాలని ప్లాన్ చేసుకుంటున్నారు. బెంగళూరును దశాబ్దాలుగా వెంటాడుతున్న రెండు సమస్యల్లో ఒకటి ట్రాఫిక్ ఇబ్బందులు కాగా రెండవది నీటిఎద్దడి సమస్య. అయితే నిరంతరం నగరంలో పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా కర్ణాటక ప్రభుత్వం ఫ్లైఓవర్లను నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. దాదాపు రూ.9,800 కోట్లను కొత్త ఫ్లైఓవర్ల నిర్మాణానికి ఉపయోగించటం వ్యర్థమని ప్లానర్లు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం లాస్ట్ మైల్ కనెక్టివిటీపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం నగరంలోని జేపీ నగర్ నుంచి హెబ్బల్ మధ్య నిర్మిస్తున్న పొడవైన డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణంపై ప్రస్తుతం నిపుణుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ప్రతిపాదిత రోడ్ కమ్ మెట్రో కారిడార్ ప్రాజెక్ట్ తప్పుడు దిశలో ఒక అడుగని మొబిలిటీ నిపుణులు చెబుతున్నారు. టన్నెల్ రోడ్లు,డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లు వంటి మౌలిక సదుపాయ ప్రాజెక్టులు ప్రజా రవాణా నెట్‌వర్క్‌లో ప్రయాణికుల సంఖ్యను, వాటాను తగ్గిస్తాయని వారు వాదిస్తున్నారు. రూ.9,800కోట్ల ప్రాజెక్టు కేవలం తాత్కాలిక ఉపశమనం మాత్రమే అందిస్తుందని రద్దీ పాయింట్‌ను మారుస్తుందని నిపుణులు సూచిస్తుంది. కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న చర్యలు నగరంలో నివసించే ప్రజల జీవితాల నాణ్యతను మెరుగుపరచదని నిపుణులు వాదిస్తున్నారు. ప్రజారవాణా కనెక్టివిటీ ద్వారా మాత్రమే అందరికీ ప్రాప్యత లభిస్తుందని వారు చెబుతున్నారు. ప్రాజెక్ట్ కోసం అన్ని వనరులను ప్రజా రవాణా వ్యవస్థలకు లాస్ట్ మైలు కనెక్టివిటీని అభివృద్ధి చేయడానికి ఉపయోగించాలి. ప్రైవేట్ ఆటగాళ్లను ఈ స్థలంలోకి అనుమతించడానికి ప్రభుత్వం స్టేజ్ క్యారేజ్ చట్టాన్ని సవరించాలని పబ్లిక్ మొబిలిటీ ప్రతిపాదకుడు సందీప్ అనిరుధన్ పేర్కొన్నారు. ప్రస్తుతం చాలా మంది తెలుగు ఐటీ ఉద్యోగులు ఇంటి అద్దెలు చెల్లించటం కంటే సొంతిల్లు కొనుక్కుని దానికి ఇఎంఐ చెల్లించటం ఉత్తమంగా బెంగళూరులో భావిస్తున్నారు. ఈ క్రమంలో సొంత ఇల్లు కొనుక్కునే ముందు ఆ ప్రాంతానికి రవాణా వ్యవస్థ కనెక్టివిటీ, ట్రాఫిక్ సమస్యలు వంటి వాటిని ముందుగా పరిగణలోకి తీసుకుని ప్రాపర్టీ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీనికి తోడు సదరు ప్రాంతంలో నీటి సమస్యలను సైతం ప్రజలు పరిగణలోకి తీసుకోవాలని రియల్టీ నిపుణులు సూచిస్తున్నారు. ఇవి భవిష్యత్తులో ఇల్లు అమ్మాలనుకున్నప్పుడు మంచి ధర రావటానికి కూడా సహాయంగా నిలుస్తాయని నిపుణులు సూచిస్తున్నారు.



# నేటి మార్కెట్‌కు నిపుణులు సూచన

**ముంబై, ఫిబ్రవరి 9:** గతవారం దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ ఒడుదొడుకులను చూశాయి. దీనికి ప్రధాన కారణాలను పరిశీలిస్తే,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాపై విధించిన టారిఫ్స్ ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్ల పనితీరును వాణిజ్య యుద్ధ భయాలు కమ్మేయటంతో తీవ్ర ఒడిదొడుకులకు లోనయ్యాయి. ఇవి పెట్టుబడిదారుల సెంటిమెంట్లను భారీగా దెబ్బతీశాయి. ఇదే క్రమంలో భారతీయ స్టాక్ మార్కెట్ల విషయానికి వస్తే, ట్రంప్ ట్రేడ్‌యుద్ధంతో పాటు డిపోర్టేషన్, రిజర్వు బ్యాంక్ మానిటరీ పాలసీ సమావేశం వంటి ఇతర అంశాలు మార్కెట్లను ప్రభావితం చేశాయి. రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గింపును ప్రకటించినప్పటికీ వరుసగా మూడోరోజు కూడా శుక్రవారం మార్కెట్లు నష్టాల్లోనే క్లోజ్ కావటం గమనార్హం. ఈవారం ట్రేడింగ్ సెషన్లను పరిశీలిస్తే ప్రధానంగా కీలక బెంచ్ మార్క్ సూచీలు భారీ ఓలటాలిటీని చూశాయి. ఇటీవలి బడ్జెట్లో ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ప్రకటించిన ఆదాయపు పన్ను కోతలు, ఆర్బీఐ వడ్డీ రేట్ల తగ్గింపులు ఆర్థిక వృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తాయి. అయితే దాని విజయం పన్ను పొదుపులు అధిక వినియోగం, పెట్టుబడిగా ఎంత ప్రభావవంతంగా అనువదిస్తాయనే దానిపై ఆధారపడి ఉంటుందని కేపిటల్ మైండ్సెట్ ప్రతినిధి కృష్ణ అప్పల అభిప్రాయపడ్డారు. ద్రవ్యోల్బణం అదుపులో ఉంటే భారత ఆర్థిక వ్యవస్థ స్థిరమైన రికవరీని చూపిస్తుందని ఆయన పేర్కొన్నారు. వ్యాపారులు, ఇన్వెస్టర్లు కొత్తగా వచ్చే అవకాశాలను ఉపయోగించుకోవడానికి ఇది కీలకమైన కాలంగా మారుతుందని అన్నారు.

# చిన్న, మధ్యతరహా వ్యాపారుల కోసం ఎస్ఎంఎఫ్‌జి

**ముంబై, ఫిబ్రవరి 9:** ఎస్ఎంఎఫ్ జీ ఇండియా క్రెడిట్ బిజినెస్ లోన్ కొత్త బ్రాండ్ ఫిల్మ్ రిలీజ్ చేసింది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, వ్యాపారులకు ఆర్థిక సాయం అందించే థీమ్‌తో దీన్ని రూపొందించింది. వారిలో ఒక ఆశ నింపేందుకు, వారి జీవితాలను సమూలంగా మార్చేందుకు, వారి ముందున్న అనంతమైన అవకాశాలను తెలియజేస్తూ ఈ బ్రాండ్ ఫిల్మ్ రూపొందింది. చిన్న, మధ్య తరహా వ్యాపారుల కోసం ఎస్ఎంఎఫ్‌జీ ఎంత కమిట్‌మెంట్‌తో ఉందో ఈ ఫిల్మ్ తెలియజెప్తుంది. వారు మరింత పెద్ద కలలు కనేందుకు, మరింత ఎదిగేందుకు, అభివృద్ధి చెందేందుకు ఎస్ఎంఎఫ్ జీఇండియా క్రెడిట్ బిజినెస్ లోన్ ఎలా సహకరిస్తుందో కళ్లకు కట్టినట్టు ఉంది. వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు కష్టాలు పడుతున్న ఓ చిన్న రిటైలర్ జీవితంలో జరిగే సంఘటనలకు హాస్యాన్ని జోడించి, మ్యూజికల్ టచ్ ఇచ్చి మరింత హృద్యంగా ఈ ఫిల్మ్ చిత్రీకరించారు. ఎస్ఎంఎఫ్ జీ ఇండియా క్రెడిట్ బిజినెస్ లోన్ అనేది ఆ చిరు వ్యాపారి జీవితాన్ని ఎలా మలుపుతిప్పింది? ఆ తర్వాత అతని జీవితం ఎలా మారిపోయింది?, అతనికి కొత్త గుర్తింపును ఎలా తీసుకొచ్చింది? ఆతని ఆర్థిక పరిస్థితి ఎంత మెరుగుపడిందనే అంశాలను హృద్యంగా చిత్రీకరించారు. ఒక వ్యక్తి ఆశయం, అతని ఆర్థిక స్వావలంబన ఎంత పవర్ ఫుల్‌గా ఉంటుందో ఈ ఫిల్మ్‌లో అంతర్లీనంగా ఉంటుంది. ఈ ఫిల్మ్ గురించి ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ అజయ్ పరీక్ మాట్లాడుతూ 'భారతదేశ జీడీపీలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల వాటా 30శాతం ఉంది. ఉద్యోగాల కల్పనలో ఇవి కీలక భూమిక పోషిస్తాయి. కానీ, వారికి రుణాలు కావాల్సినప్పుడు మాత్రం కొన్ని సమస్యలు ఎదురవుతూ ఉంటాయి. అలాంటి వారికి సరళమైన రేటుకే వడ్డీకి, తక్కువ డాక్యుమెంట్లు, సులభమైన చెల్లిపు పద్ధతుల్లో ఎస్ఎంఎఫ్ జీ ఇండియా క్రెడిట్ రుణాలు ఎలా కల్పిస్తుందో ఈ బ్రాండ్ ఫిల్మ్ తెలియజేస్తుంది. టార్గెట్ ఆడియన్స్‌ను చేరుకోవడానికి సరిపోయే భిన్నమైన కథనం, మ్యూజికల్ టచ్, సరదాగా ఉండే సన్నివేశాలు అన్నీ ఈ ఫిల్మ్‌లో ఉన్నాయి.' అని అన్నారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.